నిర్మల్, మంచిర్యాల
కుమురంభీం-ఆసిఫాబాద్
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నవతెలంగాణ 8వ వార్షికోత్సవ ప్రత్యేక సంచిక
12 పేజీలు | బుధవారం 13 సెప్టెంబర్ 2023 | www.navatelangana.com

గిరిజన జిల్లా..పర్యాటక ఖిల్లా..!

- కుమురంభీం-ఆసిఫాబాద్ జిల్లాలో చూడచక్కని ప్రదేశాలెన్నో...ఎన్నెన్నో...

నవతెలంగాణ-కాగజ్‌నగర్

తెలంగాణ రాష్ట్రంలోనే పూర్తిగా వెనుకబడ్డ జిల్లా కుమురంభీం-ఆసిఫాబాద్ జిల్లా. ఉమ్మడి రాష్ట్రంలో ఆదిలాబాద్ జిల్లా పరిధిలో ఉన్న ఈ ప్రాంతం తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత ఏర్పడ్డ కొత్త జిల్లాలలో ఇది ఒక జిల్లాగా ఏర్పాటైంది. గిరిజన పోరాట యోధుడు కుమురంభీం జన్మించిన స్థలం జోడేఘాట్ ఈ జిల్లాలోనే ఉండడం, ఆదివాసీ గిరిజనులు ఈ జిల్లాలో అధికంగా ఉండడంతో ఈ జిల్లాకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కుమురంభీం-ఆసిఫాబాద్ జిల్లాగా నామకరణం చేసింది. అభివృద్ధిలో వెనుకబాటుకు గురైనా ఈ జిల్లాలో పర్యాటక ప్రదేశాలకు మాత్రం కొదవ లేదు. జిల్లాలో ఏ ప్రాంతానికి వెళ్లినా ఆహ్లాదకర వాతావరణమే దర్శనమిస్తుంటుంది. అడవుల జిల్లాగా పేరు పొందిన ఈ జిల్లాలోని పర్యాటక ప్రదేశాలను రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చేస్తే పర్యాటక పరంగా జిల్లా అభివృద్ధి చెందే అవకాశముంది.


పర్యాటక ప్రాంతంగా రూపుదిద్దుకున్న కుమురంభీం స్వగ్రామం జోడేఘాట్

జోడేఘాట్‌లో భీం మ్యూజియం

కెరమెరి మండలం జోడేఘాట్‌లో కుమురంభీం మ్యూజియాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. భీం స్వగ్రామం జోడేఘాట్ కావడం, ఆయన సమాధి కూడా అక్కడే ఉండడంతో ప్రభుత్వం ఈ ప్రదేశాన్ని పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్దేందుకు ఏర్పాట్లు చేపట్టింది. ఇందులో భాగంగా ఇప్పటికే మ్యూజియం ఏర్పాటు చేశారు. భీం స్మారక స్థూపాన్ని నిర్మించారు. ప్రతీ ఏటా అక్టోబర్‌లో అశ్వయుజ శుద్ధ పౌర్ణమి రోజున భీం వర్ధంతిని ప్రభుత్వమే ఘనంగా నిర్వహిస్తుంది. దీనికి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రజలే కాకుండా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్ నుండి కూడా ప్రజలు విచ్చేస్తుంటారు. కెరమెరి మండల కేంద్రం నుండి 21 కిలోమీటర్ల దూరంలో ఈ గ్రామం ఉంటుంది. దట్టమైన అరణ్యప్రాంతం గుండా ప్రయాణించాల్సి ఉంటుంది. ఇంతకుముందు వరకు రోడ్డు నిర్మాణం సరిగా లేకున్నా, తెలంగాణ రాష్ట్ర

మిగతా..3లో...

రైతులకు అందుబాటులో ఉంటున్నాం

• వ్యవసాయ శాఖ అధికారిణి మధులత



నవతెలంగాణ-సిర్పూర్(టి)

రైతులకు వ్యవసాయంలో నూతన వ్యవసాయ విధానాలను ఎప్పటికప్పుడు రైతులకు అందిస్తూ అధికా దిగుబడులు సాధించే విదంగా ఎల్లవేళలా అందుబాటులో ఉంటున్నామని మండల వ్యవసాయ అధికారిని మధులత తెలిపారు. నవతెలంగాణ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేకంగా మాట్లాడారు. ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి వ్యవసాయ భూములను భూసార పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. దీనివల్ల రైతులు అనేక లాభాలు పొందుతూ పంటల సాగులో రైతులు ఆసక్తి చూపే విధంగా పూర్తి సహకారం అందిస్తున్నామన్నారు. మండలంలో మొత్తం 10257 మంది రైతులు ఉండగా వీరిలో 7176 మంది రైతులు రైతుబందు పథకం ద్వారా లబ్ధిపొందుతున్నారని పేర్కొన్నారు. రైతుబందు ద్వారా రైతలుకు లబ్ది చేకూరే విదంగా తమ సిబ్బంది వారి వద్దకు వెల్లి పేర్లు నమోదు చేస్తున్నారని తెలిపారు. రైతుబీమాకు 3550 మంది దరఖాస్తు చేసుకోగా ఇప్పటివరకు 72 మంది దీని ద్వారా లబ్ధిపొందారన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలు ఉపయోగించుకోవాలని రైతులకు సూచిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం మండలంలో వరి పంట ఐదు వేల ఎకరాలు, పత్తి పంట 14 వేల ఎకరాలు, కందులు, ఇతర చిరుధాన్యాలు 21 వేల ఎకరాలు సాగులో ఉందని తెలిపారు. ప్రభుత్వం నుంచి రైతులకు సబ్సిడీ ద్వారా ఈ ఆర్థిక సంవత్సరంలో సహకార బ్యాంకు ద్వారా 500 మెట్రిక్ టన్నులు, ఆగ్రోస్ ద్వారా 400 మెట్రిక్ టన్నుల ఎరువులు రైతులకు అందుబాటులో ఉంచాంమన్నారు. ఇతర ఫర్టిలైజర్ దుకాణాల ద్వారా కూడా ఎరువులు అందుబాటులో ఉంచామని తెలిపారు. ప్రక్క రాష్ట్రాల నుంచి నకిలి విత్తనాలు, ఎరువులు అక్రమంగా రవాణా కాకుండా ఎప్పటికప్పుడు పోలీసుల సహకారంతో నిగా ఉంచామన్నారు. పెన్‌గంగా ప్రవాహంతో నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నుంచి పంట రుణాలు అందే విదంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అలాగే రైతులకు వివిధ రకాల పంటలు సాగుచేసే క్రమంలో వారికి సలహాలు, సూచనలు చేస్తున్నామన్నారు.

మూగజీవాల సంక్షేమమే లక్ష్యం

• పశు వైద్యాధికారి శ్రీకాంత్

నవతెలంగాణ-కౌటాల



మూగజీవాల సంక్షేమమే నా లక్ష్యమని పశు వైద్యాధికారి శ్రీకాంత్ అన్నారు. నవతెలంగాణ వార్షికోత్సవం సందర్భంగా ఆయన ముచ్చటించారు. మండలంలోని 20 గ్రామ పంచాయతీల్లోని వాటి అనుబంధ గ్రామాల్లో ఉన్న మూగజీవాలు, పశువులు, గేదెలు, గొర్రెలు, మేకలు, ఎద్దులు వాటి సంక్షేమం కోసం నిరంతరం పనిచేస్తానని, గత రెండు సంవత్సరాల నుంచి మండలంలోని అన్ని గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటుచేసి మూగజీవాల సంరక్షణ కోసం టీకాలు పంపిణీ, నట్టల నివారణ మందులు పంపిణీ అందించడం జరిగిందని తెలిపారు. మూగజీవాల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండి ఎలాంటి వ్యాధులు సోకిన తమకు సమాచారం అందిస్తే ఇంటికెళ్లి ఉచితంగానే వైద్యసేవలు చేసి మూగజీవాలను రక్షించేందుకు ఎళ్లవేళల పనిచేస్తానని అన్నారు. రైతులెవరు అధైర్య పడకుండా ఎలాంటి వ్యాధులు సోకిన తమకు సమాచారం అందించాలని రైతులను కోరారు. మూగజీవాల వైద్యం కోసం పనిచేస్తూ వాటి రక్షణ కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. మండలంలోని ఏ ఒక్క గ్రామంలో కూడా వైద్యశిబిరాలు నిర్వహించకుండా ఉండడంలేదని, శిబిరాలు నిర్వహించినప్పుడు చికిత్సలు కాదని ఎళ్లవేళల వైద్యం చేయడానికి నేను సిద్ధంగా ఉన్నానని, రైతులు గమనించి నా సేవలను సద్వినియోగం చేసుకొని నాతోపాటు రైతులు నాకు సహకరించి మూగజీవాల రక్షణ కోసం పాటుపడాలని కోరారు.

పర్యాటకం..ప్రతిపాదనలకే పరిమితం..!

• దశాబ్దాల చరిత్ర కలిగిన శివ్వారం మొసళ్ల అభయారణ్యం
• అభివృద్ధి చేయడంలో పాలకుల నిర్లక్ష్యం

నవతెలంగాణ-జైపూర్

మంచిర్యాల జిల్లా జైపూర్ శివారు గోదావరి నదీ (ఎల్ మడుగు) తీరం ప్రపంచ పటంలో గుర్తించబడింది. శివ్వారం మొసళ్ల అభయారన్యంలో భౌగోలికంగా ఉత్తర అంక్షాంశంలో 18 డిగ్రీల 35 మినట్స్, 18 డిగ్రీల 45 మినట్స్, తూర్పు రేఖాంశంలో 79 డిగ్రీల 49 మినట్స్, 70 డిగ్రీల 50 మినట్స్‌లో దీనిని ప్రపంచ పటంలో గుర్తించారు. ఈ ప్రదేశం జంతుజాలంతో పాటు వివిధ రకాల పక్షులు, విలువైన ఔషద గుణాలు కలిగిన వన మూలికలు సొంతం. కాంతులీనే బండరాళ్లు ఇక్కడ గుర్తించవచ్చు. ఆకురాలు అడవుల్లో గల ఈ ప్రదేశాన్ని జీఓ నెం. 364తో 1978లో శివ్వారం మొసళ్ల అభయారణ్యంగా గుర్తించి పర్యాటక ప్రాంతంగా ప్రకటించారు. ఏడాది 43 రోజులు ఇక్కడ వర్షం కురుస్తుండగా 75 శాతం వర్షపాతం నమోదువుతున్నట్లు అటవీశాఖ అధికారులు పేర్కొంటున్నారు.



చరిత్రకు సాక్ష్యం..అభివృద్ధికి దూరం..!

గడిచిన చరిత్రకు నిలువుటద్దంలా ప్రకృతి ఒడిలో ఇమిడివున్న ఈ ప్రాంతం క్రీస్తు పూర్వం 4,5 శతాబ్ధాల్లో గుర్తించినట్లు చరిత్రకారుల ద్వారా తెలిసింది. వేములవాడ కేంద్రంగా పరిపాలించిన విష్ణుకుండిని శివ్వారం శివారు గోదావరి నది ఎల్ మడుగు నుండి మొదలు చెన్నూర్ మండలం అడవి సోమనపల్లి వరకు గోదావరి పొడవున వ్యాపించి వున్న గుట్టలను తొలిగించి గుహాలయాలు నిర్మించినట్లు చరిత్ర పరిశోధకులు పేర్కొంటున్నారు. నేటి మంథనిని నాటి రోజులో మంత్రినగరిగా పిలువబడుతున్న రోజుల్లో అందుబాటులో ఉన్న ఆయుధాలతో గుట్టలను తొలపించిన చెక్కడాలు ఇప్పటికి ఇక్కడ చెక్కు



చెదరకుండా దర్శనమిస్తున్నాయి. ఆ రోజుల్లో ఇక్కడి మడిగీల ద్వారా వ్యాపారులు లావాదేవీలు కొనసాగించినట్లు తెలుస్తుంది. 30 చదరపు కిలో మీటర్ల పరిధిలో మొసళ్ల అభయారణ్యం విస్తరించింది.ఉమ్మడి ఆదిలాబాద్-కరీంనగర్ జిల్లాలను విభజిస్తూ ఎత్తైన గుట్టలు, హద్దులుగా కుందారం బ్లాక్ రక్షిత అటవీ ప్రాంతంలో 2,981.68 హెక్టార్లలో ఈ అభయారణ్యం ఇమిడివుంది. 300 హెక్టార్ల పరిధిలో 500 రకాలైన జీవులకు ఆవాసంగా ఈ మొసళ్ల అభయారణ్యం ఆవాస కేంద్రంగా ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

పరిహాసంగా మారిన పర్యాటక కేంద్రం

నాటి శిల్పకళ, రాతి చెక్కడాలు, అతపాతాలంగా ఉన్న గోదావరి నది గర్భం, ఎత్తైన చెట్లు, కనువిందుగా కన్పించే ఇక్కడి నది ప్రవాహక సోయగం. పర్వతగిరి హద్దులుగా ప్రవహిస్తున్న గోదావరి తీరుతెన్నులు చూడముచ్చటగా ఉంటాయి. కానీ ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడంలో పర్యాటకశాఖ నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్‌తో పాటు పలువురు జిల్లా అధికారులు శివ్వారం మొసళ్ల అభయారణ్యంలో పర్యటించారు. స్థానిక గ్రామ పంచాయతి సర్పంచ్ ఆవిడపు గణేష్ అభ్యర్థన మేరకు పర్యాటక కేంద్రంలో వసతుల కల్పనకు సహకరించేందుకు హామీ ఇచ్చినట్లు తెలిపారు. శివ్వారం ఎల్ మడుగును గతంలో సందర్శించిన పలువురు ప్రజా ప్రతినిధులు ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. కానీ నేటికీ నెరవేరడం లేదు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టిసారించి అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.



శాంతిభద్రతల పరిరక్షణ ప్రధాన ధ్యేయం

• ఫ్రెండ్లీ పోలీసింగ్ వ్యవస్థతో చేరువయ్యే అవకాశం • సీఐ జవ్వాజి సురేష్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

పోలీసుల అంటేనే ప్రజల్లో ఒక రకమైన భయాందోళనలు ఉంటాయి. ఎంత అవసరం పడ్డ పోలీస్‌స్టేషన్‌కు వెళ్తే పరువు ప్రతిష్టలు పోతాయని కొన్ని కుటుంబాల్లో నేటికి ఒక అపవాదు ఉంది. ఈ భావనను ప్రజల మనసులో నుంచి తొలగించడానికి పోలీసులు ప్రజలకు దగ్గర కావడానికి అన్ని రకాల కార్యక్రమాలు చేస్తూనే ఫ్రెండ్లీ పోలీసింగ్ వ్యవస్థను తీసుకువచ్చారు. వెనుకబడిన జిల్లా ఆసిఫాబాద్ లాంటి ఆదివాసి జిల్లాలో పోలీసులకు శాంతిభద్రతల విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకున్నప్పటికీ ప్రజలను చైతన్య పరచడంలో ప్రతి క్షణం పనిచేయాల్సి వస్తున్న నేపథ్యంలో తమ విధులను సమర్ధవంతంగా నిర్వహిస్తూ, ప్రజలకు దగ్గరవుతూ, ప్రతి విషయంలో తామున్నామంటూ ఫ్రెండ్లీ పోలీసింగ్ పకడ్బందీగా అమలు చేస్తున్నామంటున్న ఆసిఫాబాద్ టౌన్ సీఐ జవ్వాజి సురేష్ నవతెలంగాణతో మాట్లాడారు. ఎస్సైగా జైనూర్‌లో సమత కేసు చేదించడం నిందితులకు శిక్ష వేయించడంలో తాను పాత్రధారినయ్యానని ఇది ఎన్నటికీ మర్చిపోలేనని తెలిపారు. జిల్లాకు మళ్ళీ ప్రమోషన్‌తో రావడం సంతోషంగా ఉందని, ప్రజలతో నాకు గతంలో ఉన్న సంబంధం వల్ల విధి నిర్వహణలో ఉన్న ఇబ్బందులను అధిగమించడానికి అవకాశం ఏర్పడిందన్నారు. ఆసిఫాబాద్ టౌన్ పరిధిలో పనిచేస్తున్న అధికారులతో ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహిస్తున్నామని, స్టేషన్ పరిధిలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహించకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలు ఎక్కడైనా జరిగినట్లయితే సంబంధిత ప్రాంతంలో ఉన్న వ్యక్తులు పోలీసులకు సమాచారం అందించే విధంగా గ్రామాల వారీగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు.



ఆదివాసీలు విద్య వైద్య పరంగా కొంత వెనకబడే ఉన్నారని, వారిలో విద్యాభివృద్ధి కోసం పోలీస్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. పాఠశాలలకు వెళ్ళకుండా పనులకు వెళ్లే వారిని గుర్తించి పాఠశాలల్లో చేర్పించడానికి గ్రామాల వారిగా ఎస్సైలు ప్రత్యేక కృషి చేస్తున్నారని అన్నారు. జూబ్లీ మార్కెట్ పూర్తి కావడంతో జిల్లా కేంద్రంలో కొంత ట్రాఫిక్ తగ్గినప్పటికీ పూర్తిస్థాయిలో ట్రాఫిక్ నియంత్రించడానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. 5ఎస్ విధానం అమలులో ఇప్పటికే గతంలో ఆసిఫాబాద్ పోలీస్‌స్టేషన్ మొదటి స్థానం సాధించిన విషయం తెలిసిందేనని ఈ విధానాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నామని తెలిపారు. స్టేషన్ ఆవరణలో కూడా పచ్చదనం ఉట్టిపడేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ నేపథ్యంలో గతంలో జరిగిన గిరిజన ఆదివాసి గొడవల నేపథ్యంలో జిల్లాలో 30 యాక్ట్ అమలు అవుతున్న విషయం తెలిసిందేనని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్టేషన్ పరిధిలో ఈ యాక్ట్ అమలు చేస్తున్నామన్నారు. భవిష్యత్తులో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దీనిని ఎప్పటివరకు కొనసాగించడం అనేది ఆధారపడి ఉంటుందన్నారు. టౌన్ పరిధిలో ఎటువంటి ఆస్తి దోపిడీలు జరగకుండా ప్రతిరోజు రాత్రి గస్తీ నిర్వహిస్తున్నామన్నారు. దీనికోసం ప్రతి రోజు ఒక ఎస్సై స్థాయి అధికారితో కూడిన బందం గస్తీలో పాల్గొంటుందన్నారు. మహిళలు, విద్యార్థినుల రక్షణకు ఉన్న చట్టాల గురించి షీ టీం వారితో ప్రత్యేకంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. టౌన్ పరిధిలో క్రైమ్ రేట్ తగ్గించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. జిల్లా కేంద్రంలోని ట్రాఫిక్ నివారించడానికి వివేకానంద చౌక్, కొమరం భీమ్ చౌక్, అంబేద్కర్ చౌక్ ప్రాంతంలో ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారికి ఫైన్ వేయడానికి ప్రత్యేకంగా సీసీ కెమెరాలను గతంలోనే ఏర్పాటు చేసామన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రజలు ట్రాఫిక్ నియంత్రణకు సహకరించాలని కోరారు. రానున్న ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించడానికి స్టేషన్ పరిధిలో పోలీసులను పూర్తిస్థాయిలో సిద్ధం చేస్తున్నట్టు వివరించారు.

గిరిజన జిల్లా..పర్యాటక ఖిల్లా..!


కెరమెరి మండలంలోని బాబేఝరి జలపాతం

(మొదటి పేజీ తరువాయి)

ఆవిర్భావం తర్వాత డబుల్ రోడ్డు నిర్మించడంతో సందర్శకులు జోడేఘాట్ వరకు వాహనాలలో వెళ్లే వీలుంది.

మార్లవాయిలో హేమన్‌డార్ఫ్ జ్ఞాపకాలు

జైనూర్ మండల కేంద్రానికి మూడు కిలోమీటర్ల దూరంలో మార్లవాయి గ్రామం ఉంటుంది. ఆదివాసీల స్థితిగతులపై అధ్యయనం చేసేందుకు విదేశాల నుండి వచ్చిన హేమన్‌డార్ఫ్-ఎలిజబెత్ దంపతులు ఇక్కడే స్థిర నివాసం ఏర్పాటు చేసుకొని గిరిజనులతో మమేకమయ్యారు. వీరి సమాధులు సైతం ఇక్కడే ఉండడంతో ప్రభుత్వం ఈ ప్రాంతాన్ని ప్రత్యేకంగా గుర్తించి అభివృద్ధి చేస్తోంది. హేమన్‌డార్ఫ్ దంపతుల విగ్రహాల ఏర్పాటుతో పాటు ఈ గ్రామంలోని చెరువుకు హేమన్‌డార్ఫ్ పేరు పెట్టి మినీ ట్యాంక్‌బండ్‌గా తీర్చిదిద్దే ప్రయత్నంలో ఉంది. ప్రతీ జనవరి 11న హేమన్‌డార్ఫ్ జయంతిని ప్రభుత్వమే అధికారికంగా నిర్వహిస్తుంది. ఈ ప్రాంతాన్ని వీక్షించేందుకు ఎక్కువ సంఖ్యలో ప్రజలు ఆసక్తి చూపుతున్నారు.

మిట్టె జలపాతం

లింగాపూర్ మండల కేంద్రం నుండి మూడు కిలోమీటర్ల దూరంలో ఉంటుంది ఈ జలపాతం. దట్టమైన అడవి మధ్యలో ఉన్న ఈ జలాపాతానికి సరైన రోడ్డు సౌకర్యం లేదు. అతికష్టం మీద ద్విచక్రవాహనంపై వెళ్లవచ్చు. వర్షాకాలమైతే కాలినడకే శరణ్యం. ఈ జలపాతాన్ని తిలకించేందుకు హైదరాబాద్, మహారాష్ట్ర నుండి కూడా సందర్శకులు విచ్చేస్తుంటారు. దీన్నే సప్తగుండాల జలపాతమని కూడా పిలుస్తుంటారు. ప్రభుత్వం ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తే పర్యాటకుల సంఖ్య మరింత పెరిగే అవకాశముంది.

బాబేఝరి జలపాతం

కెరమెరి మండలకేంద్రానికి 11 కిలోమీటర్ల దూరంలో జోడేఘాట్ వెళ్లే దారిలో ఈ జలపాతం ఉంటుంది. బాబేఝరి గ్రామానికి అరకిలోమీటర్ దూరంలో దట్టమైన అడవులలో ఈ జలపాతం ఉండడంతో మంచి పర్యాటక ప్రాంతంగా పేరుగాంచింది. సుమారు 150 మీటర్ల ఎత్తు నుండి నీళ్ల కిందికి పడుతుండడాన్ని సందర్శకులు ఆసక్తిగా తిలకిస్తుంటారు.

ప్రాణహిత జన్మస్థలం

కాళేశ్వరం ప్రాజెక్టు జలప్రదాయిని అయిన ప్రాణహిత నది కుమురంభీం జిల్లాలోనే పుట్టింది. మహారాష్ట్ర నుండి వచ్చే వైన్‌గంగ, వార్ధా నదుల సంగమమే ప్రాణహిత నది. ఈ రెండు నదులు కౌటాల మండలం తుమ్మిడిహేటి వద్ద కలిసి ప్రాణహితగా మారుతుంది. ప్రాణహిత జన్మస్థలాన్ని తిలకించేందుకు ఏటా వేల సంఖ్యలో సందర్శకులు ఈ ప్రాంతానికి విచ్చేస్తుంటారు. కాని ఇక్కడ ఎలాంటి అభివృద్ధి లేకపోవడంతో ప్రాచుర్యానికి నోచుకోలేకపోతోంది. ప్రాణహిత నది దాటితే అవతలివైపు మహారాష్ట్ర ఉండడంతో వచ్చే సందర్శకులు కూడా నాటు పడవల ద్వారా ప్రాణహిత నది దాటి మహారాష్ట్ర ప్రాంతానికి వెళ్లి వస్తుంటారు.

పాలరాపుగుట్ట

కాగజ్‌నగర్ అటవీ డివిజన్ పరిధిలోని పెంచికల్‌పేట్ మండలం మురళీగూడ బీట్ పరిధిలోని నందిగామ గ్రామ సమీపంలో ఈ పాలరాపుగుట్ట ఉంది. ఈ గుట్టకు ఆనుకునే ప్రాణహిత నది ప్రవహిస్తోంది. ఈ గుట్ట రాబంధులకు మంచి ఆవాసంగా ఉండడంతో అవి ఇక్కడే స్థిర నివాసం ఏర్పరుచుకున్నాయి. దేశంలోనే రాబంధుల సంతతి అంతరించిపోతుండడం, ఆ సమయంలో ఇక్కడ రాబంధులు కనిపించడంతో వాటిని సంరక్షించేందుకు అటవీ శాఖ పలు చర్యలు చేపడుతోంది. ఈ రాబంధులను చూసేందుకు సందర్శకుల తాకిడి అధికమైంది. ప్రాణహిత నది తీరం కావడంతో సందర్శకులు ఈ ప్రాంతానికి వచ్చి రాబంధులను చూస్తూ రోజంతా గడిపేస్తుండడతో మంచి పర్యాటక ప్రాంతంగా పేరుపొందింది. ఈ గుట్టపై సుమారు 35 రాబంధులు నివాసాలు ఏర్పరుచుకున్నట్లు అటవీ అధికారులు గుర్తించారు.

పులులకు ఆవాసం కాగజ్‌నగర్ అటవీ ప్రాంతం

కాగజ్‌నగర్ అటవీ డివిజన్ పులులకు ఆవాసప్రాంతంగా మారింది. మహారాష్ట్ర అటవీ ప్రాంతం నుండి ప్రాణహిత నది దాటి ఇటు వైపు వస్తున్న పులులు ఇక్కడే స్థిర నివాసం ఏర్పాటు చేసుకుంటున్నాయి. ఈ డివిజన్‌లోని అధికారులు కూడా వాటిని సంరక్షించేందుకు పలు చర్యలు చేపడుతుండడంతో రోజు రోజుకు వాటి సంతతిపెరుగుతోంది.

కెరమెరి గుట్టలు

ఆసిఫాబాద్-ఆదిలాబాద్ ప్రధాన రహదారిపై కెరమెరికి రెండు కిలోమీటర్ల దూరం నుండి కెరమెరి గుట్టలు ప్రారంభమవుతాయి. దట్టమైన అడవి ప్రాంతంలో గుట్టలపై నుండి రోడ్డు ఉండడం, ఈ రోడ్డు గుండా ప్రయాణిస్తున్న వారికి మధురానుభూతిని కలిపిస్తుంది. ఈ రోడ్డు గుండా స్వంత వాహనాలలో వెళ్లేవారు ఈ గుట్టలపై కొద్దిసేపు ఆగి సేద తీరి వెళుతుంటారు. సుమారు ఎనిమిది కిలోమీటర్ల వరకు గుట్టలపైనే ప్రయాణం ఉండడంతో ఈ ప్రాంతాన్ని ప్రత్యేకంగా తిలకిచేందుకు పలువురు ఆసక్తి చూపుతుంటారు.

త్రిశూల్‌పహాడ్ గుట్ట

కాగజ్‌నగర్ పట్టణానికి అనుకునే ఈ త్రిశూల్‌పహాడ్ గుట్ట ఉంటుంది. కాగజ్‌నగర్ బస్టాండ్ నుండి కేవలం కిలోమీటర్ దూరంలో ఉన్న ఈ గుట్టపైకి చేరుకోవాలంటే సీసీ రోడ్డు సౌకర్యం ఉంది. కాలినడకదారితో పాటు మెట్ల దారి కూడా ఉంది. ఈ గుట్టపై సత్యనారాయణస్వామి దేవాలయం, దుర్గాదేవి ఆలయాలు ఉన్నాయి. ఇటీవలే కళ్యాణమండపం నిర్మించారు. దీనికి సమీపంలోనే మరింత ఎత్తు ప్రదేశంలో 63 అడుగుల అభయాంజనేయస్వామి విగ్రహ నిర్మాణం చేపట్టారు. కాగజ్‌నగర్ పట్టణవాసులు పట్టణంలోని పలు ప్రాంతాల నుండి ఈ విగ్రహాన్ని వీక్షించే విధంగా ఎత్తులో ఈ విగ్రహ నిర్మాణం చేపట్టడంతో ఇది సందర్శకులను ఆకర్షిస్తోంది. గుట్టపై చుట్టూ చెట్లు, పచ్చని పంట పొలాల మధ్య నుండి కాగజ్‌నగర్ పట్టణాన్ని వీక్షించే అవకాశం ఉండడంతో పలువురు ఈ గుట్టను సందర్శిస్తుంటారు.

గంగాపూర్ బాలాజీ వెంకటేశ్వరస్వామి ఆలయం

రెబ్బెన మండలకేంద్రానికి కేవలం మూడు కిలోమీటర్ల దూరంలో ఈ ఆలయం ఉంది. రెబ్బెన నుండి తుంగెడ గ్రామానికి వెళ్లే దారిలో ఉన్న ఈ ఆలయంలో ప్రతీ ఏటా మాఘశుద్ధ పౌర్ణమి సందర్భంగా మూడు రోజుల పాటు జాతర నిర్వహిస్తారు. తిరుపతి వెంకటేశ్వరస్వామి తర్వాత అంతటి ప్రాముఖ్యతను ఈ ఆలయం కలిగి ఉందని చరిత్ర చెపుతుండడంతో ప్రతీ ఏటా జాతరకు వేలాది మంది భక్తులు తరలివస్తుంటారు. ఈ ఆలయం పక్క నుండే వాగు ప్రవహిస్తుండడంతో ఈ ఆలయ పరిసర ప్రాంతం పర్యాటక ప్రాంతంగా పేరుపొందింది.

ఈజ్‌గాం శివమల్లన్న ఆలయం

కాగజ్‌నగర్ మండలం ఈజ్‌గాం గ్రామ సమీపంలో ఈ ఆలయం ఉంది. కాగజ్‌నగర్ నుండి పెంచికల్‌పేట్ వెళ్లే దారిలో కేవలం ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ ఆలయానికి పురాతన చరిత్ర ఉంది. ప్రతీ ఏటా మహాశివరాత్రి సందర్భంగా ఈ ఆలయంలో మూడు రోజుల పాటు జాతర నిర్వహిస్తుంటారు. చుట్టూ పచ్చని పంట పొలాలు, పెద్దపెద్ద వృక్షాల మధ్య ఆలయం ఉండడంతో భక్తులతో పాటు పర్యాటకులు కూడా ఈ ఆలయానికి వచ్చి సేదతీరుతుంటారు. ప్రతీ ఏటా బోనాల జాతర ఈ ఆలయం వద్ద ఘనంగా కొనసాగుతుంది.

సింగరేణి బొగ్గు గనులు

అధిక సంఖ్యలో సింగరేణి బొగ్గు గనులు ఉన్న ప్రాంతం ఈ జిల్లానే కావడం గమనార్హం. ఒకప్పుడు ఎక్కువ మొత్తంలో భూగర్భగనులు ఉన్న ఈ జిల్లాలో ఇపుడు సింగరేణిలో వచ్చిన నూతన సంస్కరణల వల్ల ఓపెన్‌కాస్ట్ గనులు ఏర్పాటయ్యాయి. సింగరేణి బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయం ఈ జిల్లాలోని గోలేటిలోనే ఉంది. ప్రస్తుతం ఈ జిల్లాలో డోర్లీ-1, డోర్లీ-2 ఖైరిగూడ ఓపెన్‌కాస్ట్‌లతో పాటు బీపీఏ ఓసీ 2 ఓపెన్‌కాస్ట్ గని కూడా ఈ జిల్లాలోనే ఉంది. గోలేటి నుండి ఖైరిగూడ వెళ్లే దారిలో ఈ గనులు ఉన్నాయి. వీటిని తిలకించేందుకు కూడా పర్యాటకులు ఆసక్తి చూపుతుండడంతో ఈ ప్రాంతంలో సందడి రోజు రోజుకు పెరుగుతోంది.

విధుల పట్ల నిబద్ధతతో పనిచేస్తున్నాం

- అటవీ క్షేత్రాధికారి పూర్ణచందర్



నవతెలంగాణ-సిర్పూర్(టి)

అటవీ సంరక్షణలో విధుల పట్ల నిబద్దతతో పనిచేస్తున్నామని సిర్పూర్ రేంజ్ అటవీ క్షేత్ర అధికారి చిలుక పూర్ణచందర్ అన్నారు. రేంజ్ పరిధిలో అటవీ విస్తరణ, వన్యప్రాణుల సంరక్షణ ప్రతి రోజు క్రమం తప్పకుండా మా సిబ్బంది పర్యవేక్షిస్తూ, విధుల పట్ల అప్రమత్తంగా ఉంటూ, ప్రభుత్వం సూచించిన నూతన పథకాల పనులు సక్రమంగా నిర్వహిస్తున్నామని అన్నారు. రేంజ్ పరిధిలో అటవీ విస్తీర్ణం శాతం పెంచడానికి రేయింబవళ్లు కష్టపడుతున్నామని తెలిపారు. సిర్పూర్ రేంజ్ 27 వేల హెక్టార్లలో అటవీ విస్తీర్ణం ఉందని, అటవిని పర్యవేక్షించడానికి ఎనిమిది సెక్షన్లు విభజించి 25 బీట్లుగా ఉన్నాయని తెలిపారు. అటవీ ప్రాంతంలో ముఖ్యంగా పులి, చిరుత, ఇండియన్‌గార్, అడవి కుక్కలు, దుప్పులు, కొండగొర్రెలు, అడవి పందులు ప్రధాన జీవరాసులు నివసిస్తున్నాయని తెలిపారు. వీటి సంరక్షణ కోసం ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. దీనిలో భాగంగా వేసవికాలంలో వీటి దాహార్తిని తీర్చేందుకు ఐదు చెక్‌డ్యాంలు, 30 నీటి కుంటలు, 25 సాసర్‌ఫీట్‌లు ఏర్పాటుచేశామని తెలిపారు. వేసవికాలంలో సాసర్‌ఫీట్లలో వారానాకి రెండు దఫాలు నీటి ట్యాంకర్‌తో నీటిని నింపుతామని, అట్టి సాసర్‌ఫీట్లలో వన్యప్రాణులు నీటిని తాగిన దృశ్యాలు కెమెరా ట్రాప్‌లలో రికార్డులు అవుతుంటాయని తెలిపారు. అలాగే ముఖ్యంగా శాఖాహార జంతువుల కోసం 40 గడ్డి క్షేత్రాలు పెంచి వాటికి సరిపడా ఆహారాన్ని అందిస్తున్నామన్నారు. వేసవికాలంలో దట్టమైన అటవిలో కార్చిచ్చులను గుర్తించడానికి చింతకుంట, మాలిని ప్రాంతాల్లో రెండు ఫైర్ వాచ్‌టవర్‌లు ఏర్పాటు చేశామని వివరించారు. వాటిపైకి ఎక్కి సులభంగా కార్చిచ్చులను గుర్తించి వాటిని ఫైర్‌బోయర్‌ల సహాయంతో తీస్తున్నామని పేర్కొన్నారు. అలాగే ముందస్తుగా అన్ని బీట్లలో ఫైర్‌లైన్‌లను చూసి కార్చిచిచ్చు పడకుండా మీ సిబ్బంది పర్యవేక్షణ చేస్తుంటారని తెలిపారు. గత రెండు సంవత్సరాల నుంచి సిర్పూర్ రేంజ్‌లో అటవీ ప్రాంతాల్లో రోడ్లను నిర్మిస్తున్నామన్నారు. ఎక్కడికైనా అటవీ ప్రాంతాల్లో ఎలాంటి సంఘటనలు జరిగిన త్వరగా సంఘటన స్థలానికి వెళ్లే విధంగా రోడ్లు వేస్తున్నామన్నారు. అదేవిధంగా ఇతరులు అటవీ క్షేత్రానికి వెళ్లకుండా నేషేదిత హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేశామని తెలిపారు. అటవి విస్తీర్ణాన్ని పెంచడానికి మూడు సంవత్సరాల క్రితం ఇటుకల్ పహాడ్, భూపాలపట్నం, డబ్బా బీట్లలో 160 హెక్టార్లలో మొక్కలు పెంచామన్నారు. ప్రస్తుతం ఇటుకలపహాడ్, కేశవపట్నం బీట్లలో 130 హెక్టార్ల అటవీ భూమిని రీ ట్రీ చేసి ప్లాంటేషన్ చేస్తున్నామన్నారు. భవిష్యత్తులో మరిన్ని ప్లాంటేసన్‌లు చేపట్టి ప్రణాళికలు రూపొందిస్తున్నామని పేర్కొన్నారు. మనకు ముఖ్యంగా తడోబా నుంచి వచ్చే పులులు మాకిడి సెక్షన్ గుండా తెలంగాణలోకి ప్రవేశిస్తున్నాయి. అయితే ఇటుకల్‌పహాడ్‌లో అటవీ భూములు మొత్తం అన్యే ప్రాంతం అవడం వల్ల పులులు తిరిగి మహారాష్ట్రకు తరలిపోతున్నాయి. గత రెండు సంవత్సరాల క్రితం ఇటుకల్‌పహాడ్‌లో చేపట్టిన ప్లాంటేషన్ వల్ల ప్రస్తుతం పులులకు ఎలాంటి ఆటంకం లేకుండా స్వేచ్ఛగా మన రాష్ట్రంలోకి వచ్చే అవకాశాలు కల్పించామని తెలిపారు. అటవి సమీపంలో గల గ్రామాల ప్రజలకు వాటిని సంరక్షించడానికి అటవులను నరకకుండా వాటిని కాపాడే బాధ్యత మనపై ఉందని అవగాహన కార్యక్రమాలు చేపడుతూ అలాగే పులి దాడిలో పశువుల యజమానులకు సహకారం ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. వేసవికాలంలో తునికాకు సేకరణకు స్థానికంగా నివసించే ప్రజలకు ఉపాధిని చేపడుతున్నామని తెలిపారు.

ప్రజల సమస్యలను వెలికితీస్తుంది

- ఎస్ఐ దీకొండ రమేష్

నవతెలంగాణ -సిర్పూర్(టి)



నవతెలంగాణ దినపత్రిక ఎనిమిదవ వార్షికోత్సవం జరుపుకుంటున్న సందర్భంగా ముందుగా సిబ్బంది, యాజమాన్యానికి శుభాకాంక్షలు. నవతెలంగాణ దినపత్రిక నిరంతరం కార్మిక, కర్షక పక్షాన నిలబడి ప్రభునాకి ప్రజలకు వారధిగా నిలుస్తోంది. అలాగే సాదారణ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వానికి, అధికారులకు వాస్తవాన్ని వార్త రూపంలో తీసుకెళ్లడంలో కీలక భూమిక పోషిస్తుంది. అలాగే భవిష్యత్తులో ప్రజల సమస్యలపై పోరాడే విధంగా యాజమాన్యం, సిబ్బంది కృషి చేస్తూ పత్రికను ఉన్నతస్థాయికి రావాలని ఆకాంక్షిస్తున్నాను.

కృషి..పట్టుదల..ఫలితమిచ్చింది..!

- బారెమోడీలో డ్రాగన్ ఫ్రూట్ సాగు • ఆదర్శంగా నిలుస్తున్న రైతు మోహార్లే ప్రకాష్



నవతెలంగాణ-కెరమెరి

ఏండ్లుగా పత్తి పంటనే నమ్ముకొని సాగు చేస్తున్నప్పటికీ అనుకున్న స్థాయిలో పంట దిగుబడి రాక నష్టాలు చవిచూడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ప్రతి ఏడాది ఇదే దుస్థితి ఎదురుకావడంతో మదనపడిన రైతులు వినూత్నంగా ఆలోచించారు. తండ్రి కలత చెందుతున్న తీరును చూసిన కొడుకులు ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టిసారించారు. ఆలోచన వచ్చిందే తడువుగా తక్కువ పెట్టుబడితో ఎక్కువ కాలం పండించే పంటలను ఎంచుకొని తన కష్టానికి తగిన ఫలితం రాబట్టారు కెరమెరి మండలం బారెమోడీ గ్రామానికి చెందిన మోహార్లే ప్రకాష్ అనే రైతు. జిల్లాలో తొలిసారిగా డ్రాగన్ ఫ్రూట్ సాగు మేలని భావించి ఈ పంటను పండించారు. డ్రాగన్ ఫ్రూట్ మొక్కలని నాటగా ప్రస్తుతం పూత, కాత దశకు చేరుకోవడంతో రైతు కృషి ఫలించినట్లయింది.

మెలుకువలు తెలుసుకొని ..!



డ్రాగన్ ఫ్రూట్ సాగు చేసే విధానం గురించి తెలుసుకోవాలని ఆలోచించారు. తండ్రి మొహార్లే సత్తయ్యను తీసుకొని జగిత్యాలలోని అంతర్గం, సంగారెడ్డి జిల్లాలోని అలియాలో డ్రాగన్ ఫ్రూట్ సాగుచేస్తున్న విధానంపై మెలుకువలు తెలుసుకున్నారు. మొక్కకు రూ. 100చొప్పున రూ.1200 మొక్కలను రూ.1,20,000 వెచ్చించి కొనుగోలు చేసి ఎకరం పొలంలో నాటారు. అందులో 300 మొక్కలు ఫంగస్ తో చనిపోయాయి. వాటి స్థానంలో మరో 300 మొక్కలు తీసుకొచ్చి నాటారు. ప్రస్తుతం మొక్కలు నాటి 16 నెలలు కావస్తోంది. రెండేళ్లలో ఎకరాకు 3 నుండి 4 టన్నుల దిగుబడి వచ్చే అవకాశం ఉంది.ప్రస్తుతం 2 క్వింటాళ్ల వరకు విక్రయించారు. మొక్కల కొనుగోలు నుంచి ఇప్పటి వరకు రూ.7లక్షల వరకు పెట్టుబడి పెట్టినట్లు రైతు ప్రకాష్ తెలిపారు. ఒక్క డ్రాగన్ పండు మార్కెట్‌లో రూ.100 నుంచి రూ.200 వరకు పలుకుతుంది.



సాగు విధానం రైతు మాటల్లో

ఈ పంట సాగు చేయడానికి ముందు భూమిని చదును చేసుకోవాలి. భూసార పరీక్షలు చేయించాలి. మూడుసార్లు భూమిని దున్నాలి. తర్వాత 10 ఫీట్ల దూరంలో సాలు తోలాలి. అడ్డం నాలుగు ఫీట్ల దూరంలో 7 ఫీట్ల ఎత్తు ఉన్న సిమెంట్ స్తంభాలను నాటుకోవాలి. సిమెంట్ స్తంభంపై భాగంలో రౌండుగా ఉండే ఒక సిమెంట్ బిల్లను అమర్చాలి. ఎకరానికి 500 సిమెంట్ స్తంభాలను ఏర్పాటు చేసుకోవాలి. మొక్కలను నాటే ముందు పాదు దగ్గర పశువుల పేడ వేయాలి. మొక్కలు కింద పడిపోకుండా సిమెంట్‌తో టైరు కట్టాలి. మొక్కలను నాటడానికి రెండు నుంచి మూడు ఫీట్ల లోతులో పాదు చేసుకోవాలి. ఒక్కో స్తంభానికి నాలుగు మొక్కలు నాటుకోవడానికి అవకాశం ఉంటుంది. ఎలాంటి పురుగు మందులు వాడవలసిన అవసరం లేదు. డ్రిప్ విధానం ద్వారా నీళ్లను అందివ్వవచ్చు. ఈ పంట సాగు చేయడానికి తొలుత చాలా తక్కువ ఖర్చు అవుతుంది. ఒక్కసారి రూ.5 లక్షల వరకు ఖర్చు చేస్తే 30 సంవత్సరాల వరకు ఏటా పంట తీసుకోవచ్చు. జంతువులు ఏవీ ఈ పండ్లను తినవు. చీడపీడల బెడద కూడా చాలా తక్కువని రైతు చెబుతున్నారు. రైతులకు అన్ని విధాలు లాభం చేకూర్చే పంట. పూర్తిగా సేంద్రియ పద్ధతిలో ఈ పంట సాగు చేస్తారు. దాంతో పండు చాలా రుచిగా ఉంటుంది. ఒకసారి పెట్టుబడి పెడితే ఏటా లాభాలే ఉంటాయి.

ప్రభుత్వం సహకారం అందించాలి

మొహార్లే సత్తయ్య, రైతు




ప్రస్తుతం ఎకరాలో 1200 డ్రాగన్ ఫ్రూట్ మొక్కలను నాటడం జరిగింది.ప్రభుత్వం సహకారం అందించినట్లయితే మరో ఐదు రకాల పండ్ల మొక్కల సాగుకు సిద్ధంగా ఉన్నాను. ఇప్పటికే పలు రకాల పండ్ల మొక్కల పైన సాగు పైన మెలకువలు తెలుసుకోవడం జరిగింది. ప్రభుత్వం ద్వారా అందే సబ్సిడీ పథకాలను వర్తింపజేసినట్లయితే రాబోయే రోజుల్లో పండ్ల సాగుపై దృష్టి సారిస్తాను.

మండల సమగ్ర అభివృద్ధే లక్ష్యం

- ఎంపీపీ మల్లికార్జున్


నవతెలంగాణ-ఆసిఫాబాద్



ప్రాంత అభివృద్ధి జరగాలంటే నాయకులు క్షేత్రస్థాయి నుంచి కృషి చేయాల్సిందేనని, క్షేత్రస్థాయిలో నాయకుడు సమర్థవంతమైన వ్యక్తిగా ఉండాలంటే ఎప్పటికప్పుడు ప్రజల్లో ఉండాలి అటువంటి అన్ని లక్షణాలు పునికి పుచ్చుకొని తన దగ్గరికి వచ్చే ప్రతి ఒక్కరికి చేయూత అందిస్తానని చెబుతున్న ఎంపీపీ మల్లికార్జున్ నవతెలంగాణ తో మాట్లాడారు. ప్రజలు ఎంపీపీగా తనకు ఇచ్చిన అవకాశాన్ని పూర్తిస్థాయిలో వారికి కేటాయిస్తున్నానని తెలిపారు. ప్రతిరోజు గ్రామాల్లో పర్యటిస్తున్నానని వారి సమస్యలు తెలుసుకుని అక్కడే పరిష్కారం అయ్యే వాటిని పరిష్కరించడంతోపాటు ఉన్నతాధికారులతో అయ్యే పనులను వారితో పూర్తి చేయిస్తున్నట్లు వివరించారు. తన అన్న జడ్పీటీసీగా ఉన్నప్పటికీ వ్యక్తిగతంగా మండలానికి సంబంధించి సొంత నిర్ణయాలు కూడా తీసుకుంటానని వెల్లడించారు. గతంలో ఎన్నడు లేని విధంగా మండలంలో అభివృద్ధి జరిగినట్లు తెలిపారు. ప్రజల కష్టాలకు త్వరగా స్పందించడమే తన లక్ష్యమన్నారు. దీనికి నిదర్శనమే తుంపెల్లి వాగు ప్రవాహంలో లో లెవెల్ బ్రిడ్జ్ వర్షానికి కొట్టుకుపోవడం అదే రోజు మరమ్మతులు చేయించడమేనన్నారు. రానున్న రోజుల్లో హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణం కోసం ఉన్నతాధికారులకు నివేదిక పంపినట్లు తెలిపారు. గత ఎనిమిది సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న గుండి వాగు బ్రిడ్జి తన హయాంలో తిరిగి పనులు ప్రారంభం అయ్యాయని వెల్లడించారు. రానున్న వేసవికాలం పూర్తయిన నాటికి గుండి బ్రిడ్జి అందుబాటులోకి తీసుకువచ్చే విధంగా ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు. మండలంలోని గిరిజనులకు గిరి వికాసం పథకం ద్వారా బోర్ వెల్స్, విద్యుత్ కనెక్షన్లు అందజేస్తున్నట్లు వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో అనేక చోట్ల సీసీ రోడ్లు నిర్మించినట్లు తెలిపారు. గ్రామస్థాయిలో ఉన్న సమస్యలు సర్పంచుల ద్వారా మండల సర్వసభ్య సమావేశంలో తెలుసుకొని వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఎంతో అభివృద్ధి జరుగుతుందని ఆ పార్టీ నిర్ణయించిన అభ్యర్థి గెలుపు కోసం కృషి చేస్తామని తెలిపారు. కుమురంభీం పుట్టిన గ్రామం రౌటకు శాశ్వత ప్రాతిపదిక రహదారి నిర్మాణంతో పాటు అప్పపెల్లి బ్రిడ్జి నిర్మించి మోతుగూడ నుంచి కొండపల్లి వరకు రింగ్ రోడ్డు నిర్మించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మండలంలోని వట్టివాగు ప్రాజెక్టు ద్వారా చివరి ఆయకట్టు వరకు నీరు అందించేలా ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు.

భద్రంగా సింగరేణి భవిష్యత్తు

- విద్యుత్ ఉత్పత్తితో వ్యాపార విస్తరణ
- థర్మల్ విద్యుత్‌తో పాటు సోలార్ విద్యుత్ ఉత్పత్తి



నవతెలంగాణ-జైపూర్

దీర్ఘకాలిక ప్రయోజనాలతో ప్రణాళికా బద్ధంగా సింగరేణి భవిష్యత్తును భద్రపర్చుకుంటోంది. నేటి పోటీని తట్టుకుని నిలదొక్కుకోవడం కోసం ఉత్పత్తి ఒక్కటే సరిపోదని భావించిన సింగరేణి విద్యుద్ ఉత్పత్తిపై దృష్టి సారించింది. థర్మల్ విద్యుత్ రంగంలో అడుగుపెట్టిన సంస్థ సోలార్ విద్యుత్ ఉత్పత్తిలో కూడా దూసుకుపోతుంది. జైపూర్ మండలం పెగడపల్లి శివారుల్లో నెలకొల్పిన 1200 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ప్లాంట్‌తో పాటు సోలార్ ప్లాంట్ల ద్వార విద్యుత్ ఉత్పత్తి చేస్తుంది. ఒక వైపు బొగ్గు ఉత్పత్తి మరో వైపు విద్యుత్ ఉత్పత్తితో ఏటకేటా లాభాల బాటలో పయనిస్తున్న సంస్థ వ్యాపార రంగంలో ఎదురయ్యే ఎంటి సవాళ్లనైనా ఎదుర్కొనేందుకు సిద్దంగా ఉన్నట్లు పలు సంధర్భాల్లో సంస్థ సీఎండీ శ్రీధర్ ధీమా వ్యక్తం చేశారు.

ఎప్పటికప్పుడు దిశా నిర్దేశం చేస్తూ..!

ఈ క్రమంలో ఏటకేటా ఉత్పత్తి లక్ష్యాలను అధిగమిస్తూ, అనుకూల ప్రతికూల పరిస్థితుల్లో సంస్థ పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తల పట్ల ఎప్పటికప్పుడు దిశానిర్దేషం చేస్తున్నారు. ఫలింగా ఏటకేటా ఆశించిన లాభాలు అర్జిస్తూ వార్షిక టర్నోవర్‌ను పెంచుకుంటూ వస్తుంది. 1998 సంవత్సరానికి ముందు వరుసగా 20 సంవత్సరాల పాటు నష్టాలను చవి చూస్తూ మూసివేత దిశకు వెల్లిన సింగరేణి సంస్థ, కార్మికులు అధికారుల సమిష్టి కృషి ఫలితంగా నష్టాల నుండి బయటపడి గత 20 సంవత్సరాలుగా వరుస లాభాలను అర్జిస్తున్న సింగరేణికి ధీర్ఘకాల భవిష్యత్తు ఉందని ఆ సంస్థ ఉన్నతాధికారి పలుమార్లు ధీమా వ్యక్తం చేశారు. మారుతున్న బొగ్గు మార్కెట్ పరిస్థితుల్లో కోలిండియాతో పాటు ప్రైవేటు బొగ్గు ఉత్పత్తిదారులతో కూడా సింగరేణి పోటీపడాల్సి వస్తుంది. ఈ సవాళ్లను ఎదుర్కొవడం కోసం బొగ్గు ఉత్పత్తి ఖర్చులను బాగా తగ్గించుకోవడం కోసం పని గంటలు పెంచుకుంటూ అవసరమైన మేరకు యంత్రాల వినియోగంతో ఆశించిన మేరకు ఫలితాలను సాధిస్తూ వస్తోంది. 2016 సంవత్సరంలో నెలకొల్పిన 1200 మెగావాట్ల సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంటుకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొంది దేశంలో నెంబర్ స్థానంలో నిలుస్తూవస్తోంది.



మరో కొత్త ప్లాంట్లు ఏర్పాటు

ఈ క్రమంలోనే మరో 800 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్‌ను ఇప్పుడున్న ప్లాంటుకు అనుబంధంగా ఏర్పాటు చేస్తుంది.నూతనంగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రానికి అవసరమైన బొగ్గును సరఫరా చేస్తూ.. థర్మల్ విధ్యుత్ ప్లాంటు ఏర్పాటు చేసి తొలి కానుగా పెగడపల్లి థర్మల్ ప్లాంట్ ద్వార 1200 మెగావాట్ల విధ్యుత్ రాష్ట్ర ప్రజల అసరాలకు అందిస్తోంది. ఇప్పుడున్న ఎస్టీపీపీ ప్రాంగణంలోనే ఏర్పాటు చేయతలపెట్టిన 800 మెగావాట్ల ప్లాంట్‌తో పాటు 300 మెగావాట్ల సోలార్ పవర్‌కు అదనంగా మరో 240 మెగావాట్ల సామర్థ్యం గల ప్లాంట్లను మరో ఏడాదిలోగా ఏర్పాటు చేసి మొత్తం 540 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి సాధించేందకు సంస్థ సంసిద్ధమైంది.. దీనితో సింగరేణి సంస్థ తన థర్మల్, సోలార్ ప్లాంట్ల ద్వార 2,540 మెగావాట్ల విద్యుత్‌ను రాష్ట్ర అవసరాలకు అందించనుందని అధికారులు చెబుతున్నారు.

మారుమూల గ్రామాలకు రోడ్డు సౌకర్యం

- ఎంపీపీ జుమ్మిడి సౌందర్య

నవతెలంగాణ-రెబ్బెన



ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ ప్రజల కష్టసుఖాలను తీర్చుతూ మారుమూల గ్రామాలకు వంతెనలు నిర్మించి రెబ్బెన మండలాన్ని అభివృద్ధిలో ముందుకు తీసుకెళ్తున్నానని ఎంపీపీ జుమ్మిడి సౌందర్య అన్నారు. ఎంపీపీగా ప్రమాణ స్వీకారం చేసి నాలుగు సంవత్సరాలు గడుస్తున్నా నేటికి కూడా ప్రజలతో మమేకమై ఉంటున్నాను. నిరంతరం ప్రజాసేవలో ఉంటున్నాను. గడిచిన రెండు సంవత్సరాల్లో కరోనా సమయంలో కూడా మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో పర్యటించి వారికి నిత్యం సరుకులను అందజేసి గ్రామాలకు వెళ్లి సేవా చేశాను. అదేవిధంగా నేను బీఆర్ఎస్ జెడ్పీటీసీ చైర్‌పర్సన్ కోవలక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కు, ఎంఎల్‌సీ దండె విఠల్ ఆధ్వర్యంలో వారి సహకారంతో మండల అభివృద్ధికి కృషి చేస్తున్నానని అన్నారు. అదేవిధంగా డీఎంఎస్‌పీ ఫండ్ ద్వారా తుంగెడకు రూ.20 లక్షలతో సీసీ రోడ్లు, సైడ్ డ్రైనేజీలు నిర్మించాం. అదేవిధంగా ఎంపీపీ ఫండ్ ద్వారా ఎస్ఎఫ్‌సీ, టీఎఫ్‌సీ, ఫిఫ్టీన్త్ ఫైనాన్స్ ద్వారా తుంగెడ, పోతపెల్లి, మాధవాయిగూడ, జెండాగూడ, తక్కళ్లపల్లి, నేర్‌పల్లి, గంగాపూర్, పాసిగామ గ్రామాల్లో దాదాపు రూ.50 లక్షల నిధులతో సీసీ రోడ్లు, సైడ్ డ్రైనేజీలు, కల్వర్టులు నిర్మించామని తెలిపారు. నేటికి జెండాగూడ నుంచి పాత మాధవాయిగూడ గ్రామానికి ఎన్నో సంవత్సరాల నుంచి రోడ్డు సౌకర్యం లేక ప్రజలు నానా ఇబ్బందులకు గురయ్యారు. గ్రామానికి రవాణా సౌకర్యం లేకపోవడంతో కనీసం 108 అంబులెన్స్ కూడా వెళ్లలేని పరిస్థితి ఉందన్నారు. ఎలక్షన్‌లో హామీ ఇచ్చి నేటికి జెండాగూడ గ్రామం నుంచి మాధవాయిగూడ గ్రామం వరకు రోడ్డు సౌకర్యం కల్పించాలని ఎమ్మెల్యే ఆత్రం సక్కు దృష్టికి పలుమార్లు తీసుకెళ్లగా రూ.1.80 కోట్ల నిధులతో బీటీ రోడ్డు మంజూరు చేశారు. త్వరలోనే పనులు ప్రారంభం కానున్నాయని అన్నారు. అదేవిధంగా ప్రభుత్వాస్పత్రికి అదనపు గదుల కోసం, వేయిటింగ్‌హాల్ కోసం ఆర్థిక శాఖా మంత్రి హరీశ్‌రావు కుమురం భీం ఆసిఫాబాద్‌కు వచ్చిన సందర్భంలో ఆస్పత్రికి నిధులు మంజూరు చేయాలని తెలపగా వెంటనే ప్రభుత్వాస్పత్రిలో రూ. ఏడు లక్షలతో ఒక వేయిటింగ్‌హాల్, మరో రూ.ఏడు లక్షల నిధులతో అదనపు గదుల నిర్మాణం మొత్తం రూ.14 లక్షలతో నిర్మించాం. అదేవిధంగా మిగతా గ్రామాల్లో అభివృద్ధి పనులకు అక్కడి నుంచి ఎన్నికైన ఎంపీటీసీలకు ఎంపీపీ ఫండ్ నుంచి రూ.10 లక్షల నిధులతో ఆరుగురు ఎంపీటీసీలకు సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు ఇచ్చాం. నిధులతో నాలుగు గ్రామాల్లో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. అదేవిధంగా తుంగెడ గ్రామపంచాయతీలో చల్లమల్లన్న దేవాలయం వద్ద భక్తుల సౌకర్యార్థం కోసం రూ.మూడు లక్షల నిధులతో షెడ్డును నిర్మించాం. అదేవిధంగా జెడ్పీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే సక్కు సాయంతో తుంగెడ గ్రామం నుంచి మారుమూల గ్రామమైన సన్యాసికుంటకు రోడ్డు సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షం కురిస్తే చాలు బురదలో అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి. ఈ గ్రామంలో సుమారు 16 కుటుంబాలు ఉండగా 50 నుంచి 100 మంది వరకు నివసిస్తుంటారు. ఈ గ్రామాలకు సరైన రోడ్డు సౌకర్యం లేక తుంగెడ గ్రామ ప్రధాన రహదారి నుంచి కిలోమీటర్ దూరంలో ఉన్న సన్యాసికుంట గ్రామానికి వెళ్లాలంటే వీలులేకుండా పోయేది. అత్యవసర సమయంలో రోగులకు సకాలంలో వైద్యమందక పలువురు మృతిచెందిన సంఘటనలు ఉండేవి. అలాంటి గ్రామానికి రూ.25 లక్షల నిధులతో రోడ్డు సౌకర్యం కల్పించాను. సన్యాసికుంటకు గ్రామానికి వెళ్లాలంటే మధ్యలో వాగు ఉండేది. రూ.10 లక్షల నిధులతో వంతెన నిర్మించాను. మాధవాయిగూడలోని జెండాగూడ, పాత మాధవాయిగూడ గ్రామాలకు ఎఫ్‌డీఆర్ రూ.26 లక్షల నిధులతో రోడ్డు సౌకర్యం కల్పించాను. అదేవిధంగా సన్యాసికుంట గ్రామానికి ఎంపీపీ నిధుల నుండి రూ.ఆరు లక్షల నిధులతో వంతెన, కల్వర్టు నిర్మించడం జరిగింది. అదేవిధంగా గ్రామాల్లో సేవా కార్యక్రమాలు చేస్తూ బీద కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేస్తూ నిత్యం ప్రజలతో మమేకమై ఉంటూ ముందుకెళ్తున్నాను. అదేవిధంగా గ్రామాల్లో ఆసరా పింఛన్లు, కళ్యాణలక్ష్మి పథకం చెక్కులను లబ్ధిదారులకు అందజేస్తున్నాం. గతంలో తుంగెడ గ్రామంలో మా మామ జుమ్మిడి భగవాన్ సర్పంచ్‌గా గెలిచి గ్రామాన్ని అభివృద్ధి చేయగా తర్వాత అత్తమ్మ జుమ్మిడి లక్ష్మీబాయి రెండుసార్లు సర్పంచ్‌గా గెలిచి గ్రామాన్ని అభివృద్ధి బాటలో నడిపించి కీలకపాత్ర పోషించారు. మా అత్తామామ ఆశిస్సులతో నేటికి మా కుటుంబమంతా ప్రజాసేవలో ఉంటున్నాం. ప్రజలు నేటికి నన్ను ఆశీర్వదిస్తున్నారు. నేను ప్రజాసేవలో నిరంతరం ఉంటూ మండల అభివృద్ధికి తోడ్పడుతున్నాను. మండలం తెలంగాణ రాష్ట్రంలో మొదటిస్థానంలో ఉండే విధంగా నిరంతరం కృషి చేస్తూ అభివృద్ధికి ముందుంటానని అన్నారు.

రైతులు ఏఈఓల సూచనలు పాటించాలి

- వ్యవసాయాధికారి పాలకుర్తి రాజేష్

నవతెలంగాణ-కౌటాల

రైతులు వ్యవసాయాధికారుల సూచనలు పాటించి, లాభాలు పొందాలని కౌటాల వ్యవసాయ అధికారి పాలకుర్తి రాజేష్ అన్నారు. నవతెలంగాణ వార్షికోత్సవం సందర్భంగా పంటల సాగుపై నవతెలంగాణతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఐదు వేల ఎకరాలకు ఒక వ్యవసాయ విస్తరణ అధికారిని అందుబాటులోకి తెచ్చిందని, వారి ద్వారానే ప్రస్తుతం ఆయా గ్రామాల్లో రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. మండలంలో ఏడు క్లస్టర్లు ఉండగా ఏడుగురు వ్యవసాయ విస్తరణ అధికారులు విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వివిధ రకాల పంటల సాగు విధానంపై ఏఈఓలు అవగాహన కల్పిస్తున్నారు. మండలంలో సుమారుగా 3055 ఎకరాల విస్తీర్ణం సాగు చేస్తున్నారని, ప్రధానంగా పత్తి పంట, వరి, కంది, పెసర, మొక్కజొన్న, సోయాబీన్, మినుము, ఆహార పదార్థాల పంటలు, వాణిజ్య పంటలు, పుష్పధాన్యాల పంటలు పండిస్తున్నారన్నారు. రైతులు మోసపోకుండా ఉండటానికి నకిలీలను అరికట్టేందుకు ఏఈఓల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా అధికారుల సూచనల మేరకు గ్రామాల వారీగా పోలీస్, రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులతో అనుమానస్పదంగా గోదాంలు, ఇండ్లు సోదాలు చేస్తున్నామని, నకిలీ విత్తనాలు, గడ్డి మందుల నియంత్రణకు మండలస్థాయిలో ఏఓ, తహసీల్దార్, ఎఫ్ఎస్ఓ, గ్రామస్థాయిలో ఏఈఓ, గ్రామ పోలీస్ అధికారి కమిటీ వేశామని, వారి ద్వారా నకిలీ విత్తనాలు, గడ్డి మందు చలామణి కాకుండా ఎక్కడికక్కడ అరికడుతున్నామన్నారు. రైతులు పంటల మార్పిడిపై మొగ్గు చూపేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. రాబోయే కాలంలో రైతుల నుండి సమాచారం సేకరించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పంట మార్పిడిపై చర్చించి విత్తనాల కొరత లేకుండా చూస్తామన్నారు. గత ఐదు సంవత్సరాల నుంచి రైతులు పత్తి పంట అధిక మొత్తంలో సాగు చేస్తున్నారన్నారు. గత రెండు సంవత్సరాల కింద పత్తి పంటకు గులాబి పురుగు రావడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని, పంట మార్పిడి చేస్తే ఇలాంటి వ్యాధులు సోకకుండా ఉంటాయని రైతులకు పంట మార్పిడిపై మొగ్గు చూపేందుకు అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. రైతులకు ఎరువులు, విత్తనాలు సరిపడా నిల్వలు ఉన్నాయని, సబ్సిడీపై ఇప్పటికే రైతులకు విత్తనాలు, ఎరువులు అందజేయడం జరిగిందన్నారు. గ్లైఫోసెట్ గడ్డిమందు కలుపు వాడకంతో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలియజేశారు. నిషేధిత కలుపు మందులు వాడకుండా అవగాహన కల్పిస్తున్నామన్నారు. భూసారం తగ్గి మందుల వాడకంతో చర్మ సంబంధిత, క్యాన్సర్ వ్యాధులు కూడా వచ్చే ప్రమాదం ఉందని, మోతాదుకు మించి మందులు వాడొద్దని, మందుల వాడకంపై ఏఈఓలతో ప్రతి గ్రామంలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. రైతు పండించిన పంట అధిక దిగుబడి రావాలంటే సరైన సమయంలో విత్తనాలు నాటి భూసారం విత్తన పద్ధతులు పాటించడం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చని, అదేవిధంగా అంతర పంటలు వేయడం వల్ల నికర ఆదాయం పెరుగుతుందని, పంట నష్టం కలిగే అవకాశం తగ్గుతుందని, సరైన సమయంలో మోతాదుకు మించకుండా ఎరువుల మందులు, పురుగుల మందులు వాడాలని, ఏఈఓల ద్వారా రైతులకు సూచించిన్నట్టు తెలిపారు.



రైతులకు మీరిచ్చే సందేశం ఏమిటి...

ప్రభుత్వం రైతులకు రైతుబంధు అందజేస్తుంది. దానిని సద్వినియోగం చేసుకొని వ్యవసాయ అధికారుల సూచనలు పాటించి సబ్సిడీలు రైతులకు ప్రోత్సాహకం వంటివే. మారుతున్న సమాజానికి అనుకూలంగా రైతులు పోటీపడాలని, సేంద్రియ ఎరువుల వాడకంపై దృష్టిపెట్టాలని, రసాయన మందుల వాడకం తగ్గించి అధిక దిగుబడులు పొందేలా రైతులు ఆలోచించాలని తెలిపారు. అనుమతి పొందిన డీలర్ల వద్దనే ఎరువులు, విత్తనాలు, పురుగుల మందులు కొనుగోలు చేసి రసీదులు తీసుకోవాలని, వాటిని పంట చేతికొచ్చే వరకు జాగ్రత్తగా ఉంచుకోవాలని, రాష్ట్రస్థాయిలో ఏఈఓలు అందుబాటులో ఉండి రైతులకు ఎప్పటికప్పుడు సూచనలు ఇవ్వాలని, జాగ్రత్తలు పాటించి నష్టపోకుండా అధిక దిగుబడులు సాధించాలని అన్నారు.

నవతెలంగాణ

శివాలయంలో ఎక్కామ

బెజ్జూర్ : శ్రావణమాసం చివరి సోమవారం కావడంతో రైతుబంధు జిల్లా సమితి అధ్యక్షుడు కోండ్ర జగ్గాగౌడ్ ఆధ్వర్యంలో శివాలయంలో ఎక్కామ నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఎక్కామ(భజన)కు రాజమౌళి, సత్యనారాయణ, చంద్రమౌళి హాజరై విజయవంతం చేయడంతో వారిని శాలువాలతో సన్మానించారు.























































సంస్కృతి, సాంప్రదాయాలకు ఆలవాలం

- మినీ ఇండియాగా పేరుగాంచిన కుమురంభీం-ఆసిఫాబాద్

కాగజ్‌నగర్: తెలంగాణ రాష్ట్రంలో ఒక్కో జిల్లాది ఒక్కో ప్రత్యేకత. ఒక్కో జిల్లాలో ఒక్కో రకంగా ప్రజల అభిరుచులు, అలవాట్లు ఉంటాయి. కాని కుమురంభీం-ఆసిఫాబాద్ జిల్లా మాత్రం ఇందుకు విరుద్ధంగా ఉంటుంది. దేశంలోని అన్ని ప్రాంతాలకు చెందిన ప్రజలు ఈ జిల్లాలో నివసిస్తుండడమే ఈ జిల్లా ప్రత్యేకత. గిరిజనులు అధికంగా ఉన్నందునే ఈ జిల్లాకు కుమురంభీం నామకరణం చేశారు. సంస్కృతి, సాంప్రదాయాలకు పెట్టింది పేరైన ఈ జిల్లాలో దేశంలోని అన్ని సంస్కృతులు కనిపిస్తాయి. ఈ జిల్లాలో రెండు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా, దేనికవే ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. ఆసిఫాబాద్ నియోజకవర్గం పూర్తి గిరిజనులతో కూడినది కాగా, సిర్పూరు (టి) నియోజకవర్గం దేశంలోని విభిన్న ప్రాంతాలకు చెందిన వ్యక్తులతో కూడినది కావడం విశేషంగా చెప్పుకోవచ్చు.

రెండు నియోజకవర్గాలూ విభిన్నమే..

ఈ జిల్లాలో ఉన్న రెండు నియోజకవర్గాలు కూడా విభిన్నంగా ఉంటాయి. ఆసిఫాబాద్ నియోజకవర్గంలో ఆసిఫాబాద్, వాంకిడి, తిర్యాణి, కెరమెరి, సిర్పూరు (యు), జైనూర్, లింగాపూర్ మండలాలు పూర్తిగా గిరిజన మండలాలు. గోండు, ప్రధాన్, కోయ, కొలాం, లంబాడా గిరిజన తెగలు అధికంగా నివసించే ఈ ప్రాంతంలో గిరిజన సంప్రదాయాలు, పూజలు, పండుగలు ప్రత్యేకతను చాటుకుంటాయి. 17వ శతాబ్దంలో గోండు రాజుల పాలనలో ఈ ప్రాంతంలో గోండుల సంప్రదాయాలకు పునాదులు ఏర్పడ్డాయి. ఆసిఫాబాద్‌లో అంకం రాజుల ఆలయం, సిర్పూరు (యు)లో గోండుల కోట అలనాటి గోండుల పాలనకు ఆనవాళ్లుగా నిలుస్తున్నాయి. గిరిజన గ్రామాలలో ప్రతి ఏటా దీపావళి పండుగ సందర్భంగా నిర్వహించే గుస్సాడి నృత్యాలు ఈ జిల్లాకే తలమానికంగా నిలుస్తాయి. భీమన్నదేవర, పెర్సపేన్ పూజలు, జోడేఘాట్‌లో కుమురంభీం వర్ధంతి, జంగుబాయి దేవత పూజలు ఈ ప్రాంత గిరిజన సంప్రదాయాలను తేటతెల్లం చేస్తాయి. గిరిజన మహిళల వేషధారణ, పెళ్లిళ్ల, వ్యవసాయ పద్ధతులు, ఆచార వ్యవహారాలు ఇతురులతో పోలిస్తే భిన్నంగా ఉంటాయి. లంబాడాలు పౌరాదేవి పూజలు, దీక్షలతో ప్రత్యేకతను చాటుకుంటారు. ఇక సిర్పూరు నియోజకవర్గానికి వస్తే ఈ నియోజవర్గంలో దేశంలోని అన్ని రాష్ట్రాలకు చెందిన వారు ఇక్కడ నివసిస్తూ మినీ ఇండియాను తలపిస్తున్నారు. సహజ వనరులు పుష్కలంగా ఉన్న నియోజకవర్గం కావడంతో నిజాం కాలంలోనే కాగజ్‌నగర్‌లో రెండు పరిశ్రమలను స్థాపించారు. ఈ పరిశ్రమలలో పని చేసేందుకు దేశంలోని బీహార్, రాజస్తాన్, కేరళ, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, బంగ్లాదేశ్‌లకు చెందిన వందలాది కుటుంబాలు ఇక్కడికి వలస వచ్చాయి. వ్యాపార రీత్యా ఇక్కడకు వచ్చి స్థిరపడ్డ కుటుంబాలు వందల సంఖ్యలో ఉండడం గమనార్హం. వీరు ప్రతి ఏటా తమ సంస్కృతి సంప్రదాయాలకు అద్దం పట్టే విధంగా పూజలు, ఇతర కార్యక్రమాలు చేపడుతుంటారు. స్థానికులు కూడా వారికి సహకరిస్తూ వారి కార్యక్రమాలలో పాలుపంచుకుంటుండడంతో భిన్న మతాలకు నిలయంగా కాగజ్‌నగర్ పేరు పొందింది.

బీహారీల ఛట్ పూజలు

బీహార్, ఉత్తరప్రదేశ్‌లకు చెందిన కుటుంబాలు ప్రతి ఏటా ఛట్ పూజలను ఘనంగా నిర్వహిస్తుంటారు. దీపావళి పండుగ అనంతరం ఆరు రోజుల తర్వాత ప్రతి ఏటా ఈ ఛట్ పూజలను వీరు నిర్వహిస్తారు. కాగజ్‌నగర్‌లోని ఎస్పీఎం క్రీడా మైదానంలో ఉన్న నీటి కొలనులో మహిళలు, పురుషులు నిలబడి సూర్యభగవానున్ని భక్తి శ్రద్ధలతో కొలుస్తారు. 16 గంటల పాటు అన్నపానీయాలు మాని కఠోర ఉపవాసదీక్షలతో చేసే ఈ పూజల వల్ల తమ కోరికలు నెరవేరుతాయనేది బీహార్, ఉత్తరప్రదేశ్‌వాసుల నమ్మకం. వారి సంస్కృతిని, సంప్రదాయాన్ని స్థానికులు కూడా గౌరవిస్తూ వారితో పాలుపంచుకుంటున్నారు.

మార్వాడీల గన్‌గోర్ పూజలు

వ్యాపారరీత్యా రాజస్థాన్ నుండి వచ్చిన మార్వాడీ కుటుంబాలు కూడా కాగజ్‌నగర్‌లో అధికంగా ఉంటాయి. వీరు ప్రతి ఏటా నిర్వహించే గన్‌గోర్ పూజలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంటాయి. 16 రోజుల పాటు భక్తి శ్రద్ధలతో ఈ పూజలు నిర్వహించిన అనంతరం చివరిరోజు పట్టణంలో శోభాయాత్ర నిర్వహిస్తారు. ఈ శోభాయాత్రలో అన్ని మతాల మహిళలు పాల్గొని సమైక్యతాభావాన్ని చాటిచెపుతారు.

ప్రత్యేకత చాటుకుంటున్న బెంగాళీలు

కొన్ని సంవత్సరాల క్రితం ఇక్కడకు వలస వచ్చిన బెంగాళీలు తమ ప్రత్యేకతను చాటుకుంటున్నారు. ప్రతి గ్రామంలో శాంతి సౌభాగ్యాలు విలసిల్లాలని, పాడి పరిశ్రమ అభివృద్ధి చెంది కరువు కాటకాలు తమ దరికి రావద్దనే సదుద్దేశ్యంతో వీరు ప్రతి ఏటా అఖండనామ సంకీర్తన కార్యక్రమాలను భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తారు. 43 ఏళ్లుగా కాళీమాత ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. బెంగాళీల ఆరాధ్యదైవమైన కాళీమాతను వీరు ప్రత్యేకంగా పూజిస్తుంటారు. ప్రతి ఏటా దీపావళి పండుగ సందర్భంగా కాగజ్‌నగర్ మండలంలోని 13 బెంగాళి క్యాంపులలో ఉన్న బెంగాళీలు తమ పండుగులు, వేడుకల తీరులో తమ దైన శైలిని చాటిచెపుతున్నారు.

ప్రజాసేవలో ఆదిత్య ఖండేష్కర్ సొసైటీ

- సేవే లక్ష్యంగా ముందుకు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సమాజంలో సేవ చేయాలన్న భావన ప్రతి ఒక్కరికి ఉంటుంది. కానీ దాన్ని ఆచరించడం అమలు చేయడం కొందరికే సాధ్యమవుతుంది. అదే భావనతో ఉన్న ఆదిలాబాద్ పట్టణం ఖత్రి సమాజ్‌కు చెందిన ఓ యువకుడు ముందుకొచ్చాడు. అతడే ఆదిత్య అశోక్ ఖండేష్కర్. 2020 సంవత్సరంలో సేవ చేయాలన్న దృక్పథంతో ఆదిత్య ఖండేష్కర్ అని తన పేరు మీద సొసైటీని ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఇప్పటికి నిరంతరం వారి సేవ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. వేసవి కాలంలో చలివేంద్రాలు ఏర్పాటు చేస్తూ, వర్షాకాలంలో వరద బాధితులకు అండగా నిలుస్తూ, చలికాలంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేయడం ఇలా ప్రతి సందర్భం సేవ చేయడానికి వారి సొసైటీ ముందుంటుంది. కరోనా ఆపత్కాలంలో సైతం చాలామందికి అండగా నిలిచి మంచి పేరుపొందారు. వీరి సేవలను గుర్తించిన అధికారులు సన్మానాలు సత్కారాలు చేశారు.

రోగికి రూ.10వేల ఆర్థిక సాయం...

తలమడుగు మండలం పల్లి(కె) గ్రామానికి చెందిన శకుంతల తీవ్ర అనారోగ్యానికి గురికాగా రిమ్స్‌లో చేర్పించారు. ఆమెకు ఆర్థికంగా అవసరం ఉందని ఈ విషయాన్ని సొసైటీ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా సొసైటీ వారు వెంటనే స్పందించి వారి కుటుంబానికి రూ.10వేలు ఆర్థిక సాయం అందించారు. దీంతో వారు కుటుంబసభ్యులు సొసైటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

కిడ్నీ వ్యాధి గ్రస్తికి రూ.25వేల ఆర్థిక సాయం...

రెండు కిడ్నీ ఫెయిల్యూర్‌తో బాధపడుతున్న ఓ గ్రామానికి చెందిన రౌత్ శిల్ప తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఆమెకు ఆదిలాబాద్‌లోని ఓ ప్రయివేట్ హాస్పిటల్‌లో పలుమార్లు డయాలసిస్ చేశారు. దాదాపు 20 లక్షలు అవసరమయ్యే కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ ద్వారా ప్రాణాలను కాపాడే ఏకైక మార్గం ఉండగా ఆమెకు ఆర్థిక సాయం అవసరముందని ఆదిత్య ఖండేష్కర్ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో వారు స్పందించి రూ.25వేలు ఆర్థిక సాయం అందించి అండగా నిలిచారు.

అనాథనాలకు బాసటగా ఖండేష్కర్...

ఆదిలాబాద్ పట్టణంలో మానసిక అనారోగ్యంతో బాధపడుతున్న కొంతమంది అనాథలను చూశారు. చాలా రోజుల నుంచి వారికి సాయం చేయాలనే ఆలోచన ఉండటంతో ఒకరోజు ముందుకొచ్చారు. వారిలో కొందరు 4-5 సంవత్సరాల నుంచి స్నానం చేయక, బట్టలు లేక ఉన్నారు. దీంతో ఖండేష్కర్ వారు వారికి స్నానాలు చేపించి, నూతన దుస్తులు, పాదరక్షలు కొనిచ్చారు. ఇటువంటి వ్యక్తులకు హాని కలిగించవద్దని, వారితో స్నేహపూర్వకంగా ఉండాలని అన్నారు. మానసిక వైకల్యం ఉన్న వారు కూడా సాధారణ మనుషులేనని అన్నారు. చిన్న మార్పు అక్కడి జీవితాల్లో భారీ మార్పును తెస్తుందన్నారు.

సేవలు మెచ్చి.. ఆదిత్యకు సత్కారం చేసి...

సొసైటీ సేవలను గుర్తించి, సీనియర్ సిటిజన్స్ డే సందర్భంగా ఆదిలాబాద్ అప్పటి జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. తమ సేవలు గుర్తించి, సన్మానించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో రాబోయే భవిష్యతులో మరిన్ని సేవలు చేయడానికి సిద్ధంగా ఉన్నామని అన్నారు.

రక్తహీనత కలిగిన వారికి రక్తదానం చేసి అండగా నిలిచి

జిల్లాలోని బ్లడ్ బ్యాంకులో రక్తం నిలువలు లేని సమయంలో సొసైటీ ఆధ్వర్యంలో పట్టణంలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో దాదాపు వంద మందికి పైగా సభ్యులు ముందుకు వచ్చి రక్తదానం చేశారు. రక్తదానం మహదానమని అన్నారు. రక్తదానం చేయడం వలన ఒకరికి ప్రాణం పోసినవాళ్లము అవుతామని అన్నారు.

వేసవిలో చలివేంద్రాలు ఏర్పాటు

వేసవికాలంలో ఆదిలాబాద్ పట్టణంలో పెరుగుతున్న వేడి ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకుని ప్రజల దాహార్తిని తీర్చడానికి నేతాజీ చౌక్, వినాయక్ చౌక్, బొడి గణేష్ తిరుపల్లిలో మొత్తం నాలుగు చలి వేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే జోగు రామన్న పాల్గొని ప్రారంభించారు. ఖండేష్కర్ సొసైటీ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవలను ఎమ్మెల్యే ఈ సందర్భంగా అభినందించారు.



అప్పటి కలెక్టర్ సిక్తా పట్నాయక్ నుండి అవార్డు అందుకుంటున్న ఆదిత్య అశోక్ ఖండేష్కర్

నిరుపేదలకు దుప్పట్ల పంపిణీ

ఆదిలాబాద్‌లో సొసైటీ ఆధ్వర్యంలో 200 మంది పేదలకు దుప్పట్లను పంపిణీ చేశారు. పట్టణంలోని తిర్పెల్లికి చెందిన శారీరక వికలాంగ బాలుడికి చక్రాల కుర్చీ పంపిణీ చేశారు. దీంతో వారికి కృతజ్ఞతలు తెలిపారు.

కరోనా ఆపత్కాలంలో అండగా నిలిచి...

కరోన సమయంలో నిరుపేదలకు ఖండేష్కర్ సొసైటీ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు చేపట్టారు. లాక్‌డౌన్ ఏర్పడిన దృష్ట్యా నిరుపేదలు ఆహారం లేక అవస్థలు పడ్డారు. దీంతో సొసైటీ ఆధ్వర్యంలో పట్టణంలో నెహ్రూ నగర్, రైల్వే స్టేషన్, లెప్రసీ కాలనీలో 350 ఆహార ప్లేట్లను పంపిణీ చేశారు. ప్రతి లాక్‌డౌన్‌లో ప్రతి నిత్యం ఈ కార్యక్రమం చేపట్టి పేదల ఆకలి తీర్చారు. ఈ ప్రక్రియ లాక్‌డౌన్ పూర్తయ్యే వరకు కొనసాగింది.

గ్రామాన్ని సందర్శించి.. నిత్యావసర సరుకులు పంపిణీ చేసి...

ఆదిలాబాద్ రూరల్ మండలంలోని చించుఘాట్ గ్రామాన్ని ఆదిత్య ఖండేష్కర్ సొసైటీ సందర్శించింది. భారీ వర్షాల దృష్ట్యా గ్రామం మొత్తం వరదలతో అతలాకుతలమైంది. దీంతో సొసైటీ ఆధ్వర్యంలో 75 కుటుంబాలకు కిరాణా సామాను, దుప్పట్లు నిత్యావసర సరుకులు పంపిణీ చేసింది. కష్టకాలంలో తాము ఎల్లప్పుడూ ముందుంటామని అవసరమైతే సంప్రదించాలని అన్నారు.

వివాహ జంటకు అండగా నిలిచిన ఖండేష్కర్

ఆదిత్య ఖండేష్కర్ సొసైటీ ఆధ్వర్యంలో ఓ వివాహ జంటకు అండగా నిలిచింది. పట్టణానికి చెందిన ఓ అమ్మాయి తన చిన్నప్పుడే తల్లిదండ్రులను కోల్పోయింది. ఆమె కుటుంబంలో ఒక ప్రయివేట్ సంస్థలో పనిచేసే ఏకైక వ్యక్తి, పెళ్లి కోసం సాయం కోరుతూ సొసైటీని సంప్రదించారు. దీంతో వారు వెంటనే స్పందించి వారి వివాహాన్ని సంప్రదాయబద్ధంగా వారి ఆధ్వర్యంలో నిర్వహించారు. పెళ్లికి అయ్యే ఖర్చులు తామే భరించారు. నిండు నూరేళ్లు ఆ జంట సంతోషంగా ఉండాలని ఆశీర్వదించారు.

కుట్టు మిషన్‌లు.. వీల్ చైర్లు అందజేత

ఆదిలాబాద్ పట్టణంలోని మహిళలు స్వయం ఉపాధి పొంది ఆర్థికంగా ఎదగాలని దాదాపు 40 వరకు కుట్టు మిషన్‌లను అందజేసి అండగా నిలిచారు. అలాగే నడవలేని పరిస్థితిలో ఉన్న వారిని గుర్తించి దాదాపు 80మందికి వీల్ చైర్లు అందజేశారు.

ఉచిత వైకుంఠ రథం సేవలు

వైకుంఠ రథాన్ని 2021లో సోసైటీ ప్రారంభించింది. ఆదిలాబాద్ జిల్లాలోని అన్ని కులాలకు, వర్గాలకు, మతాలవారి కోసం ఉచిత సేవలను ప్రారంభించారు. ఈ సేవలను పట్టణ ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

ఆటో డ్రైవర్స్ కుటుంబాలకు అండగా

ఆదిలాబాద్ పట్టణంలో కరోనా సమయంలో ఎనలేని సేవలను ఈ సొసైటీ ఆధ్వర్యంలో చేశారు. లాక్‌డౌన్ సమయంలో ఆటో కుటుంబాలు రోడ్డున పడ్డాయి. ఇది గమనించిన సొసైటీ వారు దాదాపు 150 మంది ఆటో డ్రైవర్ కుటుంబాలకు మూడు నెలల రేషన్ పంపిణీ చేసి వారికి కరోనా కష్టకాలంలో అండగా నిలిచారు.

సేవ చేయాలన్న ఉద్దేశంతో ఈ సొసైటీ ఏర్పాటు చేశాం...

మా సొసైటీ ఆధ్వర్యంలో అనేక రకాల సేవలను అందించాము. భవిష్యత్‌లో ప్రజల ఆశీర్వాదంతో మరిన్ని సేవలు చేయడానికి సిద్ధంగా ఉన్నాము.




రక్తదానం శిబిరం

రైతులకు ఎరువుల కొరత లేకుండా చూస్తాం

వ్యవసాయ సహకార సంఘం చైర్మెన్ రేకుల గంగాచరణ్

నవతెలంగాణ-కుభీర్

మండలంలో ఉన్న అన్ని గ్రామాల రైతులకు ఎల్లపుడు అందుబాటులో ఉంటూ రైతులకు అవసరమైన విత్తనాలు ఎరువులు ఎల్లపుడు అందుబాటులో ఉంచి వారికి ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూస్తామని పీఏసీఎస్ చైర్మెన్ రేకుల గంగాచరణ్ అన్నారు. రైతులకు ఖరీఫ్, రబీ సీజన్‌ల రుణాలు అందించి, వారికి ఇబ్బందులు రాకుండా కృషి చేస్తామని అన్నారు. దీంతో పాటు రైతులు పండించిన ప్రతి పంటకు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి వారి పంటలను పూర్తి స్థాయిలో ప్రభుత్వ ద్వారా మద్దతు ధర అందించి పంటలను కొనుగోలు చేయడం జరుగుతుందని అన్నారు. వారు అమ్మిన పంటలకు వేణు వెంటనే వారిఖాతల్లో డబ్బులు జమ చేసి వారికి కార్యాలయాల చుట్టూ తిరగకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా చూస్తున్నామని అన్నారు. ఏదైనా అవసరమైన రుణాలు కావాలంటే గృహ లోన్స్, ఎల్టీ రుణాలు, పంట రుణాలు అందించి, వారికి ఇబ్బందులు తొలగించడం జరుగుతుందని అన్నారు. దీంతో పాటు 2018 సంవత్సరంలో రుణాలు పొందిన రైతులకు సంబంధించిన రైతు రుణమాఫీ కూడా ప్రభుత్వం రైతుల ఖాతాలో జమ చేసి వారికి సమాచారం అందించడం జరుగుతుందని తెలిపారు.



దేవరకోట దేవస్థానం ఆలయ అభివృద్ధికి కృషి

- దేవరకోట దేవస్థానం ఆలయ చైర్మెన్ ఆమెడ శ్రీధర్

నవతెలంగాణ-నిర్మల్



మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి సహాయ సహకారాలతో శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవరకోట దేవస్థానం అభివృద్ధికి కృషి చేస్తానని ఆలయ చైర్మెన్ ఆమెడ శ్రీధర్ అన్నారు. నవతెలంగాణతో 8వ వార్షికోత్సవం సందర్భంగా నవతెలంగాణతో మాట్లాడారు. పురాతనమైన వందేళ్ల చరిత్ర గల పుణ్యక్షేత్రమైన దేవరకోట దేవస్థాన ఆలయ చైర్మెన్‌గా సేవలు అందించడం పునర్జన్మ సుకృతంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. ఆలయంలో బాత్‌రూమ్‌ల సమస్య ఉందని అలాగే చిన్న చిన్న మరమ్మత్తులు, పలు వసతులు కల్పించాల్సి ఉందన్నారు. ఈ మేరకు మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ఆలయ అభివృద్ధికి రూ.50 లక్షలు మంజూరు చేశారని తెలిపారు. త్వరలో పనులకు శంకుస్థాపన చేసి పనులు పూర్తి చేస్తామన్నారు. ప్రత్యేకంగా ఆలయ ఆవరణలో హరితహారంలో భాగంగా మొక్కలు నాటుతామని అన్నారు. సరైన స్థలం చూసి పార్కింగ్ ప్లేస్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. ఆలయానికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా, భద్రత కోసం సెక్యూరిటీని ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతినెల శ్రావణ నక్షత్రం వస్తుందని, ప్రతి ఏకాదశికి విష్ణు సహస్రనామము ఉయ్యాల సేవతో పాటు పూజలు, ఉత్సవాలు, ఇతర ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

రాష్ట్రంలోనే జిల్లాను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

- నిర్మల్ జిల్లా అభివృద్ధి పథంలో పయనిస్తోంది..
- రాష్ట్ర అటవీ, పర్యావరణ, న్యాయ, దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి



నవతెలంగాణ-నిర్మల్

రాష్ట్రంలోనే జిల్లాను ఆదర్శంగా తీర్చిదిద్దుతామని, నిర్మల్ జిల్లా అభివృద్ధి పథంలో పయనిస్తుందని, రాష్ట్ర అటవీ, పర్యావరణ, న్యాయ, దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. నవతెలంగాణ 8వ వార్షికోత్సవం సందర్భంగా నవతెలంగాణతో మాట్లాడారు. దేశంలో ఎక్కడలేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నాం. అన్ని వర్గాల అభివృద్ధికి కృషి చేస్తున్నాం.మన రాష్ట్రంలోని సంక్షేమ పథకాలను చూసి ఇతర రాష్ట్రాలు అమలు చేసేందుకు కృషి చేస్తున్నాయని తెలియజేశారు. టిఆర్ఎస్‌ను జాతీయ స్థాయిలో నిలిపేందుకు బీఆర్ఎస్‌గా మార్చి దేశ రాజకీయాల్లో సేవ చేసేందుకు కేసీఆర్ కృషి చేస్తున్నారని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం రైతులను ఆదుకునేందుకు జిల్లాలో రైతుబంధు పథకం కింద ఇప్పటివరకు జిల్లాలో రూ.2178. 57 కోట్లు రైతు ఖాతాల్లో జమ చేయడం జరిగిందన్నారు. రైతుబీమా కింద జిల్లాలో ఇప్పటివరకు 2,965 మంది రైతు కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున రూ.148. 25 కోట్లు నామిని ఖాతాల్లో జమ చేయడం జరిగిందన్నారు. నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో కాళేశ్వరం 27, 28 ప్యాకేజీ కింద జిల్లాలోని 58 గ్రామాల్లో 50 వేల ఎకరాల సాగుకు గాను, నీటిని అందజేయడానికి ఇప్పటి వరకు రూ. 251. 264 కోట్లు ఖర్చు చేయడం జరిగిందన్నారు. వీటి పనులు కొనసాగుతున్నాయని అన్నారు. మామడ మండలం పొన్కల్ గ్రామం వద్ద రూ.664 కోట్ల వ్యయంతో ప్రాజెక్టు ప్రారంభించి, ఇప్పటివరకు రూ.430 కోట్ల పనులు పూర్తి చేయడం జరిగిందన్నారు. విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో నిరంతరాయంగా 24 గంటల విద్యుత్ సరఫరా జరుగుతుందన్నారు. ఇది రాష్ట్రానికే గర్వకారణం అన్నారు. ఇప్పటివరకు 37, 33/11 కేవీ విద్యుత్ కేంద్రాలను రూ.47.3 కోట్ల ఖర్చుతో నిర్మించబడిందన్నారు. జిల్లావ్యాప్తంగా మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి నల్లాల ద్వారా సురక్షిత జలాలు సరఫరా అవుతున్నాయని అన్నారు. జిల్లాలోని 19 మండలాల్లో 412 రేషన్ దుకాణాల ద్వారా 4069. 991 మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో వాననీటి ఇంకుడు గుంతల నిర్మాణంలో దేశస్థాయిలో ఒకేరోజు జిల్లాలో 5940 సాక్‌పిట్‌లను ప్రారంభించి, పూర్తి చేయడంతో రికార్డు నెలకొల్పి, లిమ్కా బుక్, ప్రపంచ రికార్డు కోసం రిజిస్టర్ చేయబడిందన్నారు. ఉపాధి హామీ జాబ్ కార్డులు 1.74 లక్షలు జారీ చేయడం జరిగిందన్నారు. హరితహారం కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని 42 నర్సరీలో 240.151 లక్షల మొక్కలు పెంచడం జరిగిందన్నారు. వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో నూతనంగా 37 ప్రాథమిక ఉపకేంద్రాలు మంజూరై నిర్మాణంలో ఉన్నాయని అన్నారు. కేసీఆర్ కిట్‌తో పాటు ఇప్పటివరకు 28,096 మందికి రూ.24 కోట్ల 5 లక్షల నగదును అందించడం జరిగిందన్నారు. జిల్లాలో మెడికల్ కళాశాల మంజూరై త్వరలో ప్రారంభం కానుంది. ఇప్పటికే అడ్మిషన్లు ప్రారంభం అయ్యాయని తెలిపారు. పంచాయతీరాజ్ శాఖ ద్వారా ఎంజీఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద 130 గ్రామపంచాయతీ భవనాలు రూ.26 కోట్ల అంచనాలతో చేపట్టడం జరిగిందన్నారు. అంతర్గత సీసీ రహదారులు, డ్రైనేజీలు నిర్మించడం జరుగుతుందన్నారు. మున్సిపల్ శాఖ ద్వారా ఇంటింటికి 25 వేల నల్లా కనెక్షన్లు ఇవ్వడం జరిగిందన్నారు. పట్టణ ప్రగతిలో భాగంగా మౌలిక వసతులు కల్పించడం జరిగిందన్నారు. జిల్లాలో దళితబంధు పథకం కింద 261 ఎస్సీ కుటుంబాలను ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు. ఇప్పటివరకు రూ.25.84 కోట్లు ఇవ్వడం జరిగిందన్నారు. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అర్హులైన 7,335 గిరిజన లబ్ధిదారులకు పోడు భూములకు సంబంధించిన అటవీ హక్కు పత్రాలను అందజేయడం జరిగిందన్నారు. వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా వెయి మంది లబ్దిదారులకు వందశాతం బీసీ ఆర్థిక సాయం అందజేయడం జరుగుతుందన్నారు. డబుల్ బెడ్ రూమ్ పథకం కింద పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటివరకు 1,755 డబుల్ బెడ్ రూమ్ లను లబ్దిదారులకు అందజేయడం జరిగిందన్నారు. త్వరలో నిర్మాణంలో ఉన్న మరిన్ని డబుల్ బెడ్ రూమ్ లబ్దిదారులకు అందజేస్తామన్నారు. రహదారులు అభివృద్ధి విస్తరణశాఖ ఆధ్వర్యంలో రూ.354 కోట్ల నిధులతో 270 కిలోమీటర్ల రహదారులు అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. అలాగే అంతర్గత రహదారులు, వంతెనలు నిర్మించడం జరుగుతుందన్నారు. మన ఊరు, మనబడి, మన బస్తి, పథకం కింద జిల్లాలో 260 పాఠశాలలు ఎంపిక చేసి రూ.82 కోట్లతో 12 రకాల మౌలిక వసతులు కల్పించడం జరుగుతుందన్నారు. సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రాజెక్టు కార్యాలయంలో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేయడంతో రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానం నిలవడం గర్వకారణమని అన్నారు. 2023-24 సంవత్సరంలో జిల్లాలోని 641 చెరువులు, కుంటల్లో 440 లక్షల చేపల పిల్లలు విడుదల చేయడానికి ప్రతిపాదనలు పంపించడం జరిగిందన్నారు. నిర్మల్, సారంగాపూర్, భైంసా పట్టణాల్లో రూ.72.50 లక్షల విలువ గల చేపల మార్కెట్ల నిర్మాణం చేయడం జరిగిందన్నారు. నిరుపేద ఆడబిడ్డల పెండ్లిలు తల్లిదండ్రులకు భారం కాకుండా కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ ఆర్థిక సాయం అందజేస్తున్నామని అన్నారు. గొర్రెల పెంపకం పథకం కింద ఇప్పటివరకు 6,920 మంది లబ్దిదారులకు ఒక్కో యూనిట్టు చొప్పున లక్ష 25 వేల చొప్పున రూ. 86.5 కోట్లు ఖర్చు చేయడం జరిగిందన్నారు. అలాగే రెండో విడతలో భాగంగా పంపిణీ చేయనున్నామన్నారు ఉద్యాన వన శాఖ ఆధ్వర్యంలో ఇప్పటివరకు 1,661 ఎకరాలలో 690 మంది రైతులు ఆయిల్ ఫామ్ మొక్కలు నాటడం జరిగిందని, ఈ మొక్కల సాగు చేసేలా అవగాహన సదస్సులు నిర్వహించడం జరుగుతుందన్నారు.

పట్టణ సమైక్యలు, స్వయం సహాయక సంఘాలు, శ్రీనిధి కింద రుణాలను మంజూరు చేయడం జరుగుతుందన్నారు. టీఎస్ ఐపాస్ చట్టం 2014 కింద జిల్లా వ్యాప్తంగా రూ. 644.72 కోట్ల పెట్టుబడితో 250 యూనిట్లకు అనుమతులు ఇవ్వడం జరిగిందన్నారు. శాంతి భద్రతలకై పోలీస్ శాఖలు అహర్నిశలు కృషి చేస్తుందన్నారు. మహిళల భద్రత కోసం షీటీం బృందాలు పనిచేస్తున్నాయని అన్నారు. జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి పర్చేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. నిరంతరం ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా పనిచేస్తున్న నవతెలంగాణ పత్రిక విలేకరులకు శుభాకాంక్షలు తెలిపారు.

మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తాం

- ఎంపీపీ తూము లక్ష్మీబాయి



నవతెలంగాణ-కుభీర్

ముధోల్ నియోజక వర్గంలో ఉన్న ప్రతి మండలానికి ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, సీఎం కేసీఆర్, మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిల కృషితో కుభీర్ మండలంలో ఉన్న 41 గ్రామపంచాయతీల అభివృద్ధికి ఎంతో కృషి చేయడం జరుగుతుందని అన్నారు. దీంతో మండలానికి అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసి గ్రామంలో సీసీ రోడ్లు, మురికి కాలువలు, దేవాలయాల నిర్మాణాలు, కల్యాణలక్ష్మీ, షాదీముబారక్, రైతుబీమా, రైతుబంధుతో పాటు ప్రజలకు అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు ఎంతో కృషి చేయడం జరిగిందని తెలిపారు. దీంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు రైతులకు రూ.లక్ష వరకు రైతులకు రుణమాఫీ కూడా పూర్తి చేసేలా చర్యలు తీసుకుందని అన్నారు. దీంతో పాటు నూతన గ్రామపంచాయతీలు ఏర్పడి గ్రామాలు ఎంతో అభివృద్ధి చెందాయని అన్నారు. నూతన గ్రామపంచాయతీలకు రూ.20లక్షలతో భవనాలను నిర్మించేందుకు నిధులు మంజూరు చేసి పనులను కూడా ప్రారంభించడం జరిగిందని అన్నారు. అదేవిధంగా ఇటీవల మండలంలో కురిసిన భారీ వర్షాలకు రైతులకు సంబంధించిన పంట పొలాలు పూర్తిగా దెబ్బతినడం జరిగిందని రైతులు తెలపడంతో మండల నాయకులతో కలిసి ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి ప్రభుత్వం తరపున నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించేలా కృషి చేస్తామని తెలిపారు.

అభివృద్ధి పనులు పకడ్బందీగా చేసేలా చర్యలు

- పీఆర్ ఈఈ రామ్మోహన్ రావు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

పంచాయతీ రాజ్ విభాగంలో చేపడుతున్న అభివృద్ధి పనులను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఆ శాఖ ఈఈ రామ్మోహన్‌రావు అన్నారు. నవతెలంగాణ వార్షికోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడారు. గత ఆర్థిక సంవత్సరంలో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ ద్వారా గ్రామపంచాయతీ భవనాలను ప్రారంభించినట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా 101 పనులు గుర్తించగా 84 ప్రగతిలో ఉన్నాయని ఇంకా 17 ప్రారంభం కాలేదని తెలిపారు. ఇదే పథకం ద్వారా జిల్లాలో 758 సీసీ రహదారుల నిర్మాణానికి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. మన ఊరు మనబడి ద్వారా మొదటి దశలో 113 పనులను, ఎంజీఎన్ఆర్ఈజీఎస్ ద్వారా 233 పనులు చేస్తున్నట్టు తెలిపారు. ప్రతి పనిపై ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తున్నామన్నారు. మన ఊరు మనబడి పనులు పూర్తయి అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. డీఎంఎఫ్టి ద్వారా 411 లక్షలు విలువగల 16 పనులు చేస్తున్నట్లు తెలిపారు. సీఎస్ఆర్ ద్వారా 142తో పాటు, కేర్ ఇండియా, ఆయుష్ ద్వారా మరో 13 పనులు చేస్తున్నట్టు తెలిపారు. ప్రజలు అభివృద్ధి పనులపై ఎక్కడైనా లోపాలు కనిపిస్తే తమ దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు.

మండల అభివృద్ధికి జీవితాంతం కృషి చేస్తా

- ఎంపీపీ బసార్కర్ విశ్వనాథ్
- విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి



నవతెలంగాణ-కౌటాల

మండలాన్ని అభివృద్ధి చేయడానికి జీవితాంతం కృషి చేస్తానని ఎంపీపీ బసార్కర్ విశ్వనాథ్ అన్నారు. నవతెలంగాణ వార్షికోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడారు. మండల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక, చేపడుతున్న సంక్షేమ పథకాల అమలుతీరు, తదితర అంశాలపై ప్రత్యేకంగా వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను రైతులందరికి రాజకీయాలకు అతీతంగా అందేలా కృషిచేస్తానన్నారు. అన్ని వర్గాల అభివృద్దే లక్ష్యంగా ప్రభుత్వం నిరుపేదల కోసం కళ్యాణలక్ష్మి, షాదీముబారక్, యాదవుల కోసం గొర్రెల పెంపకం, ఇతర కులాల కోసం ప్రత్యేక బడ్జెట్‌ను ప్రభుత్వం కేటాయిస్తుందని తెలిపారు. మండలకేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో సీసీ రోడ్లు, మురికి కాలువల నిర్మాణం, చేతిపంపుల ప్లాట్‌ఫాం నిర్మాణం, విద్యుత్ సౌకర్యం తదితర సౌకర్యాలు అందేలా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. భూములకు విలువ పెరగడంతో రాష్ట్ర ప్రభుత్వం శ్మశానవాటికలు, డంపింగ్‌యార్డులు, వినోదాలు, పల్లె ప్రకృతివనాలను ప్రతి గ్రామ పంచాయతీలో చేపట్టినట్లు తెలిపారు. ఎన్నికల సందర్భంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. మిషన్ భగీరథ ద్వారా మండలంలోని అన్ని గ్రామాలకు మంచినీటిని అందిస్తున్నామన్నారు. ఇంకా 10 శాతం పనులు మిగిలి ఉన్నాయని, వాటిని కూడా త్వరలో పూర్తిచేసి వంద శాతం ఇంటింటికి నీరందిస్తామన్నారు. మిషన్ కాకతీయ ద్వారా మండలంలోని చెరువుల్లో పూడిక తీయడంతో నీరు నిల్వ ఉండి రైతుల పంట పొలాలకు ఉపయోగపడుతున్నాయన్నారు. ప్రభుత్వం అందించే సబ్సిడీ చేప పిల్లలు పెంచుతూ జీవనోపాధి పొందుతున్నారని తెలిపారు. మిగిలిన చెరువులను పరిశీలించి పూడికతీత పనులు చేపట్టి రైతులకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తామన్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారంలో కుమురంభీం జిల్లాలోనే అన్ని మండలాల కంటే కౌటాల మండలం మొదటిస్థానంలో ఉందన్నారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో అన్ని సౌకర్యాలు కల్పించామని తెలిపారు. ప్రజలకు సేవ చేయాలనే ఆలోచన తపన ఉండాలే కానీ ఎవరైన ఏ రూపంలో సేవ చేయవచ్చని తెలిపారు. ఆయా గ్రామాల సమస్యలను తెలుసుకొని సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప దృష్టికి తీసుకెళ్లి ఆయన ద్వారా సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి ఒక్కొక్క సమస్యను పరిష్కరించుకుంటూ ముందుకెళ్తున్నామన్నారు. నాటుసారా, పేకాట, కోడిపందాలు వంటి చెడు వ్యసనాలను నిర్మూలించేందుకు శాయశక్తుల కృషి చేస్తున్నామన్నారు. మండలంలతో ఎలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించిన ముందుండి తనవంతు సహకారాన్ని అందిస్తున్నట్టు తెలిపారు. రాబోయే రోజుల్లో కౌటాల మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని స్పష్టం చేశారు. ప్రజలకు ఎలాంటి సమస్యలున్నా తనను నేరుగా సంప్రదిస్తే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి జీవితాంతం రుణపడి ఉంటానని అన్నారు.



















వర్క్‌షాప్‌లో టీబీజీకేఎస్ గేట్ మీటింగ్



నవతెలంగాణ-మందమర్రి

మందమర్రి ఏరియా వర్క్‌షాప్‌లో టిబిజికెఎస్ గేట్ మీటింగ్ నిర్వహించారు. సంఘం ఫిట్ కార్యదర్శి కొండల్‌రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఏరియా వైస్ ప్రెసిడెంట్ మేడిపల్లి సంపత్, రీజినల్ కార్యదర్శి రాజశేఖర్ మాట్లాడారు. ఉద్యోగులు, కార్మికులు ఎదురు చూస్తున్న 11వ వేజ్ బోర్డుకు సంబంధించిన 23 నెలల ఏరియర్స్ ఈ నెల 21న ఒకే దఫాలో ఇవ్వడానికి యజమాన్యాన్ని ఒప్పించిన ఘనత కేవలం టీబీజీకేఎస్‌కు దక్కుతుందన్నారు. జాతీయ సంఘాలు రెండు దఫాలుగా ఇస్తారని కార్మికులను అయోమయానికి గురిచేస్తున్నారన్నారు. గత గేట్ మీటింగ్‌లో చెప్పిన విధంగా ఒకేసారి ఇప్పించడానికి కృషి చేశామన్నారు. టీబీజీకేఎస్ అధ్యక్షురాలు కల్వ కుంట్ల కవిత అధ్వర్యంలో చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్, అధ్యక్షులు వెంకట్రావు, మిరియాల రాజిరెడ్డి, కెంగర్ల మల్లన్నను కలిసి యాజమాన్యాన్ని ఒప్పించామని తెలిపారు. సమావేశంలో నాయకులు పెంద్రి రాజిరెడ్డి, తోట రాజిరెడ్డి, సమ్మయ్య, మాధవరెడ్డి, ఈశ్వర్, గురువయ్య, సేఫ్టీ కమిటీ వర్క్‌మెన్ కమిటీ సభ్యులు శ్రీనివాస్, రాజేశ్వర్‌రావు, పోచయ్య, మల్లేష్, చక్రపాణి, ప్రభాకర్, రియాజ్, కిరణ్ పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత బీపీ, షుగర్ పరీక్షలు

మందమర్రి: మందమర్రి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. గురువారం మందమర్రి సింగరేణి హైస్కూల్ ప్రాంగణంలో 60మంది పేద ప్రజలకు ఉచితంగా షుగర్, బీపీ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు ఆగుళ్ల తిరుమలేష్ మాట్లాడుతూ షుగర్, బీపీ పరీక్షలను నెలకు ఒకసారైనా చేయించుకోవాలని సూచించారు. ముందు జాగ్రత్తగా టెస్టులు చేయించుకుని దానికి తగినట్లుగా మందులు ఉపయోగిస్తే షుగర్‌ను నియంత్రించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో మోర బద్రేశం, డిస్ట్రిక్ చైర్మన్ సోతుకు సుదర్శన్, సెక్రటరీ కొక్కుల మధు, ట్రెజరర్ తవటం శ్రీనివాస్, వైస్‌ప్రెసిడెంట్ గౌతమ్, సభ్యులు కేదారి పాల్గొన్నారు.

తిమ్మాపూర్‌లో ఉపాధి హామీ గ్రామసభ

జన్నారం : మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో మంగళవారం జాతీయ ఉపాధి హామీ పనులపై సర్పంచ్ జాడిగంగాధర్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. గ్రామానికి చెందిన ఉపాధి హామీ కూలీలు, వార్డు సభ్యులు, గ్రామ పెద్దల సమక్షంలో సోషల్ ఆడిట్ అధికారులు నివేదికలను చదివి వినిపించారు. ఈ నివేదికను ఆడిట్ అధికారులు ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజావేదికలో ప్రవేశపెడతారని తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి లావణ్య, ఫీల్డ్ అసిస్టెంట్ భూమయ్య, వార్డు సభ్యులు రాజన్న, చంద్రయ్య, వెంకట్, లక్ష్మి, శ్రీనివాస్, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

విద్యార్థులకు వరం.. జవహర్ నవోదయ

నవతెలంగాణ-కాగజ్‌నగర్

గ్రామీణ విద్యార్థులకు జవహర్ నవోదయ విద్యాలయం ఒక వరంగా మారింది. కార్పోరేట్ స్థాయిలో పేద గ్రామీణ విద్యార్థులకు ఉచిత విద్యను అందించేందుకు ఏర్పాటయిన జవహర్ నవోదయ విద్యాలయాలు మంచి ఫలితాలనందిస్తున్నాయి. గ్రామీణ విద్యార్థులకు ఉచితంగా కార్పోరేట్ విద్యను అందించేందుకు కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటయిన ఈ విద్యాలయాలలో కేవలం ప్రతిభ ఆధారంగానే ప్రవేశాలు కల్పిస్తుండడం, వీటిలో విద్యను అభ్యసించిన విధ్యార్థులు భవిష్యత్తు కాలంలో ఉన్నత స్థాయికి ఎదుగుతుండడంతో ఈ విద్యాలయాలు మంచి ప్రాచుర్యాన్ని సంపాదించాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మొదటి నుండి కాగజ్‌నగర్ పట్టణంలో ఉన్న ఈ జవహర్ నవోదయ విద్యాలయం కొత్త జిల్లాల ఏర్పాటు నేపథ్యంలో కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా పరిధిలోకి వచ్చింది.

30 ఎకరాల్లోని ప్రశాంత వాతావరణంలో విస్తరణ

1987లో ప్రారంభం

1986 జాతీయ విద్యావిధానాన్ని అనుసరించి కేంద్ర ప్రభుత్వంచే ఈ విద్యాలయాలు ప్రారంభించబడ్డాయి. దేశంలోని 28 రాష్ట్రాలు, ఏడు కేంద్ర పాలిత ప్రాంతాలలో విస్తరించి ఉన్న నవోదయ విద్యాలయాలను మన రాష్ట్రంలో జిల్లాకు ఒకటి చొప్పున కేటాయించారు. ఆదిలాబాద్ జిల్లా నవోదయ విద్యాలయాన్ని 1987-88 విద్యాసంవత్సరంలో కాగజ్‌నగర్‌లో నెలకొల్పారు. ప్రారంభంలో స్థానిక ఆర్‌ఆర్‌ఓ కాలనీలో ఈ విద్యాలయాన్ని నెలకొల్పారు. 1997-98లో ఈ విద్యాలయానికి స్థానిక త్రిశూల్‌పహాడ్‌పై స్థలం కేటాయించగా ఆధునాతన భవనాలను నిర్మించి అందులోకి విద్యాలయాన్ని తరలించారు. ప్రస్తుతం 30 ఎకరాల విస్తీర్ణంలో ఈ విద్యాలయం విస్తరించి ఉంది. విద్యార్థుల తరగతి గదులతో పాటు పరిపాలనా భవనాలు, వసతిగృహాలను ఆధునాతన సౌకర్యాలతో నిర్మించారు. విద్యార్థులు ఆడుకోవడానికి వీలుగా సువిశాలమైన క్రీడా మైదానం, ఒకేసారి 320 మంది విదార్థులు భోజనాలు చేసే వీలుగా భోజనాలయం నిర్మించారు. విద్యార్థులకు సౌకర్యంగా లైబ్రరీ, రీడింగ్ రూం, కంప్యూటర్ ల్యాబ్‌లను నిర్మించారు.

ఆరో తరగతిలో ప్రవేశం

ఈ విద్యాలయంలో ప్రతి ఏటా ఆరో తరగతిలో విద్యార్థులను చేర్చుకుంటారు. ఇందుకు గాను జవహర్ నవోదయ విద్యాలయ సమితి ప్రతి ఏటా ప్రవేశపరీక్ష నిర్వహిస్తుంది. మొత్తం విద్యాలయంలో 80 సీట్లను ఈ ప్రవేశపరీక్ష ద్వారా భర్తీ చేస్తారు. 80 సీట్లకు ప్రతి ఏటా సుమారు పది వేల మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకుంటారు. ఇందులో ప్రవేశపరీక్షలో అద్భుత ప్రతిభ కనబర్చిన 80 మంది విద్యార్థులను మాత్రమే ఎంపిక చేసి ప్రవేశాలు కల్పిస్తారు. 6వ తరగతి నుండి 12వ తరగతి వరకు విద్యార్థులు ఈ విద్యాలయంలో పూర్తి ఉచితంగా విద్యాభ్యాసాన్ని కొనసాగించవచ్చు. ప్రతి తరగతికి రెండు సెక్షన్‌లు ఉంటాయి. ప్రతి సెక్షన్‌లో 40 మంది విద్యార్థులు ఉంటారు. విద్య, భోజనము, యునిఫాం, పుస్తకాలు, ఆవాస వసతులు ఉచితమే అయినా 9 నుండి 12వ తరగతి వరకు కనీస నెలసరి ఫీజుగా రూ. 200 చెల్లించాలి. ఈ ఫీజు చెల్లింపు నిబంధన బాలికలకు, ఎస్సీ, ఎస్టీ, దారిద్ర్య రేఖకు దిగువగా ఆదాయం కలిగిన వారికి, అంగవైకల్యం కలిగిన వారికి వర్తించదు. గ్రామీణ ప్రాంత ప్రతిభావంతులైన విద్యార్థులకు అధిక ప్రాధాన్యత ఇస్తూ ఉన్నత ప్రమాణాలతో కూడిన ఆధునాతన విద్యను అందించడంతో పాటు వారిలో ఉత్తమ సంస్కృతి విలువలను పెంపొందించడం, పర్యావరణం పట్ల సదవగాహన, సాహసోపేత కృత్యాలతో పాటు క్రీడలు, వ్యాయామ విద్యలో సమున్నత శిక్షణ ఇవ్వడం నవోదయ విద్యాలయాల ముఖ్య ఉద్దేశ్యం. అంతేకాకుండా హిందీ, ఇంగ్లీషు, తెలుగు భాషల్లో తగిన నైపుణ్యాన్ని పెంపొందించడం, వలస విద్యా (మైగ్రేషన్) విధానం ద్వారా హిందీ రాష్ట్ర విద్యార్థులను హిందీయేతర రాష్ట్రాలకు, హిందీయేతర రాష్ట్రాల నుండి హిందీ రాష్ట్రాలకు పంపించి జాతీయ సమైక్యతాభావాన్ని పెంపొందించడం ముఖ్య ఉద్దేశ్యాలుగా ఈ విద్యాలయాలు కొనసాగుతున్నాయి.

రిజర్వేషన్ విధానం

జిల్లాలో కనీసం 75 శాతంసీట్లు గ్రామీణ ప్రాంత అభ్యర్థుల ద్వారా భర్తీచేయబడతాయి. మిగిలిన సీట్లు పట్టణ ప్రాంత అభ్యర్థుల ద్వారా భర్తీ చేయబడతాయి. గ్రామీణ ప్రాంతాలలో ఉన్న ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 3,4, మరియు 5వ తరగతి విద్యాసంవత్సరాలు పూర్తిగా చదివిన వారు గ్రామీణ ప్రాంతీయులకు కేటాయించిన సీట్లకు అర్హులుగా పరిగణించబడతారు. పట్టణ ప్రాంతాలలోని పాఠశాలల్లో 3,4, మరియు 5వ తరగతిలో ఏ ఒక్క తరగతిలోనైనా ఒక్క రోజు చదివినా ఆ అభ్యర్థిని పట్టణ ప్రాంత అభ్యర్థిగా పరిగణలోనికి తీసుకుంటారు. 75 శాతం సీట్లను గ్రామీణ ప్రాంత అభ్యర్థులకు, 25 శాతం సీట్లను పట్టణ ప్రాంత అభ్యర్థులకు కేటాయిస్తారు. జిల్లా జనాభా ప్రాతిపదికన ఎస్సీలకు 15 శాతం, ఎస్‌టిలకు 7.5 శాతం విధిగా కేటాయించబడును. ఈ రిజర్వేషనేకాకుండా ఎస్సీ, ఎస్టీలకు ఓపెన్ మెరిట్‌లో కూడా సీట్లు లభించవచ్చు. బాలికలకు సీట్లలో 1/3వ వంతు రిజర్వేషన్ ఉంటుంది. అంగవైకల్యం కలిగిన వారికి 3 శాతం రిజర్వేషన్ కలదు.

విద్యాలయం ప్రత్యేకతలు

ఈ విద్యాలయంలో వివిధ ప్రత్యేకతలు ఉన్నాయి. సువిశాలమైన క్రీడా ప్రాంగణంతో పాటు తగినంత ఆట స్థలం, బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్, కబడ్డీ, ఖోఖో ఆడేందుకు అవసరమైన క్రీడా పరికరాలు అందుబాటులో ఉన్నాయి. ఇద్దరు సుశిక్షితులైన వ్యాయామ ఉపాధ్యాయులు ఉన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించిన పోటీలలో రాష్ట్ర స్థాయిలో, జాతీయ స్థాయిలో ఈ విద్యార్థులు రాణిచారు. చిత్రలేఖనంలో కూడా ఈ విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తున్నారు. సంగీతం, నృత్యంలలో ప్రత్యేక శిక్షణ ఇస్తుంటారు. అత్యాధునికమైన కంప్యూటర్ ల్యాబ్‌తో పాటు ప్రతి విద్యార్థికి ఒక ల్యాప్‌టాప్ అందుబాటులో ఉంటుంది. జాతీయ స్థాయి సైన్స్, మ్యాథ్స్ ఎగ్జిబిషన్‌లో ఈ విద్యార్థులు పాల్గొంటున్నారు. ప్రతిభావంతులైన విద్యార్థులకు ఉచిత ఐఐటి/ఎన్‌ఇఇలో శిక్షణ ఇస్తారు. శాంసంగ్ స్మార్ట్‌రూంతోపాటు ఆధునాతన సాంకేతిక విద్య పరిజ్ఞానంతో కూడిన విద్యను ఈ విద్యాలయంలో అందిస్తారు. ప్రాథమిక చికిత్స కోసం పూర్తి కాలపు నర్సుతో పాటు ఆసుపత్రికి తీసుకువెళ్లేందుకు ఒక వాహనం ఉంది. ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బందికి కూడా తరచుగా శిక్షణ ఇస్తుంటారు. సువిశాలమైన భోజనాలయంతో పాటు అత్యాధునికమైన వంటసామాగ్రి, మినరల్ వాటర్ సౌకర్యం ఉంది. సుశిక్షితులైన వంట వారితో పరిశుభ్ర వాతావరణంలో నాణ్యతతోకూడిన రుచికరమైన భోజన వసతి ఉంది.


జవహర్ నవోదయ విద్యాలయం



ప్రతి విద్యార్థికి ల్యాప్‌టాప్‌తో విద్యాబోధన

విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి : చక్రపాణి, ప్రిన్సిపాల్, జవహర్ నవోదయ విద్యాలయం



గ్రామీణ ప్రాంత విద్యార్థులు జవహర్ నవోదయ విద్యాలయాలను సద్వినియోగం చేసుకోవాలని విద్యాలయం ప్రిన్సిపాల్ బి చక్రపాణి అన్నారు. ప్రైవేట్ కార్పోరేట్ విద్యాసంస్థలకు ధీటుగా ఉత్తమ విద్యాబోధన అందించడమే ధ్యేయంగా ఈ విద్యాలయాలను కేంద్ర ప్రభుత్వం నెలకొల్పిందని, ఈ విద్యాలయాలలో ప్రవేశానికి గ్రామీణ విద్యార్థులకే ఎక్కువ అవకాశాలు ఉంటాయని తెలిపారు. ఆరో తరగతిలో విద్యాలయంలో ప్రవేశం పొందితే 12వ తరగతి వరకు పూర్తి ఉచితంగా ఉత్తమ విద్యాబోధన అందిస్తామని తెలిపారు. ఫలితాల సాధనలో కూడా తమ విద్యార్థులు ముందంజలో ఉన్నట్లు తెలిపారు.

గోండుల ఆరాధ్య దైవం నాగోబా

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

కొండకోనల్లో నివసించే గిరిజనులు తమ జాతి దైవంగా నాగోబాను కొలుస్తారు. దక్కన్ పీఠభూమి గిరిపుత్రులందరికీ నాగోబాయే ఆరాధ్యదైవం. ప్రతి సంవత్సరం పుష్యమాసం(జనవరి, ఫిబ్రవరి) అమావాస్య రోజున అత్యంత వైభవంగా నాగోబా జాతర జరుగుతుంది. ఈ దేవాలయం ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కెస్లాపూర్ గ్రామంలో ఉంది. జాతర కోసం జిల్లా అధికార యంత్రాంగం పూర్తి ఏర్పాట్లు చేస్తుంది. జాతరకు వచ్చే పొరుగు రాష్ట్రాల గిరిజనులకు సౌకర్యాలు కల్పిస్తారు. అయితే జాతర చివరి రోజున 'ప్రజాదర్బార్' నిర్వహించడం ఆనవాయితీ. దీన్ని 1946 సంవత్సరంలో ప్రముఖ మానవ పరిణామ శాస్త్రవేత్త హెమన్‌డార్ఫ్ ప్రారంభించినట్లు చరిత్ర చెబుతోంది.



అప్పట్నుంచి అధికార దర్బార్ నిర్వహించడం సాంప్రదాయంగా కొనసాగుతోంది. ఆ రోజు జిల్లా కలెక్టర్ సహా ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి, మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు కెస్లాపూర్‌లో కొలువు దీరుతారు. వివిధ తెగలకు చెందిన గిరిజనులు సమస్యలపై అధికారులకు అర్జీలు అందజేస్తారు. వాటిని అక్కడికక్కడే పరిష్కారమయ్యే ఈ వేదిక ఏర్పాటు చేశారు. కాని ఏటా సమస్యలపై విన్నవించినా పరిష్కారమార్గం దొరకకపోవడంతో 'ప్రజాదర్బార్' ప్రాధాన్యత కోల్పోతోంది. జాతర సందర్భంగా పుష్యమాసం అమావాస్య రోజున మెస్రం తెగ గిరిజనులు గోదావరి నదీ జలాలతో నాగోబాకు అభిషేకం చేసి పూజలు చేస్తారు.



నాగోబా వెనుక..

కొన్ని సంవత్సరాల క్రితం నాగేంద్రుడు మెస్రం కుటుంబానికి చెందిన నాగాయి మోతి, రాణి దంపతులకు కలలో కనిపించి సర్పం రూపంలో జన్మిస్తానని చెప్పాడట. ఆ తర్వాత కల నిజమైందని గిరిపుత్రులు విశ్వసిస్తారు. కొంత కాలానికి నాగేంద్రుడి తల్లి తన తమ్ముని కూతురు గౌరితో సర్ప రూపంలో గల నాగేంద్రుని వివాహం జరిపిందట. అత్త ఆజ్ఞ మేరకు గౌరి భర్త అయిన నాగేంద్రున్ని బుట్టలో పెట్టుకొని గోదావరికి పయనమైనట్లు గిరిజనులు చెబుతుంటారు. ప్రయాణం మధ్యలో పాము ఒక చోట ఉడుము రూపంలో కన్పించగా ఆ ప్రాంతం ఉడుంపూర్‌గా మారింది. అనంతరం ధర్మపురి నదిలో గౌరి స్నానం చేస్తుండగా ఆమెను చూసి నాగేంద్రుడు మనిషిగా మారాడట. కాగా నాగేంద్రుడు పేరు ప్రతిష్టలు కావాలో, సాంప్రదాయం కావాలో తేల్చుమని అనగా గౌరి సాంప్రదాయాలను కాదని పేరు ప్రతిష్టలు కోరుకోగా మనిషి తిరిగి పాముగా మారినట్లు కథనం. తదనంతరం ఉడుంపూర్ నుండి గరిమెల వరకు వెతికిన గౌరి గోదారి నదిలో సత్యవతి గుండంలో కలిసి పోయిందని ప్రచారంలో ఉంది. గౌరి వెంట నాగేంద్రుడు ఉంచిన ఎద్దు బండగా మారింది. తర్వాత ప్రతి జంటకు బెటికొరియాడ్(నాగోబా సమక్షంలో కొత్త జంటలను కలపడం) తన సన్నిధిలోనే జరగాలని చెప్పి నాగేంద్రుడు కెస్లాపూర్ గుట్టల్లోకి వెళ్లిపోయాడని చెబుతుంటారు. కాలక్రమేణా అదే కెస్లాపూర్ గ్రామంగా మారిపోయింది. నాగేంద్రుడు వెళ్లిన పుట్ట వద్ద నాగోబా దేవాలయం వెలిసింది. ప్రతి ఏటా పుష్య అమావాస్య రోజున నాగేంద్రుడు ప్రత్యక్షమవుతాడని గోండుల ప్రగాఢ విశ్వాసం.

ప్రయోజనం లేని 'ప్రజాదర్బార్'

నాగోబా జాతర సందర్భంగా జిల్లా యంత్రాంగం కెస్లాపూర్ తరలొచ్చి గిరిజనం సమస్యల పరిష్కారానికి దర్బార్ నిర్వహిస్తున్నా వారికి ఏమాత్రమూ ఉపయోగపడడం లేదు. గిరిజన జీవితాలను అధ్యయనం చేసి వీరి కోసం ఒక వేదికను ఏర్పాటు చేశారు హెమన్‌డార్ఫ్. ఆనాటి నుండి నేటి వరకు ప్రతి ఏటా దర్బార్‌లు జరుగుతూనే ఉన్నాయి. గిరిజన తండాల్లో సమస్యలు సమస్యలుగానే దర్శనమిస్తున్నాయి. ప్రజాదర్బార్‌లో సమస్యలు అక్కడికక్కడే పరిష్కారమవుతాయని కేవలం ప్రచారానికే పరిమితమైంది. నేటి కంప్యూటర్ యుగంలో కూడా తండాల్లో గిరిజనులకు గుడిసెల్లోనే జీవిస్తున్నారు. వాగు, వంకల నీరే తాగుతున్నారు.



ఆర్ఎంపీ, పీఎంపీల నూతన భవనం ప్రారంభం

నవతెలంగాణ - కౌటాల

ఆర్ఎంపీ, పీఎంపీల నూతన భవనాన్ని జెడ్పీ వైస్ చైర్మన్ కోనేరు కృష్ణారావు మంగళవారం ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆర్ఎంపీలు మారుమూల గ్రామాల్లో ప్రాథమిక చికిత్సలు నిర్వహించి ఎందరో ప్రాణాలను కాపాడుతున్నారన్నారు. గ్రామాల్లో వెనుకబడిన తరగతులకు చెందిన వారికి తక్కువ ఖర్చుతో వైద్యమందించి వారికి సాయపడాలని సూచించారు. వైద్యం ఖర్చుతో కూడుకున్నదైనప్పటికీ కొంతలోకొంత ప్రజాసేవలో ఆర్ఎంపీ, పీఎంపీలు పాలుపంచుకోవాలని పేర్కొన్నారు. అనంతరం ఆర్ఎంపీ, పీఎంపీలు శాలువాలతో జెడ్పీ వైస్ చైర్మన్ కోనేరు కృష్ణారావును సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ బసార్కర్ విశ్వనాథ్, తహసీల్దార్ కిరణ్‌కుమార్, సర్పంచ్ వొజ్జెల మౌనీష్, ఉప సర్పంచ్ పసునూరి తిరుపతి, ఆర్ఎంపీ, పీఎంపీలు బొద్దున సత్యనారాయణ, ఎలుక కైలాసం, రాజేశ్వర్ పాల్గొన్నారు.


భవనాన్ని ప్రారంభిస్తున్న జడ్పీ వైస్ చైర్మెన్ కోనేరు కృష్ణారావు







విద్యార్థుల్లో వినూత్న ఆలోచనలకు జిజ్ఞాస ప్రయోగాలు



నవతెలంగాణ-భీమారం

విద్యార్థుల్లో వినూత్న ఆలోచనలు పెంపొందించేందుకే జిల్లా సైన్స్ కేంద్రం ఆధ్వర్యంలో జిజ్ఞాస ప్రయోగాలతో ప్రోత్సహిస్తున్నామని జిల్లా స్థాయి జిజ్ఞాస సంచార ప్రయోగశాల నిర్వహకులు సాయికుమార్, సంపత్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు శాస్త్రీయ విజ్ఞానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మానవ శరీరంలో అంతర్గత అవయవాలపై స్వయంగా ప్రయోగ పరికరాల ద్వారా ప్రయోగ నైపుణ్యాలను పెంపొందించారు. 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు కృత్యాధార బోధనలతో ఆసక్తి పెంపొందించారు. దీంతో కాంతి పరివర్తనం, వక్రీభవనత్వాలు, గమణ నియమాలు, రసాయన చర్యల రకాలు, ఆమ్ల క్షార ధర్మాలు ప్రయోగపూర్వకంగా వివరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం వెంకటేశ్వర్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సబ్ స్టేషన్ ఏర్పాటు చేస్తేనే విద్యుత్ సమస్య తీరుతుంది

నవతెలంగాణ-జన్నారం

మండల కేంద్రంలో 132కెవి విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేస్తేనే సమస్య తీరుతుందని తెలంగాణ మాదిగ హక్కుల దండోరా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నాయకులు కందుకూరి రాజు అన్నారు. 16 రోజులుగా మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద రిలే నిరాహార దీక్ష చేస్తున్న భూమాచారికి మంగళవారం మద్దతు తెలిపారు. మండల కేంద్రంలో సబ్‌స్టేషన్ ఏర్పాటు చేసేంత వరకు నిరాహార దీక్ష కొనసాగుతుందన్నారు. అధికారులు స్పందించి వెంటనే సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు లింగంపల్లి రాజలింగు, మండల నాయకులు కొండుకూరి ప్రశాంత్, ముల్కాల రమేష్, జిలకర హరీష్, కొండూకూరి ప్రభుదాస్, జిల్కర గంగన్న, సాకలి లక్ష్మణ్, జంగం రవి, ఉప సర్పంచ్, ప్రభుదాస్, గంగన్న, లింగన్న, రాజు, దాసు, రమేష్, ప్రశాంత్, గంగాధర్, రాజన్న పాల్గొన్నారు.

దేశీదారు పట్టివేత

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ పట్టణంలోని సంఘం బస్తీలో మంగళవారం ఎక్సైజ్ అధికారులు దేశీదారు పట్టుకున్నారు. ఎక్సైజ్ సీఐ మంగమ్మ తెలిపిన ప్రకారం సంఘంబస్తీలో దేశీదారు అమ్ముతున్నట్లు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించగా 54దేశీదారు బాటిళ్లు స్వాధీనమయ్యాయనీ, దీనిని విక్రయిస్తున్న అయిల్ల మహేష్ పై కేసు నమోదు చేసినట్లు ఆమె వివరించారు. ఈ దాడులలో ఎస్ఐ స్వాతి, సిబ్బంది లింగయ్య, నవీన్, సతీష్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.



అర్హులైన వారికి ఓటు హక్కు కల్పించాలి

- నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి చాహత్ బాజ్‌పాయ్



నవతెలంగాణ-తలమడుగు

అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించే విధంగా అధికారులు పని చేయాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయానికి చేరుకొని మండల ఓటర్ లిస్టును క్షుణ్ణంగా పరిశీలించారు. 6, 7, 8 ఫారాలను పరిశీలించి ఓటరు తమ పూర్తి డేటా తప్పులు లేకుండా పూర్తి చేయాలని కోరారు. మండల పోలింగ్ బూత్‌ల గురించి తహసీల్దార్ రాజమోహన్‌ను అడిగి తెలుసుకున్నారు. 18 ఏండ్లు నిండిన యువతీ యువకులను తప్పకుండా ఓటర్ లిస్టులో చేర్పించాలని తెలిపారు. నడింపల్లి, నందిగామ గిరిజన గ్రామాలను సందర్శించి గ్రామ జనాభా వివరాలు తెలుసుకున్నారు. సిసి రోడ్లను పరిశీలించారు.

పీఓను కలిసిన సర్పంచ్, గ్రామస్తులు

ఐటిడిఎ పిఓ, నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి చాహత్ బాజ్‌పాయ్‌ను సర్పంచ్ కళ్లెం కరుణాకర్‌రెడ్డితో పాటు గ్రామస్తులు మర్యాదపూర్వకంగా కలిసి బొకె అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మండల కేంద్రంలో జీసిసి కొత్త భవనం నిర్మించాలని పిఓను కోరారు. స్థలం ఉన్నందున భవనం మంజూరు చేయాలని విన్నవించారు. పీఓను కలిసిన వారిలో పాఠశాల చైర్మన్ గంగన్న, గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ ఆసం రవీందర్, గ్రామస్తులు బద్దం నవీన్‌రెడ్డి, శ్రీకాంత్ ఉన్నారు.

మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక చర్యలు



కాసిపేట : మహిళల ఆరోగ్యంపై తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య మహిళా క్లీనిక్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఆరోగ్య మహిళా పథకం ప్రవేశ పెట్టి 18 ఏళ్ల దాటిన మహిళలకు ప్రతి మంగళవారం ఉచితంగా అన్ని రకాల వైద్య పరీక్షలు చేసి, వ్యాధి నిర్ధారణ కాగానే చితంగా మందులు, ఇంజక్షన్లు అందించడం జరుగుతుందని, ఆపరేషన్ అవసరమైతే రిఫర్ చేసి.. ఆపరేషన్ చేయిస్తారన్నారు. గ్రామ ప్రాంత మహిళలకు ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు అవగాహన కల్పించి చైతన్య వంతం చేసి పథకాన్ని సద్వినియోగం చేసుకునేలా చూడాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో ఆరోగ్య తెలంగాణ దిశగా ముందుకు వెళ్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రొడ్డ లక్ష్మీ, జడ్పీటీసీ పల్లె చంద్రయ్య, వైస్ ఎంపీపీ పూస్కూరి విక్రంరావు, ఎంపీటీసీలు కొండబత్తుల రాంచందర్, అక్కెపల్లి లక్ష్మీ, చంద్రమౌళి, సర్పంచ్లు ఆడె బాదు, సపాట్ శంకర్, రాంటెంకి శ్రీనివాస్, దరావత్ దేవి, రైతు బంధు అధ్యక్షుడు దుర్గం పోశం తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు ప్రణాళికాబద్ధంగా బోధించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా స్థాయిలో స్థానిక డైట్ కళాశాలలో జరుగుతున్న ఉన్నతి శిక్షణా కార్యక్రమంలో భాగంగా ఎఫ్ఎల్ఎన్ మండల రిసోర్స్ సభ్యుల శిక్షణా కార్యక్రమాన్ని ఎస్సీఈఆర్టీ కోఆర్డినేటర్ సువర్ణ వినాయక్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత స్థాయిలో అంటే 6 నుండి 9 వతరగతుల్లో ఉన్న విద్యార్థులలో మౌళిక సామర్థ్యాలైన చదవడం, రాయడంతో పాటు ఆయా తరగతుల అభ్యసన ఫలితాలు సాధించడానికి ఈ ఉన్నతి కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా ఉపాధ్యాయులు ఒక ప్రణాళికాబద్ధంగా బోధించాలని అందుకోసం ఈ శిక్షణా కార్యక్రమాల్లో తరగతి గదుల్లో అమలు పరిచే బోధనాభ్యసన ప్రక్రియలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. అదేమాదిరిగా ప్రతీ సంవత్సరం 10వ తరగతికి నవంబర్ నుండి ప్రత్యేక తరగతులు నిర్వహించే వాళ్ళమని ఈ విద్యాసంవత్సరం నుండి సెప్టెంబర్ మాసం నుండే ప్రత్యేక తరగతులను లక్ష్య పేరుతో అమలు చేస్తున్నామని, అందుకోసం 10వ తరగతి విద్యార్థులను సంసిద్ధులను చేయాల్సిన అవసరం ఉందని తెలియజేశారు. ఈ శిక్షణా కార్యక్రమంలో క్వాలిటీ కోఆర్డినేటర్ కంటె నర్సయ్య, రాష్ట్ర రిసోర్స్ గ్రూప్ సభ్యులు పోరెడ్డి అశోక్, పసుల ప్రతాప్, డైట్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కోల కిరణ్ కుమార్, రిసోర్స్ పర్సన్స్ చిందం ఆశన్న, చరణ్ దాస్, వేణుగోపాల్, పొచ్చన్న, రవికుమార్, స్వామి పాల్గొన్నారు.

బీజేపీలో చేరికలు

లక్ష్మణచాంద : మండలంలోని కనకాపూర్, మాచాపూర్, మల్లాపూర్, మునిపెల్లి, వడ్యాల్ గ్రామాల నుండి బీఆర్ఎస్ నాయకులు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం బీజేపీలో చేరారు. వీరికి మహేశ్వర్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కనకాపూర్ గ్రామం నుండి పలువురు ఇతర పార్టీ సీనియర్ నాయకులు, యువతతో పాటు, మాచాపూర్- బి మల్లాపూర్ ఉమ్మడి గ్రామ పంచాయతీ సర్పంచ్ అడిచేర్ల రవి, ఉప సర్పంచ్ మేకల అశోక్, వార్డ్ మెంబర్ సుంకరి శ్రీనివాస్, రాజారాం ముత్యం బీజేపీలో చేరారు. మునిపెల్లి గ్రామం నుండి వార్డ్ మెంబెర్స్ బొడ్డు నరేష్, రాజ్ కుమార్, మాజీ ఉప సర్పంచ్ నర్సారెడ్డి తో పాటు యూత్ సభ్యులు, మహిళలు భారీగా బీజేపీ లో చేరారు.వడ్యాల్ గ్రామం నుండి దొడ్లే ప్రసాద్ బొడ్డు పోతన్న తో పాటు పలువురు నాయకులు కార్యకర్తలు చేరారు. ఈ సందర్భంగా కష్టపడి పనిచేయాలని కార్యకర్తలకు మహేశ్వర్‌రెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రావుల రాంనాథ్, భూపాల్ రెడ్డి, గాండ్ల చిన్నయ్య, సరికెల గంగన్న, వెంకట్ రెడ్డి, గోవర్ధన్ , వేణు గౌడ్ , భూపతి రెడ్డి, భీమ్ రెడ్డి, ,లక్ష్మణ్, భరత్ నారాయణ, శ్రీధర్‌రెడ్డి, ఓస రాజు, రఘు పాల్గొన్నారు.

ఎస్పీఎం..ఇదేం వ్యవహారం..!

- రోడ్లపై లారీల నిలిపివేతతో ప్రమాదాలు
- హెచ్చరించినా పట్టించుకోని యాజమాన్యం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

సిర్పూరు పేపర్ మిల్లు నూతన యాజమాన్యం నియంత పోకడలకు పోతోంది. తన స్థలాలంటూ పట్టణంలోని ప్రధాన రోడ్లను ఇప్పటికే మిల్లు ఆవరణలోకి తీసుకున్న యాజమాన్యం ఇపుడు ప్రధాన రోడ్లపై విచ్చలవిడిగా లారీలను నిలుపుతూ ప్రమాదాలకు కారణమవుతోంది. లారీ చౌరస్తా నుండి సర్‌సిల్క్ వెళ్లే రహదారిలో పోలీసు స్టేషన్ సమీపంలో ప్రధాన రోడ్డుపైనే లారీలను నిలిపివేస్తున్నారు. మిల్లుకు బొగ్గు చూర సరఫరా చేసే లారీలను రోజుల తరబడి ఇక్కడే నిలిపివేస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సర్‌సిల్క్‌తో పాటు విజయబస్తీ, చింతగూడ, కోయవాగు ప్రజలు నిత్యం మార్కెట్‌కు వస్తూ పోతుంటారు. ఉదయం నుండి రాత్రి వరకు ఈ రాకపోకలు సాగుతాయి. వీరికి ఈ లారీలు పెద్ద సమస్యగా మారాయి. ముఖ్యంగా లారీలను నిలిపి ఉంచే ప్రాంతంలో వీధి దీపాలు కూడా లేవు. ముందున్న లారీలు కనిపించక, వాహనదారులు ఆ లారీలను ఢీకొంటుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్లపై నిలిపి ఉంచిన లారీలతో ప్రమాదాలు జరుగుతాయని పత్రికలలో కథనాలు వచ్చినా, స్థానికులు సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేస్తున్నా యాజమాన్యానికి చీమ కుట్టినట్లయినా లేదు.

ఫుట్‌పాత్‌ల నిర్మాణంతో ఇరుకుగా మారిన రోడ్లు

ఎస్పీఎం క్రీడా మైదానం నుండి సర్‌సిల్క్ వెళ్లే దారిలో యాజమాన్యం ఫుట్‌పాత్‌లను నిర్మించింది. వీటి నిర్మాణంతో ప్రధాన రహదారి ఇరుకుగా మారి వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. గతంలో ఈ రోడ్డుకు ఇరువైపులా ఖాళీ స్థలం ఉండడంతో రోడ్డు విశాలంగా ఉండేది. కాని ఒక పక్క ఫుట్‌పాత్ నిర్మాణం, మరోవైపు కంచె వేయడంతో రోడ్డు ఇరుకుగా మారింది. ఒకేసారి రెండు వాహనాలు వెళ్లలేని పరిస్థితి ఉంది. మిల్లు స్థలాల పేరుతో ప్రధాన రహదారులకు అడ్డంగా గోడలు నిర్మించడం, మిల్లు లారీలను ప్రధాన రహదారులపై రోజుల తరబడి నిలిపి ఉంచడం, ఫుట్‌పాత్‌ల నిర్మాణం పేరుతో రోడ్లను ఇరుకుగా మార్చడం లాంటి చర్యలకు మిల్లు యాజమాన్యం పాల్పడుతున్నా అటు పోలీసుశాఖ, ఇటు మున్సిపల్ శాఖ పట్టించుకోకపోవడం పట్ల స్థానికుల నుండి తీవ్ర విమర్శలు వస్తున్నాయి.



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఈ వ్యక్తి పేరు కోడం సదాశివ్. బాలాజీనగర్‌కు చెందిన ఈ వ్యక్తి సోమవారం రాత్రి ఏడు గంటల సమయంలో సర్‌సిల్క్ వెళుతుండగా పోలీసు స్టేషన్ సమీపంలో చీకటిలో నిలిపి ఉంచిన ఎస్పీఎం ముడి సరుకు లారీ కనిపించక వెనుక నుండి ఢీ కొట్టాడు. దీనితో తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఆ లారీని స్టేషన్‌కు తరలించారు.



రోడ్డుపై నిలిపి ఉంచిన లారీలు

ఎస్పీఎం నిర్లక్ష్యమే కారణం : ముంజం ఆనంద్‌కుమార్, నాయకుడు

సోమవారం ఎస్పీఎం లారీ ఢీకొని గాయపడ్డ కోడం సదాశివ్ ఘటనకు యాజమాన్య నిర్లక్ష్యమే కారణం. ఈ రోడ్డుపై గత కొన్ని నెలలుగా యాజమాన్యం పదుల సంఖ్యలో వాహనాలను నిలిపి ఉంచుతోంది. దీనితో ప్రమాదాలు జరుగుతాయని సోషల్ మీడియా ద్వారా ఎన్నోసార్లు హెచ్చరించినా యాజమాన్యం పట్టించుకోలేదు. ఇప్పటికైనా పోలీసులు, మున్సిపల్ అధికారులు శ్రద్ధ తీసుకొని యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలి.

అంగన్వాడీ ఉద్యోగులకు రూ.26వేల వేతనం చెల్లించాలి

- సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్

నవతెలంగాణ-నిర్మల్

అంగన్వాడీ ఉద్యోగులను రెగ్యులర్ చేసి కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ అన్నారు. జిల్లా కేంద్రంలో అంగన్వాడీలు చేపట్టిన సమ్మెకు అంగన్వాడీ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. జయలక్ష్మితో కలిసి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడారు. అంగన్వాడీ ఉద్యోగులు లేబర్ యాక్ట్ ప్రకారం నెల రోజుల ముందే ఐసిడిఎస్ కమిషనర్‌కు సమ్మె నోటీస్ ఇచ్చారన్నారు. అయినా కేసీఆర్ ప్రభుత్వం అంగన్వాడీలను బెదిరింపులకు పాల్పడుతున్నారని, ఇది సరైంది కాదని పేర్కొన్నారు. ఇప్పటికైనా అంగన్వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, లేకుంటే సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అంగన్వాడీ సెంటర్ల తాళాలు పగలగొట్టి ఐకెపి వివోఏలకు, పంచాయతీ సెక్రెటరీలకు అప్పజెప్పడం సరైన పద్ధతి కాదన్నారు. ఎవరి పని వారే చేయాల్సిన అవసరముందని, బీఆర్ఎస్ ప్రభుత్వం రాజ్యాంగ నిబంధనలు ఉల్లంఘించి వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. అంగన్వాడీ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జయలక్ష్మి మాట్లాడుతూ అంగన్వాడీ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలన్నారు. కనీస వేతనం, పెన్షన్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ చెల్లించాలన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ టీచర్లకు రూ. 10లక్షలు, హెల్పర్లకు రూ. 5లక్షలు చెల్లించాలన్నారు. ప్రమాద బీమా సౌకర్యం రూ. 5లక్షలు చెల్లించాలన్నారు. సమ్మె నోటీసులో తెలియజేసిన ఇతర డిమాండ్స్ అన్నింటినీ పరిష్కరించాలని కోరారు. అనంతరం నాయకులు ఎన్‌హెచ్ఎం ఉద్యోగుల దీక్షా శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర కోశాధికారి వంగూరు రాములు, జిల్లా కార్యదర్శి బొమ్మెన సురేష్, జిల్లా అధ్యక్షులు పి.గంగామణి, అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షులు రాజమణి, లలిత, శైలజ, విజయ, దేవిక, లావణ్య, రమ్య, భాగ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పాలడుగు భాస్కర్



మాట్లాడుతున్న జయలక్ష్మి

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం

- ఆసిఫాబాద్ కలెక్టర్ హేమంత్ బోర్కడే

నవతెలంగాణ - కాగజ్‌నగర్ రూరల్

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధమని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. పోలీసులు మీకోసం కార్యక్రమంలో భాగంగా ఓటర్లకు క్రమబద్ధమైన అవగాహన, ఎన్నికల ప్రక్రియలో ఓటర్ల భాగస్వామ్యం అనే అంశంపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. దీనికి కలెక్టర్, ఎస్పీ సురేష్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరై ఓటు హక్కు ప్రయోజనాన్ని వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరు రానున్న ఎన్నికల్లో ఓటు సద్వినియోగం చేసుకోవడం తమ బాధ్యతగా భావించాలన్నారు. యువత దేశ భవిష్యత్తును నిర్ణయించడంలో ప్రముఖ పాత్ర వహిస్తారని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఎస్పీ మాట్లాడుతూ 2023 జనవరి 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని తెలిపారు. ఆన్‌లైన్ కేంద్రాల్లోనూ ఓటరుగా నమోదు చేసుకునే సౌలభ్యముందని ఉన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను వినియోగించుకోవడం చాలా ముఖ్యమని, ప్రజాస్వామ్యంలో ఓటు విలువైందన్న విషయం తెలుసుకుని, అవసరమైనప్పుడు తమ వజ్రాయుధాన్ని వినియోగించి సమర్ధమైన నాయకుడిని ఎన్నుకోవాలన్నారు. విద్యార్థులు పాఠశాల, కళాశాల దశలోనే తమకంటూ లక్ష్యాన్ని ఏర్పరచుకొని వాటిని సాధించడం కొరకు శ్రమించాలని ఏకాగ్రత, ప్రణాళిక, క్రమశిక్షణతో విజయం సాధించవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్, టౌన్ సీఐ బుద్ధ స్వామి, తహశీల్దార్ ప్రమోద్, ఎస్సైలు చంద్ర శేఖర్, అంజన్న, గంగన్న, శ్రీకాంత్, కళ్యాణ్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రాజు, వివేకానంద డిగ్రీ కళాశాల అధ్యాపకులు దినేష్, విద్యార్థులు పాల్గొన్నారు.



మహిళా ఆరోగ్యం ప్రతి ఇంటా సౌభాగ్యం

- మంచిర్యాల జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్



నవతెలంగాణ- తాండూర్

కుటుంబంలోని మహిళలు ఆరోగ్యంగా ఉన్నప్పుడే ప్రతి ఇంటా సౌభాగ్యం సమకూరుతుందని కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. మంగళవారం తాండూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య లక్ష్మి కార్యక్రమాన్ని ప్రారంభించారు. బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య డిప్యూటీ డిఎంహెచ్ఓ విజయ పూర్ణిమ హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయరాదని సూచించారు. తెలంగాణ ప్రభుత్వం మహిళల ఆరోగ్య పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని వారికి సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించే లక్ష్యంతో ఆరోగ్య లక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు ప్రతి మంగళవారం 8 రకాల పరీక్షలను చేసి వారికి ఉచిత వైద్యాన్ని అందించడం అందించడం జరుగుతుందని తెలిపారు. ఆరోగ్యలక్ష్మి పథకంలో భాగంగా క్యాన్సర్, గర్భస్థ సమస్యలు, రక్తహీనత వంటి పరీక్షలు నిర్వహిస్తారని వివరించారు. ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య మాట్లాడుతూ టిఆర్ఎస్ ప్రభుత్వం మహిళల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందని తెలిపారు. గర్భిణీలు, బాలింతలకు పోషకాహార పంపిణీ చేయడంతో పాటు మెడికల్ కిట్లను అందిస్తుందన్నారు. మహిళలు ప్రభుత్వ ఆసుపత్రులు సాధారణ ప్రసవం జరిగేలా ప్రభుత్వ ఆస్పత్రుల్లో అన్ని ఆధునిక సౌకర్యాలు కల్పించడం జరిగిందని తెలిపారు. బెల్లంపల్లి నియోజకవర్గంలో అన్ని ఆధునిక సౌకర్యాలతో 100 పడకల ఆసుపత్రి నిర్మాణానికి కృషి చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పూసాల ప్రణయ్ కుమార్ , జెడ్పిటిసి బానయ్య రైతు సమన్వయ సమితి అధ్యక్షులు దత్తుదొర, ఎంపీటీసీలు సిరంగిశంకర్, రాజన్న, రజిత సర్పంచ్ నవీన్ కుమార్, డాక్టర్ కుమారస్వామి, సుచరిత, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ స్వరూప రాణి, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఏరియర్స్ ఇప్పించడంలో గుర్తింపు సంఘం విఫలం

కాసిపేట : సింగరేణి కార్మికులకు ఏరియల్స్ ఇప్పించడంలో గుర్తింపు సంఘం విఫలమైందని ఏఐటీయూసీ డిప్యూటీ సెక్రటరీ ముస్కె సమ్మయ్య పేర్కొన్నారు. మంగళవారం మందమర్రి ఏరియాలోని కాసిపేట గనిపై ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. సింగరేణి కార్మికులకు 11 వేజ్‌బోర్డు 23నెలల ఏరియర్స్ ఇప్పించడంలో గుర్తింపు సంఘం పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. కోల్ ఇండియా కార్మికులకు ఒకే దఫాలో గత నెల 3న చెల్లించారని, గతంలో 1 నుండి 10 వేజ్ బోర్డు వరకు మనమే సింగరేణి కార్మికుల మొదటి సారి తీసుకోవడం జరిగిందని తెలిపారు. కానీ ఈ సారి మనకు ఒకేసారి ఇవ్వకపోవడం వల్ల ఏఐటీయూసీ పోరాట కార్యక్రమాలు నిర్వహించుకొని గత నెల 18 నుంచి మైన్స్ పై ధర్నాలు చేసినట్లు గుర్తుచేశారు.ఈ ఆందోళన గ్రహించిన యాజమాన్యం రెండు దఫాల ఏరియర్స్ ఇస్తామని చెప్పడం జరిగిందని, అయినా మాకు ఒకే సారి ఇవ్వాలని ఏఐటీయూసీ జీఎం ఆఫీసు ముందు నిరాహార దీక్షలు చేసి ఉద్యమాన్ని ఉధృతం చేసిన సందర్భంలో ఏఐటీయూసీ నేత వాసిరెడ్డి సీతారామయ్య నాయకత్వంలో డైరెక్టర్ బలరాం నాయక్ ను కలిసి ఏరియర్స్ ఒకేసారి ఇవ్వాలని విజ్ఞప్తి చేయడం జరిగిందన్నారు. అందుకు యాజమాన్యం దిగొచ్చి నెల 21న ఏరియర్స్ చెల్లించుటకు ఒప్పందం జరిగిందన్నారు. కార్మికుల విజయాన్ని జీర్ణించుకొని టీబీజీకేఎస్ నాయకులు అబద్ధాలు చెప్పి కార్మికులను మోసం చేసే విధానం సరిగ్గా లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేష్, బ్రాంచ్ ఇంచార్జి చిప్ప నర్సయ్య, నాయకులు మీనుగు లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

అధికార వికేంద్రీకరణకు సబ్ డివిజన్ కార్యాలయం

దిలావర్‌పూర్ : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నూతన పంచాయతీ రాజ్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సబ్ డివిజన్ కార్యాలయాన్ని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిప్యూటీ సబ్ డివిజన్ ఇంజనీర్ తుకారాంను శాలువాతో సత్కరించి బాధ్యతలు అప్పగించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికార వికేంద్రీకరణ కొరకు దిలావర్‌పూర్, నర్సాపూర్, లోకేశ్వరం మూడు మండలాలకు అనుకూలంగా ఉండేందుకు ప్రభుత్వం ఈ కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దీంతో ప్రభుత్వ ఇంజనీరింగ్ అధికారులు అందుబాటులో ఉంటూ త్వరితగతిన పనులు పూర్తి చేసేందుకు వీలుంటుందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పంచాయతీరాజ్ శాఖ ఇంజనీరింగ్ వ్యవస్థ చాలా అద్భుతంగా అభివృద్ధి చెందిందని, అన్ని రకాలుగా లబ్ధి చేకూరేందుకు పంచాయతీ రాజ్ వ్యవస్థను వికేంద్రీకరించిన సీఎం కేసీఆర్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పాల్దె అక్షర అనిల్, బీఆర్ఎస్ పార్టీ కన్వీనర్ దేవేందర్‌రెడ్డి, నిర్మల్ ఎఫ్ఎస్సీఎస్ చైర్మన్ ధర్మాజీ రాజేందర్, నర్సాపూర్ (జి) నాయకులు, జడ్పీటిసి చిన్న రామయ్య, ఎంపీపీ కోంద్ర రేఖా రమేష్ , సర్పంచ్ రాంరెడ్డి, ఎఫ్ఎస్సీఎస్ చైర్మెన్ రమణారెడ్డి, న్యూలోలం సర్పంచ్ ఒడ్నం సవిత కృష్ణ, కాల్వ సర్పంచ్ తిరుమల శ్రీనివాస్, మాడేగాం సర్పంచ్ సుంకరి సరిత రాజు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వికలాంగులు, అంధులకు పెన్షన్లలో అన్యాయం



ఆదిలాబాద్‌టౌన్ : అధికారులు, వైద్యుల నిర్లక్ష్యంతో అర్హులైన వికలాంగులకు, అంధులకు పింఛను మంజూరులో తీవ్ర అన్యాయం జరుగుతోందని యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవికి వినతిపత్రం అందించారు. అనంతరం రూపేష్‌రెడ్డి మాట్లడుతూ ప్రభుత్వం వివిధ వర్గాల వారికి ఆసరా పెన్షన్‌లు అందిస్తుండగా రిమ్స్ వైద్యుల అలసత్వం కారణంగా అర్హులకు పింఛన్లు దక్కడం లేదని మండిపడ్డారు. వికలాంగులు,అంధులకు పెన్షన్ మంజూరు విషయంలో అర్హులైన వారికి అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. కళ్ళముందే వికలాంగత్వం కనిపిస్తున్నా వైద్యులు మాత్రం వివిధ కారణాలు చూపిస్తూ అర్హులను తిరస్కరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డబ్బులు ముట్ట చెప్పకపోతే రిజెక్ట్ చేస్తున్నారని ఆరోపించారు. వైద్యులు సర్టిఫికెట్ల జారీలో అవినీతి అక్రమాలకు పాల్పడుతూ పెన్షన్ రాకుండా చేస్తున్నారని వివరించారు. జిల్లాలో ముడుపులు అందిస్తే వికలాంగులు, అంధులు కాకున్నా అర్హత లేకపోయినా సర్టిఫికెట్ ఇచ్చే పరిస్థితిని తీసుకువస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా జనరల్ సెక్రటరీ ఎండి అఖిల్, యూత్ కాంగ్రెస్ బేల మండల అధ్యక్షుడు గోడే అవినాష్,ఉప సర్పంచ్ మల్లయ్య, యూత్ కాంగ్రెస్ బేల మండల్ వైస్ ప్రెసిడెంట్ విపిన్ టక్రే, యూత్ కాంగ్రెస్ బేల మండల్ ఎస్టీ సెల్ వైస్ ప్రెసిడెంట్ బాపురావు, విజయ్, సంజీవరెడ్డి, దశరథ్, ఉన్నారు.

కాంగ్రెస్ మండల కన్వీనర్లకు సన్మానం

నవతెలంగాణ-తాంసి

కాంగ్రెస్ పార్టీ తాంసి, భీంపూర్, తలమడుగు మండలాలకు కన్వీనర్లుగా నియామకమైన వారిని బోథ్ నియోజకవర్గ బాధ్యులు డాక్టర్ వన్నెల అశోక్ సత్కరించారు. మంగళవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో వివిధ మండల నాయకులతో కలిసి పూలమాల, శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నో సంవత్సరాలుగా పార్టీకి సేవలు అందించిన వారిని



గుర్తించి వారికి అధిష్టానం పదవులను ఇచ్చిందన్నారు. వచ్చే ఎన్నికల్లో సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి నాయకత్వంలో పార్టీని గెలుపు కోసం పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్లు సంతోష్, అశోక్, రాజేశ్వర్ నాయకులు రామన్న యాదవ్, రజావలి, హన్మండ్లు, బుజ్జన్న, సుదర్శన్, వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

దళిత కుటుంబానికి న్యాయం చేయాలి

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండలంలోని కోగ్దూర్ గ్రామానికి చెందిన నిసార్కర్ ప్రశాంత్‌కు న్యాయం చేయాలని అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షులు మనోహర్ అన్నారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రశాంత్‌కు చెందిన ఇంటి స్థలాన్ని కొందరు వ్యక్తులు కబ్జా చేశారని అన్నారు. ఆయన ఇంటి స్థలాన్ని అతనికే ఇవ్వాలని అన్నారు. కొందరు ఆయనపై దాడి చేసిన విషయాన్ని గుర్తు చేస్తు పోలీసులు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో దళిత సంఘం నాయకులు దత్త, క్రమాజ్, సత్యానంద్ పాల్గొన్నారు.



రెండో రోజుకు చేరిన అంగన్‌వాడీల సమ్మె

- జిల్లా వ్యాప్తంగా శిబిరాల వద్ద నిరసనలు



లక్ష్మణచాంద

నవతెలంగాణ-లక్ష్మణచాంద

తమ సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె మంగళవారం రెండో రోజుకు చేరుకుంది. సమ్మె శిబిరంలో నిరసన కార్యక్రమాలు చేపట్టి ప్రభుత్వ వైఖరిని ఎండగట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కనీస వేతనం అమలు చేసి, క్రమబద్దీకరించాలని డిమాండ్ చేశారు. ఉచిత ఆరోగ్యబీమా కల్పించి ఆదుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నిర్మల్ మండల ప్రధాన కార్యదర్శి లలిత, మండల అధ్యక్షురాలు వెంకట లక్ష్మీ కార్యదర్శి భాగ్యలక్ష్మీ, విజయ, వరలక్ష్మీ, పద్మ సునీత, రాజమణి పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి : రాష్ట్ర ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించే వరకు సమ్మెను కొనసాగిస్తామని అంగన్‌వాడీల సంఘం నాయకురాలు ఎన్.సుభద్ర అన్నారు. అంబేద్కర్ చౌరస్తా వద్ద నిర్వహిస్తున్న సమ్మె మంగళవారం రెండో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్న అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలన్నారు. ఐసీడీఎస్ ఉన్నతాదికారులు విధుల్లో చేరాలని, చేస్తున్న వేధింపులను మానుకోవాలని అన్నారు. ఈ సమ్మెలో అంగన్‌వాడీలు కమల, ఆత్రం నాగుబాయి, పెంటుబాయి, భగీరథ పాల్గొన్నారు.

బాసర : మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె మంగళవారం రెండో రోజుకు చేరుకుంది. న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించే వరకు పోరాటం చేస్తామని సీఐటీయూ మండల అధ్యక్షురాలు రాజియా అన్నారు. ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, నెలకు రూ.26 వేలు వేతనం చెల్లించాలని అన్నారు. సమ్మెలో అంగన్‌వాడీలు అనురాధ, లక్ష్మీ ప్రేమలత పాల్గొన్నారు.

తాంసి : గత రెండు రోజులుగా అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మెకు సీపీఐ, కాంగ్రెస్ నాయకులు సమ్మె శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీల న్యాయమైన సమ్యలను ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మెకు తమ సంపూర్ణమద్దతు ఉంటుందన్నారు. అంగన్‌వాడీలు చాలీచాలని వేతనాలతో ఉద్యోగాలు చేస్తున్నారని అన్నారు. కక్ష సాధింపు ధోరణిలో రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు పగలగొట్టడం సరికాదన్నారు. కప్పర్లకు పరామర్శకు వెళ్లి తిరిగి ప్రయాణంలో రోడ్డుపై అంగన్‌వాడీ టీచర్లు ఎమ్మెల్యేకు అడ్డుగా వెళ్లి వినతిపత్రం అందజేశారు. తమ డిమాండ్ల సాధనకు కృషి చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఆయన సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా తన వంతుగా సహకారం అందిస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్, సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి, నాయకులు దేవిదాస్, రమేష్, రతన్, కుంటాల రాములు, కాంగ్రెస్ నాయకులు డాక్టర్ వన్నెల అశోక్, సంతోష్, రామన్న, చిన్న రాంరెడ్డి, భోజన్న పాల్గొన్నారు.

తలమడుగు : అంగన్‌వాడీల సమస్యలను వెంటనే పరిష్కరించాలంటూ సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె మంగళవారం రెండో రోజు చేరుకుంది. నిత్యవసర ధరలకు అనుకూలంగా కనీస సౌకర్యాల కోసం వేతనాలు పెంచాలంటూ పలు డిమాండ్లతో ప్రభుత్వ కార్యాలయం ముందు నిరవధిక సమ్మె కొనసాగిస్తున్నారు. నిరవధిక సమ్మెలో మండల అంగన్‌వాడీ టీచర్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు పగులగొట్టిన అధికారులు...

మండల కేంద్రంలో అంగన్‌వాడీలు రెండు రోజుల నుంచి నిరవధిక సమ్మెలో పాల్గొనగా, మంగళవారం అంగన్‌వాడీ కేంద్రాలు మూతపడటంతో మంగళవారం ఎంపీడీఓ రమాకాంత్, ఐసీడీఎస్ సీడీపీఓ నర్సమ్మ పంచాయతీ కార్యదర్శులు గ్రామపంచాయతీ సిబ్బందితో అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు పగులగొట్టారు. గ్రామంలోని ఐకేపీ సిబ్బందితో, ఎస్‌హెచ్‌జీ గ్రూపులతో సెంటర్లను నడిపించేందుకు అధికారులు ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. మండలంలోని దాదాపు అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో తాళాలు పగలగొట్టి సేవలు అందించేందుకు అధికారులు తీవ్ర ప్రయత్నాలు సాగిస్తున్నారు.



తాంసి

తాళాలు పగలగొట్టిన వారిపై ఫిర్యాదు చేసిన అంగన్‌వాడీలు..

రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న అంగన్‌వాడీలు నిరవధిక సమ్మెలో పాల్గొనగా మండల కేంద్రంలో, వివిధ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు పగుల గొట్టిన వారిపై మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు అంగన్‌వాడీ టీచర్లు తెలిపారు.

ముధోల్ : అంగన్‌వాడీల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని అంగన్‌వాడీలు డిమాండ్ చేశారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె మంగళవారం రెండో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో సుమారు 70 వేల మంది అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని అన్నారు. లేని పక్షంలో ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామన్నారు. అంగన్‌వాడీ టీచర్లుగా పని చేస్తున్న వారిలో బడుగు బలహీన వర్గాలకు చెందిన వారే ఎక్కువ మంది ఉన్నారని అన్నారు. గత కొన్నేండ్లుగా ఐసీడీఎస్‌లో పనిచేస్తూ, పేద ప్రజలకు సేవలందిస్తున్నా, కనీస వేతనం, పెన్షన్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత, చట్టబద్ధ సౌకర్యాలేవి రాష్ట్ర ప్రభుత్వం నేటికి కల్పించలేదని అన్నారు. స్వయంగా సీఎం కేసీఆర్ అంగన్‌వాడీ వర్కర్ పేరును టీచర్స్‌గా మార్చారని, కానీ టీచర్లతో సమానంగా వేతనాలు, ఇతర సౌకర్యాలు మాత్రం ప్రభుత్వం ఇవ్వడం లేదని గుర్తుచేశారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసినట్లే తమను కూడా పర్మినెంట్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు వనిత, సంగీత, దేవేంద్ర, రజియా, సురేఖ, రేఖ పాల్గొన్నారు.



తలమడుగు

వైద్యరంగానికి పెద్దపీట

- ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

నవతెలంగాణ-ముధోల్

తెలంగాణ ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తోందని ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. మంగళవారం నియోజకవర్గ కేంద్రంలో రూ.20 లక్షలతో నూతనంగా నిర్మించనున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి నాణ్యమైన ప్రభుత్వ వైద్యం అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో సీఎం కేసీఆర్ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. త్వరలో బోరిగాం గ్రామానికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి భవనం మంజూరు కానున్నట్టు తెలిపారు. ప్రజలు ప్రభుత్వ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు అఫ్రోజ్ ఖాన్, మాజీ పీఏసీఎస్ చైర్మెన్ సురేందర్‌రెడ్డి, వైద్యాధికారి ఆకాష్, సర్పంచ్ రాజేందర్, మండల కో ఆప్షన్ సభ్యులు సయ్యద్ ఖాలీద్, ఎంపీటీసీలు సరళ శ్రీనివాస్‌గౌడ్, భూమేష్, నాయకులు రమేష్, ఎర్రం మురళి, కిష్టయ్య, బషీర్ పాల్గొన్నారు.

పురుగులమందుతాగి వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-తలమడుగు

పురుగులమందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం మండలకేంద్రంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన అరిగెల సంతోష్(46) రైతు మంగళవారం పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు సంతోష్ గత రెండు సంవత్సరాల నుంచి మూర్ఛవ్యాధితో బాధపడుతుండేవాడు. జిల్లా కేంద్రంలోని రిమ్స్‌లో వైద్యం కోసం ఈ నెల 9న చేరగా 12న డిశ్చార్జ్ చేసినట్లు తెలిపారు. రిమ్స్ నుంచి ఇంటికి రాగానే కొద్దిసేపటికి గ్రామ సమీపంలోని సురేష్‌రెడ్డి చేనులో పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. భార్య అరిగేల రమ ఫిర్యాదు మేరకు ఎస్సై ధనశ్రీ కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

బంజారా భవన్ నిర్మాణానికి రూ.2 కోట్ల మంజూరు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ పట్టణంలో బంజారా భవన్ నిర్మాణానికి గానూ రూ.2 కోట్ల నిధులను మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం పట్ల బంజారా సమాజ్ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భాగంగా సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే జోగు రామన్నల ఫ్లెక్సీకి పాలాభిషేకం చేసి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ పవన్ నాయక్ మాట్లాడుతూ బంజారా భవన్ నిర్మాణానికి రెండు కోట్ల నిధులను కేటాయించడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. నిధుల మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే జోగు రామన్నకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. బంజారా భవన్ నిర్మాణం కోసం ఎమ్మెల్యే విశేషంగా కృషి చేశారని అన్నారు. కార్యక్రమంలో సురేష్ నాయక్, బంజారా సమాజ్, బలిరామ్ జాదవ్, కృష్ణ జాదవ్, విశాల్, శ్యామ్, రాథోడ్ ప్రకాష్, సతీష్ ఆడే పాల్గొన్నారు.

వైద్య రంగంలో దేశానికి తెలంగాణ దిక్సూచి

- పీహెచ్‌సీల నుంచి సూపర్ స్పెషాలిటీ వరకు బలోపేతం
- ఆరోగ్య మహిళ కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి



నవతెలంగాణ-లక్షణచాంద

వైద్య రంగంలో దేశానికి తెలంగాణ దిక్సూచిలా మారిందని, ప్రభుత్వ ఆస్పత్రుల్లో కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందిస్తున్నామని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఆరోగ్య మహిళ కేంద్రాన్ని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ మంగళవారం మహిళలకు ఆరోగ్య మహిళ కేంద్రాల్లో 8 రకాల ఉచిత పరీక్షలు చేసి వైద్యం అందిస్తారని వెల్లడించారు. మహిళల కోసం ప్రత్యేక హెల్ప్ డెస్క్, ప్రత్యేక వార్డు ఉంటుందని వివరించారు. గ్రామీణ ప్రాంతంలోని నిరుపేదలు వైద్య పరీక్షలు చేయించుకోలేని స్థితిలో ఉన్న మహిళలు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఆడబిడ్డల ఆరోగ్యమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య మహిళ పథకానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఆరోగ్య మహిళ ద్వారా ఏర్పాటు చేసిన దవాఖానల్లో అటెండర్ నుంచి డాక్టర్ వరకు అందరూ మహిళలే ఉంటారని, నిర్భయంగా వెళ్లి తమ ఆరోగ్య సమస్యలు చెప్పుకోవచ్చని సూచించారు. అదే విధంగా పేదలకు స్పెషాలిటీ సేవలు అందించడంతో పాటు, డాక్టర్ కావాలనుకునే విద్యార్థుల కలను సాకారం చేసేందుకు సీఎం కేసీఆర్ జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ ఏర్పాటు చేశారని అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పాటు జిల్లా దవఖానాల్లో వైద్యులు, సిబ్బంది కొరత ఉండేదని, కనీస వసతులు, మందులు కూడా అందుబాటులో ఉండేవి కావన్నారు. అనేక చోట్ల నర్సులు, కాంపౌండర్లే వైద్యం అందించిన దుస్థితి ఉండేదన్నారు. కానీ తొమ్మిదేండ్లలో ప్రభుత్వ ఆస్పత్రుల రూపురేఖలు పూర్తిగా మారిపోయాయని తెలిపారు. సీఎం కేసీఆర్ మార్గనిర్దేశనంలో అమలు చేస్తున్న విప్లవాత్మక పథకాలు, వినూత్న కార్యక్రమాలు, మానవీయ పథకాలు ప్రజావైద్యంపై ప్రజల్లో నమ్మకాన్ని పెంచాయని అన్నారు. క్షేత్రస్థాయిలో బస్తీ దవాఖానాలు, సబ్‌సెంటర్లు, పీహెచ్‌సీల్లో ఉత్తమ వైద్య సేవలు అందుతున్నాయని తెలిపారు. జిల్లాకో మెడికల్ కాలేజీ ఏర్పాటుతో కార్పొరేట్ హాస్పిటల్స్‌కు దీటుగా సూపర్ స్పెషాలిటీ సేవలు అందుబాటులోకి వస్తున్నాయని తెలియజేశారు. ఒక్క రూపాయి ఖర్చు కాకుండా ప్రజలకు అత్యాధునిక సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు అందుతున్నాయని వివరించారు. అంతకుముందు హరితహారం కార్యక్రమంలో భాగంగా ఆస్పత్రి ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వరుణ్‌రెడ్డి, డీఎంహెచ్‌ఓ ధన్‌రాజ్, ఎంపీపీ అడ్వాల పద్మ రమేష్, జెడ్పీటీసీ ఓస రాజేశ్వర్, వైద్యధికారి శ్రీకాంత్, మండలం బీఆర్ఎస్ ఇన్‌చార్జి అల్లోల సురేందర్ రెడ్డి, మండల కన్వీనర్ కృష్ణారెడ్డి, నాయకులు ధర్మాజీ రాజేందర్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ యువకుల చేరిక



నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని గంగాపూర్ గ్రామానికి చెందిన యువకులు బీఆర్ఎస్‌లో చేరారు. బీఆర్ఎస్ ఖానాపూర్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్ నాయక్ సమక్షంలో మంగళశారం వారు గులాబి కండువా కప్పుకున్నారు. పార్టీ బలోపేతంతో పాటు ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో తీసుకెళ్లాలని యువకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు జవ్వాద్ అన్సారీ, ఎస్సీసెల్ మండల అధ్యక్షులు కొల్లూర్ స్వామి, అంబేద్కర్ అసోసియేషన్ మండల ఉపాధ్యక్షులు కాంబ్లే ప్రజ్ఞశీల్, యువకులు హకీమ్, చరణ్, రాజన్న, రాజు, లక్ష్మణ్, రాఘవులు, రాజశేఖర్, శ్యామ్, సుభస్ ఉన్నారు.

మహిళల ఆరోగ్య సంరక్షణపై ప్రభుత్వం దృష్టి

- ఆరోగ్య క్లినిక్‌ను ప్రారంభించిన చైర్మెన్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మహిళల ఆరోగ్య సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, అందుకు అనుగుణంగానే వారి కోసం ప్రత్యేకంగా ఆరోగ్య మహిళా క్లినిక్‌లను ఏర్పాటు చేసి నాణ్యమైన వైద్య సేవలందిస్తోందని మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్ అన్నారు. పట్టణంలోని పుత్లిబౌలి పట్టణ ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన మహిళా ఆరోగ్య క్లినిక్‌ను వైద్యాధికారులతో కలిసి ప్రారంభించారు. ప్రతి మంగళవారం కేవలం మహిళలకు మాత్రమే ఆరోగ్య మహిళా క్లినిక్‌ల ద్వారా వైద్యం అందించనున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మెన్ మాట్లాడుతూ మహిళలు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలన్న ఉద్యేశంతో వారికి నాణ్యమైన వైద్యం అందించేందుకు వీలుగా ఆరోగ్య మహిళా క్లినిక్‌లను ప్రభుత్వం ప్రారంభించిందని అన్నారు. నిరుపేదలకు సర్కారు దవాఖానాల్లో అత్యుత్తమ వైద్యసేవలు అందుతున్నాయని పేర్కొన్నారు. ప్రతి మంగళవారం కేవలం మహిళలకు మాత్రమే వైద్యసేవలు అందేలా ఏర్పాట్లు చేశారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆరోగ్య మహిళ క్లినిక్‌ల గురించి క్షేత్రస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో అదనపు డీఎంహెచ్‌ఓ డాక్టర్ సాధన, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ శ్రీధర్, వైద్యులు అశఫియా మునీర్, దీపిక, అన్నపూర్ణ, ఆశా వర్కర్‌లు పాల్గొన్నారు.

వీఓఏలకు అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు అప్పగింత

నవతెలంగాణ-బాసర

మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల తాళాలను మంగళవారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరోజినీ పంచాయతీ సిబ్బందితో కలిసి అంగన్‌వాడీ కేంద్రాలను తాళాలను పగలగొట్టి కేంద్రాలను వీఓఏలకు అప్పగించారు. గర్భిణీ, చిన్నారులకు ఇబ్బందులు తలెత్తకుండా పౌష్టికాహారం అందాలనే ఉద్యేశంతో జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వీఓఏలకు అప్పగించడం జరిగిందన్నారు. కాగా అటూ సమ్మెలో ఉన్న అంగన్‌వాడీలు మాత్రం అధికారుల తీరుపై మండిపడుతున్నారు.

ఎస్ఎస్ఏ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

- సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్



నవతెలంగాణ-నిర్మల్

విద్యాశాఖలోని సమగ్ర శిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ అన్నారు. మంగళవారం వారి నిరవధిక దీక్షకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఉద్యోగులకు మినిమం టైం స్కేల్ అమలు చేయాలని అన్నారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల డిమాండ్లు న్యాయమైనవేనని, సీఎం కేసీఆర్ డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. మెప్మా, సెర్ప్, ఆర్టీసీ, జూనియర్ లెక్చరర్స్, జూనియర్ పంచాయతీ కార్యదర్శులు, వీఆర్ఏలను ఏ విధంగా రెగ్యులర్ చేశారో, అదేవిధంగా సమగ్ర శిక్షలో పనిచేస్తున్నటువంటి ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని అన్నారు.

అలాగే విధి నిర్వహణలో మృతి చెందిన ఉద్యోగులకు జీవితబీమా రూ.10లక్షలు, ఆరోగ్యబీమా రూ.5లక్షల సౌకర్యం కల్పించాలని పేర్కొన్నారు. సమగ్ర శిక్షలో పనిచేస్తున్న మహిళ ఉద్యోగులందరికీ 180 రోజుల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి వంగురు రాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్, గంగాధర్, భోజన్న, గజేందర్, రాము పాల్గొన్నారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-కుభీర్

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని న్యూసాంగ్వీ గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..మృతుడు కిర్ల సాయినాథ్(47) మంగళవారం పొలానికి పురుగులమందు పిచికారి చేసేందుకు వెళ్లాడు. ఎంతసేపటికి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పొలానికి వెళ్లి చూశారు. అక్కడ చెట్టుకు ఉరేసుకొని కనిపించాడు. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. అక్కడి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం భైంసా ఆస్పత్రికి తరలించారు. భార్య త్రివేణి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై ఎండీ షరీఫ్ తెలిపారు.

అభివృద్ధి చూసి ప్రభుత్వాన్ని ఆదరించాలి

- బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు

నవతెలంగాణ-తాంసి

అభివృద్ధి చేసిన ప్రభుత్వాన్ని ఆదరించాలని బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. మంగళవారం మండలం కేంద్రంలో పంచాయతీరాజ్ సబ్ డివిజన్ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం కల్యాణలక్ష్మీ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం గత 10 సంవత్సరాల ఎలా ఉండేది, ఇప్పుడు ఎలా ఉందో ప్రజలు గమనించాలని అన్నారు. కల్యాణలక్ష్మీ పథకం ద్వారా పేద ఆడపిల్ల పెండ్లిలు భారం కావద్దనే ఆర్థిక సాయం అందిస్తున్నారని తెలిపారు. నియోజకవర్గంలో మారుమూల గిరిజన గ్రామాలకు రూ.100 కోట్ల ఐటీడీఏ నిధులతో రోడ్డు సౌకర్యం కల్పించడం, ఆర్ అండ్ బీ, పంచాయతీ రాజ్ నిధులతో రోడ్డు సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. దళితబస్తీ పథకంలో నిరుపేద దళిత కుటుంబాలకు 2660 ఎకరాలు పంపిణీ చేశామన్నారు. వచ్చే ఎన్నికల్లో ఇతర పార్టీల మాటలు నమ్మకుండా కేసీఆర్ ప్రభుత్వానికి అండగా నిలబడాలని కోరారు. అనంతరం కప్పర్ల గ్రామానికి చెందిన పార్టీ కార్యకర్త తల్లి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మీ, ఎంపీడీఓ భూమయ్య, జెడ్పీటీసీ రాజు, ఎంపీపీ మంజుల శ్రీధర్‌రెడ్డి, కన్వీనర్ అరుణ్, పంచాయతీరాజ్ డీఈ శివరాం పాల్గొన్నారు.



కొనసాగుతున్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమ్మె



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

నేషనల్ హెల్త్ మిషన్ పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం సమ్మె తొమ్మిదో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా యూపీహెచ్‌సీ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్ దేశ్ పాండే మాట్లాడుతూ ప్రభుత్వ పీఆర్సీ ప్రకారం కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. గత వారం రోజుల నుంచి సమ్మె చేపడుతున్న ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. ఉద్యోగులందరికి వారి క్యాడర్ ప్రకారం వైద్యారోగ్య శాఖలోని పర్మినెంట్ ఉద్యోగుల బేసిక్ అలవెన్సులు నిర్ణయించాలని అన్నారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని లేనిపక్షంలో సమ్మె ఉధృతం చేస్తామని అన్నారు. 510జీఓ అమలు కానీ కెడర్లకు బేసిక్ హెచ్‌ఆర్‌ఏ, డీఏ అన్ని కలిపి ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో ఉద్యోగులు ఉన్నారు.

16న బూత్ కార్యకర్తల సమ్మేళనం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఈ నెల 16న బూత్ కార్యకర్తల సమ్మేళనాన్ని నిర్వహించనున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమ్మేళనానికి ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్‌తో పాటు, బీజేపీ చేరికల కమిటీ చైర్మన్ హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ హాజరుకానున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రానున్నదని ఈ సమయంలో కార్యకర్తలంతా సమైక్యం కావాలన్నారు. జిల్లాలోని కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆత్మారాం నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి షేర్ల మురళీధర్, జిల్లా ఉపాధ్యక్షులు బానోత్ వెంకట్ నాయక్, ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు జయరాజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి సూర్య ప్రకాష్, వివిధ మండలాల నాయకులు శ్రీధర్, వేణుగోపాల్, రాథోడ్ రమేష్, శివాజీ, గుండు, రంగు శ్రీకాంత్, సప్త శ్రీనివాస్, రవీందర్ పాల్గొన్నారు.

ఆరోగ్య మహిళా కేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-పెంచికల్‌పేట్



మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఆరోగ్య మహిళా కేంద్రాన్ని ఎలుకపెల్లి సర్పంచ్ గణపురం కావ్య మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎం అండ్ హెచ్ఓ సీతారాం నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వం మహిళల ఆరోగ్య పరిరక్షణకు ప్రతి ప్రాథమిక కేంద్రంలో మహిళా ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటుచేసి ప్రతి మంగళవారం మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి వివిధ ఆస్పత్రులకు రెఫర్ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో లోడ్‌పెల్లి సర్పంచ్ శ్రీనివాస్, ఎంపీటీసీ దూగుంట రాజన్న, ఎలుకపెల్లి ఉప సర్పంచ్ రమేష్, హెచ్‌డబ్ల్యుసీ ప్రోగ్రాం ఆఫీసర్ అజీమ్, వైద్యాధికారి నేహా తస్లీమా, హెచ్ఈఓ కోటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

వైద్య కళాశాల పెండింగ్ పనులు పూర్తి చేయాలి

- ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కాడే హేమంత్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలో నిర్మిస్తున్న వైద్య కళాశాల పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆసిఫాబాద్ కలెక్టర్ బోర్కడ హేమంత్ అన్నారు. ఎమ్మెల్యే ఆత్రం సక్కుతో కలిసి మంగళవారం వైద్య కళాశాల పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ నాగార్జున చారిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల అవసరాలకు అనుగుణంగా వైద్యులు, సిబ్బంది సంఖ్యను పెంచి మరింత వేగంగా వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన వైద్య కళాశాలల ఏర్పాటులో భాగంగా జిల్లా కేంద్రంలోని అంకుసాపూర్‌లో నిర్మిస్తున్న వైద్య కళాశాల భవనాన్ని ప్రారంభించేందుకు పూర్తిస్థాయి ఏర్పాట్లతో సిద్ధం చేయాలని అన్నారు. త్వరలో రాష్ట్ర ముఖ్యమంత్రి చే వర్చువల్ విధానం ద్వారా వైద్య కళాశాలలు ప్రారంభించనున్న నేపథ్యంలో జిల్లాలోని వైద్య కళాశాలను అన్ని ఏర్పాట్లతో సిద్ధం చేయాలని సంబంధిత ఇంజనీరింగ్, వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ జడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావు, ఎంపీపీ మల్లికార్జున్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎడ్ల బండిని ఢీకొని ద్విచక్ర వాహనదారుడి మృతి

నవతెలంగాణ-దహెగాం

ఎడ్ల బండిని ఢీకొని ద్విచక్ర వాహన దారుడు అక్కడికక్కడే మృతి చెందిన విషాదకర ఘటన మంగళవారం రాత్రి దహెగాం మండల కేంద్రంలోని శివారులో చోటుచేసుకుంది. ఎస్సై సనత్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. బెజ్జూర్ మండలం సలుగుపల్లి గ్రామానికి చెందిన భార్య భర్తలు దుర్గం బక్కయ్య, పోషక్కలు తమ కూతురు డెలివరీ కోసం మంచిర్యాల ఆస్పత్రికి వెళ్లిందని తెలిసి చూడడానికి ఇంటికి వచ్చారు. ఎక్సెల్ ద్విచక్రవాహనంపై వెళ్లడం ఇబ్బంది అవుతుందని కమ్మర్ పెల్లిలో బంధువుల ఇంట్లో ఉండి ఉదయాన్నే వెల్దామని అనుకుని దహెగాం కల్వాడా ప్రధాన రోడ్డులోని కమ్మరపల్లి మూలమలుపు వద్ద తిరిగి వెళ్లే క్రమంలో ఎదురుగా వస్తున్న మండల కేంద్రానికి చెందిన దాసరి కిషన్ ఎడ్ల బండికి ఎదురుగా ఢీకొన్నారు. దీంతో నాగలి గుచ్చు కుని దుర్గం బక్కయ్య(50) అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య పోషక్కకు స్వల్పంగా గాయాలయ్యాయి. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు

మృతుని కుటుంబానికి చేయూత

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మండలంలోని గుండి గ్రామానికి చెందిన గాండ్ల తెలి కులస్తుడు ఉదయ్ కిరణ్ కరెంటు షాక్‌తో మృతి చెందాడు. బాధిత కుటుంబానికి అఖిల గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో క్వింటాళ్ల బియ్యం, 15 లీటర్ల నూనెతో పాటు వంట సామాగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర యువజన అధ్యక్షులు హిద్రే సందీప్, ఆసిఫాబాద్ గ్రామ కమిటీ అధ్యక్షులు కవల్కర్ బాబురావు, ఉపాధ్యక్షులు బావునే బాబురావు, కమిటీ సభ్యులు కవల్కర్ సురేష్, కవల్కర్ వినేశ్ పాల్గొన్నారు.

నియోజకవర్గంలో రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

నియోజకవర్గంలోని గిరిజన గ్రామాల్లో రోడ్ల నిర్మాణానికి రూ. 12.55 కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే ఆత్రం సక్కు తెలిపారు. ఆసిఫాబాద్ మండలం మోతుగుడా నుండి అప్పపెల్లి వరకు, జైనూర్ మండలం ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి ఉయికగూడ వరకు, కొండపటార్ వరకు, సిర్పూర్(యూ) మండలం రాజులగూడ చాప్రి వరకు, పీఆర్ రోడ్డు నుంచి తాటిగూడ వరకు, జడ్పీ రోడ్డు నుంచి చిలుకగూడ వరకు, వాంకిడి మండలం పీఆర్ రోడ్డు నుంచి పాత దుబ్బగూడ వరకు, ఆసిఫాబాద్ మండలం ఇదులవాడ నుంచి సింగరావుపేట వరకు, పర్సనంబల నుంచి పాతరౌట వరకు, గాదిగూడ మండలం పిప్రి నుంచి అందుగూడ వరకు, ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి మారుగూడ వరకు, నార్నూర్ మండలం పీఆర్ రోడ్డు నుంచి ధనుగూడ వరకు బీటీ రోడ్ల నిర్మాణం చేయనున్నట్లు తెలిపారు. నిర్మాణం కోసం ప్రత్యేకంగా నిధులు విడుదల చేసిన ముఖ్యమంత్రి కేసీఆర్, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

రైల్వే ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

కాగజ్‌నగర్‌కు రావాల్సిన రోజువారి ట్రైన్లు రద్దయి బెల్లంపల్లి వరకు నడుస్తున్న నేపథ్యంలో ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ శ్రీధర్ తెలిపారు. హైదరాబాద్ వెళ్లే ప్రయాణికుల కోసం కాగజ్‌నగర్ కేంద్రం నుండి ఉదయం 7గంటలకు(మియాపూర్), 9, 11 గంటలకు, తిరిగి రాత్రి9 గంటలకు(మియాపూర్), 9.30కు, 10గంటలకు, 10.30కు హైటెక్ బస్సులు ఉంటాయన్నారు. ఆసిఫాబాద్ నుండి ఉదయం 4గంటలకు(మియాపూర్),8 గంటలకు, 12 గంటలకు, సాయంత్రం 7గంటలకు, 8 గంటలకు, 8.45కు(మియాపూర్) 11 గంటలకు బస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే భాగ్యనగర్ రైలుకు వెళ్లే వారి సౌకర్యార్థం ఉదయం 2.15కు ఆసిఫాబాద్ నుండి బస్సు బయలుదేరుతుందని, అలాగే తిరుగు ప్రయాణంలో భాగ్యనగర్ లింకు బస్సు బెల్లంపల్లి నుండి ఉంటుందని తెలిపారు. ఇంటర్సిటీ ట్రైన్ కోసం కూడా బెల్లంపల్లి వరకు ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేశామని, ప్రయాణికులు ఈ సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కేటీఆర్‌ను కలిసిన బీఆర్ఎస్ అభ్యర్థిని

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆసిఫాబాద్ నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థిని, జడ్పీ చైర్పర్సన్ కోవ లక్ష్మి మంగళవారం పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తనకు పార్టీ అభ్యర్థిగా అవకాశం ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి మరింత కృషి చేస్తానని తెలిపారు.

అంగన్‌వాడీల డిమాండ్లను పరిష్కరించాలి

- సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓదెలు

నవతెలంగాణ-రెబ్బెన

సుమారు 70 వేల మంది అంగన్‌వాడీ ఉద్యోగులు, ఆయాలు న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని సింగరేణి కాంట్రాక్ కార్మిక సంఘం(సీఐటీయూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏ.ఓదేలు అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ ఉద్యోగుల శిబిరాన్ని సందర్శించి వారికి సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ ఉద్యోగులను వెంటనే పర్మినెంట్ చేసి కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యూటీ, రిటైర్మెంట్ బెన్‌ఫిట్స్, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఐసీడీఎస్ మంత్రి సత్యవతి రాథోడ్ ఇచ్చిన మాట నిలబెట్టుకోనందువల్లనే తప్పనిసరి పరిస్థితుల్లో అంగన్‌వాడీ ఉద్యోగులు సమ్మె చేస్తున్నారని, ఈ సమ్మెకు పూర్తి బాధ్యత ప్రభుత్వమే వహించాలన్నారు. సమ్మెను నివారించి సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. అలా కాకుండా



సిర్పూర్(టి) లో..

ప్రభుత్వం కవ్వింపు చర్యలకు, కక్ష్యసాధింపు చర్యలకు పాల్పడవద్దన్నారు. సమ్మె మరింత ఉధృతం కాకుండా ఉద్యోగ సంఘాలతో చర్చలు జరపాలని, ప్రభుత్వం పట్టుదల విడనాడాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల నాయకులు సిద్ధెంకి సత్తయ్య, ప్రాజెక్టు కార్యదర్శి రాజేశ్వరి, బాలమ్మ, చంద్రకళ, స్వర్ణలత, మంజుల, సుశీల, శ్యామలక్ష్మి, సంధ్య, భారతి పాల్గొన్నారు.



దహెగాంలో..

దహెగాం : మండలకేంద్రంలోని స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరవధిక సమ్మెకు దిగిన అంగన్‌వాడీలు రెండో రోజు మంగళవారం కూడా సమ్మెను కొనసాగించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్(సీఐటీయూ) జిల్లా కమిటీ సభ్యురాలు వజ్రమ్మ మాట్లాడుతూ పలు న్యాయపరమైన డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చే వరకు సమ్మెను కొనసాగిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు జయ, పద్మ, ఈశ్వరి, రూప, రాజేశ్వరి పాల్గొన్నారు.

సిర్పూర్(టి) : తమ సమస్యలు పరిష్కరించే వరకు నిరవధిక సమ్మె కొనసాగుతుందని అంగన్‌వాడీ టీచర్లు అన్నారు. తమ సమస్యలు పరిష్కరించక పోగా ప్రభుత్వం ఇతర స్కీంలలో పనిచేస్తున్న వారిని నియమించి అంగన్‌వాడీ కేంద్రాలు తెరిపించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఉమా, అర్చన, విమల, జ్యోతి పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి

- నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇవ్వాలి
- డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తిక్
- డీవైఎఫ్ఐ మండల మొదటి మహాసభలు, నూతన కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-రెబ్బెన

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తిక్, జిల్లా సహాయ కర్యదర్శి దుర్గం రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం మండలకేంద్రంలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాలలో డీవైఎఫ్ఐ మొదటి మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డీవైఎఫ్ఐ నిరుద్యోగ సమస్యపై, విద్య, ఉద్యోగ ఉపాధి, వైద్యం, రోడ్లు, రవాణా, తాగునీటి సమస్యల కోసం అనేక పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. దేశంలో రోజురోజుకు నిరుద్యోగం పెరుగుతూ పోతుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వడంలో పూర్తిగా విఫలమయ్యాయన్నారు. అంతేకాకుండా మండలంలోని ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని, ముఖ్యంగా మారుమూల గ్రామాలకు రోడ్డు సౌకర్యం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు రోడ్డు సౌకర్యం కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యారన్నారు. భవిష్యత్తులో రోడ్డు, తాగునీటి సమస్యపై పోరాటాలు నిర్వహిస్తామని మహాసభలో తీర్మానించారు. అనంతరం 12 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. డీవైఎఫ్ఐ మండల అధ్యక్షుడిగా జాడి శ్యాం, ఉపాధ్యక్షులుగా చల్లూరి వంశీ, కార్తీక్, స్రావణి, డీవైఎఫ్ఐ మండల కార్యదర్శి ఆత్మాకూరి సతీష్, సహాయ కార్యదర్శులుగా చాపిడి పురుషోత్తం, చాపిడి శివ, తిరుపతి, డీవైఎఫ్ఐ మండల కమిటీ సభ్యులు మహేష్, శ్రీను, కృష్ణ, నీలేష్‌ను ఎన్నుకున్నారు.



ప్రజలకు మౌలిక వసతులు కల్పించాలి

ఆసిఫాబాద్ : ప్రజలకు ప్రభుత్వాలు మౌలిక వసతులు కల్పించాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్ డిమాండ్ చేశారు. తిర్యని మండలం ఉల్లి పిట్ట గ్రామంలో జిల్లా మహాసభల సందర్భంగా 'ఇంటింటికి డీవైఎఫ్ఐ' పేరుతో మాస్ క్యాంపియన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యాయన్నారు. కేంద్ర ప్రభుత్వం రెండు కోట్ల ఉద్యోగాలు, రాష్ట్ర ప్రభుత్వం ఒక లక్ష ఉద్యోగాలు ఇస్తామని నిరుద్యోగులకు అన్యాయం చేశారన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలలో అనేక ఉద్యోగాలు ఖాళీలు ఉన్నాయని వాటిని గుర్తు చేయడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయన్నారు. విద్య, వైద్యం, తాగునీటి సౌకర్యం, రోడ్డు సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రజలకు ప్రభుత్వాలు సౌకర్యాలు కల్పించాలని లేనిపక్షంలో ఉద్యమాలు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శిలు దుర్గం రాజ్ కుమార్, టికానంద్, తిర్యానీ మండల అధ్యక్షుడు తాళ్ల పెల్లి రాజేశ్వర్, మండల ఉపాధ్యక్షుడు పార్తు, నాయకులు పవన్, పాల్గొన్నారు.

హాస్టల్ వర్కర్స్ పెండింగ్ వేతనాలు చెల్లించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

బీసీ హాస్టల్లలో విధులు నిర్వహిస్తున్న ఔట్‌సోర్సింగ్ వర్కర్స్‌కు పెండింగ్‌లో ఉన్న 12 నెలల వేతనాలను, ఎస్సీ వర్కర్స్‌కి 4 నెలల వేతనాలను తక్షణమే చెల్లించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకుడు బ్రహ్మానందం డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేసి అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అనేక సంవత్సరాలుగా విద్యార్థుల బాగోగుల కొరకు విధులు నిర్వహిస్తున్న వాచ్మెన్, కుక్, కామాటీ, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు 12 నెలలు వేతనాలు చెల్లించకపోవడం వల్ల వర్కర్స్ కుటుంబాలు ఆర్థికంగా తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. దేశంలోనే నెంబర్ వన్ రాష్ట్రం తెలంగాణని ముఖ్యమంత్రి కేసీఆర్ చెబుతారని అటువంటి రాష్ట్రంలో హాస్టల్‌లో విధులు నిర్వహిస్తున్న ఔట్‌సోర్సింగ్, వర్కర్స్‌కు వేతనాలు చెల్లించడానికి డబ్బులు లేని దౌర్భాగ్య స్థితిలో ఉందన్నారు. హాస్టల్ వర్కర్స్‌కు తక్షణమే 12 నెలల వేతనాలు చెల్లించకపోతే భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జగజంపుల తిరుపతి, బీసీ హాస్టల్ వర్కర్స్ లక్ష్మీ, శారద, ప్రవీణ్, తిరుపతి, పార్వతి, ఎస్సీ హాస్టల్ వర్కర్స్ సత్యశ్రీ, సంగీత, కవిత, పుష్ప లత, సలీం పాల్గొన్నారు.

స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

2వ ఓటర్ జాబితా సంక్షిప్త సవరణ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో చేపట్టిన ఓటరు జాబితా సవరణలో స్వచ్ఛంద సంఘాలు, మహిళా స్వయం సహాయక సంఘాలు భాగస్వామ్యులై స్పష్టమైన జాబితా రూపొందించడంలో తమ వంతు బాధ్యత నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. మంగళవారం ఎస్ఎస్ఆర్ 2023లో భాగంగా ఓటరు జాబితా సవరణ కార్యక్రమం పకడ్బందీగా చేపట్టి తప్పులు లేని ఓటరు జాబితా రూపొందించడంపై ఆర్డీఓలు రాజేశ్వర్, సురేష్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్‌తో కలిసి జిల్లా సమాఖ్య సభ్యులు, మండల మహిళా సమాఖ్య సభ్యులు, ఐకేపీ సిబ్బందితో సమీక్ష



సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితా సంక్షిప్త సవరణ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ఈ నెల 19వ తేదీ వరకు కొనసాగుతున్న నూతన ఓటరు నమోదు, ఓటరు జాబితా సవరణలపై స్వచ్ఛంద సంఘాల బృందాలు, మహిళ సమాఖ్య సంఘాల సభ్యులు తమ పరిధిలో ఇంటింటికి తిరిగి 18 సంవత్సరాలు నిండిన వారు ఓటరు జాబితాలు వివరాలు నమోదు చేసుకునే విధంగా అవగాహన కల్పించాలని, మహిళా ఓటర్ల సంఖ్య పెంచేందుకు సహకరించాలని తెలిపారు. జిల్లాలోని ఆదివాసి గ్రామాలు, పీవీటీజీ, దివ్యాంగులలో అర్హులైన వారందరినీ ఓటరు జాబితాలో చేర్చే విధంగా సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించాలని, జనాభా నిష్పత్తి ప్రకారం ఓటర్ల సంఖ్య పెంచే విధంగా కృషి చేయాలని తెలిపారు. స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించడంలో బూత్ స్థాయి అధికారులకు సహకరించాలని తెలిపారు. ఈ సమీక్షలో తహసీల్దార్ రమేష్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదులపై సత్వరమే స్పందించాలి

- ఆసిఫాబాద్ ఎస్పీ సురేష్‌కుమార్



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

పోలీస్‌స్టేషన్‌లలో స్వీకరించిన ఫిర్యాదులపై సత్వరమే స్పందించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని ఆసిఫాబాద్ ఎస్పీ సురేష్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ రికార్డులను, రిసెప్షన్, లాకప్, మెన్‌ద్వారక్, టెక్నికల్ గది, పరిసరాలను పరిశీలించారు. పోలీస్‌స్టేషన్ సిబ్బందితో మాట్లాడి వారి విధులకు సంబంధించిన సూచనలు చేసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పెంచికల్‌పేట్ ఎస్సై కొమురయ్యకు పోలీస్‌స్టేషన్ ఆవరణలో తిరుగుతూ పలు సూచనలు చేశారు. పోలీసులు ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండాలని, ఆర్థిక నేరాలను కట్టడి చేయడానికి కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా సీసీ కెమెరాలు అమర్చేల ప్రజలను చైతన్య పరచాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలని ఎస్సైకి సూచించారు. ఆయన వెంట డీఎస్పీ కరుణాకర్ ఉన్నారు.

బీజేపీ మనువాదంపై దళితులు ఉద్యమించాలి

- కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

దేశ ప్రజలపై బీజేపీ రుద్దుతున్న మను విధానాలపై దళితులు ఉద్యమించాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్ అన్నారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ పాలిత రాష్ట్రాల్లో దళితులకు ఏమాత్రం రక్షణ లేదన్నారు. దళితులపై 300 రేట్లు దాడులు పెరిగాయన్నారు. ఒక్క 2021 లోనే 50900 దాడులు జరిగినట్లు కేంద్ర నేర నిరోధక శాఖ విడుదల చేసిన వివరాలు తెలియజేస్తున్నాయని అన్నారు. ఢిల్లీ, కేరళ, తమిళనాడు రాష్ట్రాల తరహాలోనే మన రాష్ట్రంలో దళిత, గిరిజనులకు 300 యూనిట్ల ఉచిత విద్యుత్‌కు ఉద్యమించాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 342 జీఓ ప్రకారం దళిత గిరిజనులకు 101 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ ఇవ్వాలన్నారు. ప్రభుత్వం ఆ జీఓను అమలు చేయకపోవడం వల్ల దళితులు భారీగా నష్టపోతున్నారని వాపోయారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో లబ్ధిదారులు ఉచిత విద్యుత్ పొందలేక పోతున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఢిల్లీ, కేరళ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాల మాదిరిగా 300 ఉచిత విద్యుత్ ఇవ్వాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా 101యూనిట్ల నుంచి 300 యూనిట్స్‌కు పెంచాలని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 10 నుంచి గ్రామాల్లో సర్వేలు, సెప్టెంబర్ 20 నుంచి 25 మధ్య మండల విద్యుత్ ఆఫీసుల వద్ద ధర్నాలు సెప్టెంబర్ 28, 29న జిల్లా విద్యుత్ ఆఫీసుల వద్ద ధర్నాలు చేపట్టనున్నట్లు వివరించారు. కేవీపీఎస్ ఏర్పడి 25ఏండ్ల నిండుతున్న సందర్భంగా అక్టోబర్ 2 నుంచి 9వరకు కేవీపీఎస్ ఆవిర్భావ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామగ్రామాన కేవీపీఎస్ జెండాలు ఎగురవేయాలన్నారు. ఈ సమావేశంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు మాస్కే నాగేష్, దుర్గం రాజ్ కుమార్, జిల్లా సహాయ కార్యదర్శి డొంగ్రే మహేశ్వర్, జిల్లా నాయకులు జాడి రామయ్య పాల్గొన్నారు.

సేఫ్టీ కమిటీ సూచనలు పాటించేలా చూడాలి

నవతెలంగాణ-రెబ్బెన

బెల్లంపల్లి ఏరియాలోని గనులు, డిపార్టుమెంట్లలో సేఫ్టీ కమిటీ సమావేశాలను నిర్దేశిత కాలపరిమితి ప్రకారం నిర్వహించి, సేఫ్టీ కమిటీ చేసే సూచనలు పాటించి, కార్మికులకు రక్షణ కల్పించి ప్రమాదాలకు గురికాకుండా యాజమాన్యాన్ని ఆదేశించాలని డిప్యూటీ డైరెక్టర్ జనరల్ భవానీ ప్రసాద్ సింగ్‌ను టీబీజీకేయస్ బెల్లంపల్లి ఏరియా వైస్ ప్రెసిడెంట్ మల్రాజ్ శ్రీనివాస్‌రావు కోరారు. మందమర్రి ఏరియాలోని ఇల్లందు క్లబ్‌లో మంగళవారం జరిగిన 22వ ఏరియా స్థాయి ట్రైపార్మెట్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ బెల్లంపల్లి ఏరియాలోని గనుల్లో రక్షణ కోసం రక్షణ కమిటీ సమావేశాల్లో సభ్యులు, వర్క్‌మెన్ ఇన్స్‌పెక్టర్‌లు సూచించిన సలహాలను అమలుచేయాలని వారు కోరారు. రక్షణ కమిటీ సమావేశాలకు సంబంధిత అధికారులు తప్పకుండా హాజరయ్యేలా చూడాలని కోరారు. గోలేటిలోని డిస్పెన్సరీలో ఏర్పాటుచేసిన తిరియాడికల్ మెడికల్ పరీక్ష సెంటర్‌లో ఎక్స్‌రే టెక్నీషియన్‌ను నియమించాలని, సరైన పరికరాలను అందుబాటులో ఉంచి ప్రతిరోజు మెడికల్ పరీక్షలు నిర్వహించాలని కోరారు. అత్యవసర సమయంలో గోలేటి నుండి కార్పొరేట్ ఆస్పత్రులకు రెఫర్ చేసే విధంగా క్లర్కును నియమించాలని కోరారు. ఓపెన్‌కాస్టులో అన్ని రోడ్లను సరిచేయాలని కోరారు. గోలేటి, మాదారంలోని కార్మిక కాలనీల్లో మంచినీటి సరఫరా నిరంతరం ఉండేలా చూడాలని, కాలనీలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడడానికి ప్రతి షిఫ్టుకు ఎలక్ట్రీషియన్‌లను నియమించాలని కోరారు. సమావేశంలో డిప్యూటీ డైరెక్టర్ జనరల్ భవానీ ప్రసాద్ సింగ్, సింగరేణి డైరెక్టర్(సీపీ) జి వెంకటేశ్వర్‌రెడ్డి, సేఫ్టీ జీఎం సుభానీ, ఇతర మైనింగ్, ఎలక్ట్రికల్, మెకానికల్ ఇన్స్‌పెక్టర్లు, బెల్లంపల్లి, మందమర్రి జనరల్ మేనేజర్‌లు రవిప్రసాద్, మనోహర్, సేఫ్టీ జీఎం బెల్లంపల్లి రీజియన్ కెహెచ్ఎన్ గుప్తా, అన్ని గనుల డిపార్టుమెంట్ల విభాగాల అధిపతులు, వర్క్‌మెన్ ఇన్స్‌పెక్టర్లు పాల్గొన్నారు.

గోలేటి సీహెచ్‌పీలో ప్రోత్సాహక స్కీం అమలు

నవతెలంగాణ-రెబ్బెన

బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి సీహెచ్‌పీలో ఉద్యోగులకు బొగ్గు రవాణాపై ప్రోత్సాహక స్కీంను అమలుచేస్తూ యాజమాన్యం సర్క్యులర్ జారీ చేసిందని టీబీజీకేయస్ బెల్లంపల్లి ఏరియా వైస్ ప్రెసిడెంట్ మల్రాజ్ శ్రీనివాస్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గోలేటి సీహెచ్‌పీ ప్రారంభమై మూడు సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ ఇప్పటివరకు ప్రోత్సాహక స్కీంను ప్రవేశపెట్టలేదని, వెంటనే ప్రోత్సాహక స్కీంను ప్రవేశపెట్టాలని యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి ఒత్తిడి చేసిన ఫలితంగా మంగళవారం కొత్తగూడెం అధికారుల ఆమోదంతో గోలేటి సీహెచ్‌పీ ఉద్యోగులకు ప్రోత్సాహక స్కీం అమలుచేయడం జరిగిందన్నారు.

ఉద్యోగులకు క్వార్టర్ల కేటాయింపు

నవతెలంగాణ-మందమర్రి



సీనియారిటీ ప్రకారం ఉద్యోగులకు క్వాటర్లు కేటాయించామని ఏరియా పీఎం శ్యామ్ సుందర్ తెలిపారు. మందమర్రి ఏరియా సిఈఆర్ క్లబ్‌లో మంగళవారం ఎన్సిడబ్ల్యూఏ ఉద్యోగులకు క్వాటర్స్ కౌన్సిలింగ్ నిర్వహించారు. ఏరియా పర్సనల్ మేనేజర్ ఎస్ శ్యామ్ సుందర్ మాట్లాడుతూ ఈ కౌన్సిలింగ్‌లో 64 క్వాటర్స్ ప్రకటించగా, 106 మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకున్నారని, సీనియార్టీ ప్రకారం 32 మంది ఉద్యోగులకు క్వార్టర్స్ కేటాయించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏజెంట్ రాందాస్, సీనియర్ పీఓ ఎండీ ఆసిఫ్, పర్సనల్ ఓఎస్ రాయలింగు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ 1104 యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం పట్టణంలోని విద్యుత్ తరంగిణి ఫంక్షన్ హాల్‌లో యూనియన్ ఆదిలాబాద్ సర్కిల్ ప్రాంతీయ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయనకు బ్యాండు మేళాల నడుమ ఉద్యోగులు ఘన స్వాగతం పలికారు. అనంతరం సంఘం జెండాను ఆవిష్కరించి జ్యోతి ప్రజ్వలన చేశారు. రాష్ట్రంలో 24 గంటల నాణ్యమైన విద్యుత్‌ను ప్రజలకు అందించడానికి ఉద్యోగులు ఎంతో శ్రమ పడుతున్నారని యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు అన్నారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. పనిభారం తగ్గించేలా ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి, సంఘం సంక్షేమానికి యూనియన్ తరపున పోరాటాలు చేస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయిబాబు, రీజనల్ అధ్యక్షులు విలాస్, పద్మ రెడ్డి, రఘునందన్, ఎస్.ఈ సంపత్ కుమార్ పాల్గొన్నారు.

కవ్వాల్ టైగర్ జోన్‌లో బీట్ ఆఫీసర్లకు శిక్షణ

నవతెలంగాణ-జన్నారం

హైదరాబాద్ దూలపల్లి అకాడమీలో శిక్షణ పొందుతున్న 36 మంది బీట్ అధికారులకు మంగళవారం కవ్వాల్ టైగర్ జోన్‌లో ఎఫ్‌డీఓ మాధవరావు శిక్షణ ఇచ్చారు. కవ్వాల్ టైగర్ జోన్‌లో అవలంబిస్తున్న అభివృద్ధి పనులు అక్రమ కలప రవాణా నివారణ, అడవుల పెంపకం, గ్రాస్ ప్లాంట్ల పెంపకం, అడవి జంతువుల సంరక్షణ, పలు వాటిపై 36 మంది నూతన బీట్ ఆఫీసర్లకు అవగాహన కల్పించారు.

ఉత్పత్తి, ఉత్పాదకతపై సమీక్షించిన జీఎం దేవేందర్

నవతెలంగాణ- నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలో బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత, రవాణా, డిస్పాచ్‌పై మార్కెటింగ్ జనరల్ మేనేజర్ దేవేందర్ మంగళవారం సమీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ శ్రీరాంపూర్ ఏరియాలో ఉన్న అన్ని గనులు తమ నిర్దేశిత లక్ష్యాలను సాధించడం జరుగుతుందని తెలిపారు. మార్కెటింగ్ మేనేజర్ దేవేందర్ శ్రీరాంపూర్ ఏరియాకు మొదటిసారి వచ్చిన సందర్భంగా అధికారులు ఘనంగా శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టూ జీఎం రఘుకుమార్, ఇందారం ఉపరితల గని ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎం. శ్రీనివాస్, ఏజీఎం ఫైనాన్స్ మురళీధర్, డీజీఎం పర్సనల్ పి.అరవింద రావు, డీజీఎం ఐఈడి చిరంజీవులు, క్వాలిటీ మేనేజర్ కె. వెంకటేశ్వర్ రెడ్డి, ఎస్టేట్స్ ఆఫీసర్ వరలక్ష్మి,ఎస్ఈ పర్చేజ్ చంద్రశేఖర్,ఫారెస్ట్ అధికారి మహేష్ పాల్గొన్నారు.

నష్టపరిహారం అందించిన అటవీశాఖ

నవతెలంగాణ- తాండూర్

మండలంలోని ఘర్షణఘట్టం గ్రామానికి చెందిన ఆత్రం మోతీరాంకు బెల్లంపల్లి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ సుభాష్ రూ.15వేల నష్టపరిహారం అందించారు. గత సంవత్సరం అటవీ ప్రాంతంలో మోతీరామ్‌కు చెందిన లేగ దూడ చిరుత దాడిలో మృతి చెందింది. పంచనామా నిర్వహించిన అటవీ అధికారులు బాధితునికి నష్టపరిహారం అందే విధంగా కృషి చేశారు. ఈ కార్యక్రమంలో సెక్షన్ ఆఫీసర్ ప్రభాకర్, బీట్ ఆఫీసర్ యుగేందర్, గ్రామపెద్ద రాము పాల్గొన్నారు.

నేటి నుండి సింగరేణి వార్షిక క్రీడా పోటీలు

నవతెలంగాణ- నస్పూర్

సింగరేణి 2023-24 వార్షిక క్రీడా పోటీలు మంగళవారం శ్రీరాంపూర్ ఏరియా ప్రగతి మైదానంలో నిర్వహిస్తున్నట్లు శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ బి. సంజీవరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. క్రీడలలో ప్రావీణ్యం కలిగిన శ్రీరాంపూర్ ఏరియా ఉద్యోగులు తమ టీంలలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. వాలీబాల్, బాస్కెట్ బాల్, ఫుట్‌బాల్, క్రికెట్, క్యారమ్స్, చెస్, టేబుల్ టెన్నిస్,షటిల్ బ్యాడ్మింటన్, హాకీ, బాల్ బ్యాడ్మింటన్,కబడ్డీ, లాన్ టెన్నిస్,అథ్లెటిక్స్,ఈత పోటీలు, త్రో బాల్, కల్చరల్, బాడీ బిల్డింగ్, వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

రాజ్‌గోండ్ సేవా సమితి అధ్యక్షుడిగా లక్ష్మణ్

నవతెలంగాణ-పెంబి

రాజ్‌గోడ్ సేవా సమితి మండల అధ్యక్షుడిగా సిడాం లక్ష్మన్ నియమకం అయ్యారు. మంగళవారం మండలంలోని దొందరి గ్రామానికి చెందిన సిడాం లక్ష్మణ్‌ను జిల్లా అధ్యక్షులు ఆత్రం రాజేశ్వర్ ఆధ్వర్యంలో మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఆయనున్న సత్కరించి అభినందలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఆత్రం భీంరావ్, కేశవ్, వెడ్మ శేఖర్, శేషరావు, భీమ్‌రావు, జంగుఉన్నారు.

15న అడెల్లి ఆలయ దుకాణాల బహిరంగ వేలం

నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని అడెల్లి శ్రీ మహా పోచమ్మ దేవస్థానంలో సంవత్సరం పాటు వివిధ రకాల వస్తువులు విక్రయించేందుకు లీజు హక్కు కోసం ఈనెల 15న బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి రంగు రవికిషాన్ గౌడ్ పేర్కొన్నారు. ఇందులో 1. టెంట్ హౌజ్ వంటపాత్రలు కిరాయి, 2. ఇడుపుడు పిల్ల మేకలను సేకరించడం, 3. తయ్ బజార్ వసూలు చేసుకునే హక్కు కాలపరిమితి 21 సెప్టెంబర్ నుంచి 20 సెప్టెంబర్ 2024 వరకు ఉంటుందన్నారు. ఆసక్తి కలవారు శుక్రవారం ఉదయం 11- గంటలకు బహిరంగ వేలంలో పాల్గొనాలని కోరారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-బజార్‌హత్నూర్

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యులు డాక్టర్ భీంరావ్ అన్నారు. మంగళవారం మండలంలోని దేగామ గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి గర్భిణీతో పాటు దగ్గు జలుబు, జ్వరంతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి భీంరావ్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, పరిసరాలతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటించాలన్నారు. దోమలు వృద్ధి చెందకుండా ప్రతి శుక్రవారం డ్రై డేను నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ లక్ష్మణ్, వైస్ ఎంపీపీ పోరెడ్డి శ్రీనివాస్, హెచ్ఈఓ సూర్యప్రకాష్, సూపర్‌వైజర్ దేవిదాస్, ఏఎన్ఎం ఆరాధన తదితరులు పాల్గొన్నారు.

నూతన ఎస్సైకు సన్మానం

నవతెలంగాణ-దిలావర్‌పూర్

నూతనంగా ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన యసత్ అర్భాత్‌ను మండల బీఆర్ఎస్ నాయకులు సన్మానించారు. మంగళవారం పోలీస్ స్టేషన్‌లో మర్యాదపూర్వకంగా కలిసిన నాయకులు శాలువతో సత్కరించి స్వాగతం పలికారు. ఇక్కడ విధులు నిర్వహించిన గంగాధర్ నిర్మల్ పట్టణానికి బదిలీకి వెళ్లాగా ఆయన స్థానంలో అర్భాత్ వచ్చారు. సన్మాన కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్దె అనిల్, ధనె రవి, హరి పటేల్, గుణవంత్ రావ్, కోడె నవీన్, సప్పల రవి, సప్పల నర్సయ్య ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

బజార్‌హత్నూర్ : మండలంలోని పిప్రి గ్రామానికి చెందిన బండారి లావణ్య ఇటీవలే రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలుసుకున్న బోథ్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్ కుటుబాన్ని పరామర్శించారు. మంగళవారం వారి ఇంటికి వెళ్ళి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ అల్లూరి కవిత, ఎంపీటీసీ పండుగ మురళి, బోథ్ మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు భాస్కర్ రెడ్డి, జాఫర్ ఖాన్, మండల బీఆర్ఎస్ యూత్ అధ్యక్షులు డుబ్బుల చంద్ర శేకర్, నిమ్మల హనుమంత్ రెడ్డి, రమణారెడ్డి, వెంకటరమణ, అజయ్, ఉపేందర్, భోజన్న, సల్మాన్, రియాజ్, సాకేష్, బొడ్డు శ్రీనివాస్, భూమన్న, నర్సయ్య, సునీల్, అనిల్ అన్న యువ సైన్యం సభ్యులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు సెప్టెంబర్ 10 నుండి 17 వరకు ఆదిలాబాద్ జిల్లాలో సీపీఐ(ఎం) పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం వారోత్సవాల సందర్భంగా సుందరయ్య భవనంలో సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ మాట్లాడుతూ వీర తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలు ఏడు రోజుల పాటు నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగానే 17న పట్టణంలో బైక్ ర్యాలీ చేపడుతున్నట్లు తెలిపారు. రానున్న ఎన్నికల లక్ష్యంగా గత ఏడాది సెప్టెంబర్ 17 నుంచి బీజేపీ పావులు కదపడం మొదలుపెట్టిందని అన్నారు. పోరాటం ఫలితంగా హైదరాబాద్ రాజ్యం ఇండియన్ యూనియన్లు విలీనమైందని తెలిపారు. వెట్టిచాకిరి మీద ప్రతిఘటనతో మొదలైన పోరాటం భూమికోసం, భుక్తికోసం సాగిందని, రాచరికం అంతమయ్యేందుకు దారితీసిందన్నారు. దున్నేవాడిదే భూమి అని నినాదించిందన్నారు. వ్యవసాయక సమస్యను భారతదేశం ఎజెండా మీదకు తెచ్చిందని, కులమత, ప్రాంతీయ భేదాలకతీతంగా సాగిన చారిత్రక పోరాటం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటమన్నారు. ఈ పోరాటానికి మతం రంగు పులిమెందుకు మతోన్మాదులు ప్రయత్నిస్తున్నారని అన్నారు. భూస్వామి దోపిడీకి రాచరిక నిరంకుశత్వానికి వ్యతిరేకంగా సాగిన పోరాటమని తెలిపారు. రాజు, ముస్లిం జమిందార్లు, హిందువులు, రజకార్లు, ముస్లింలు ఇక్కడ దోపిడీకి అణచివేతకు మతం అడ్డు రాలేదన్నారు. కామ్రేడ్ అసోసియేషన్ ప్రారంభించిన వారు అలం ఖుద్మీరి, ముఖ్దుం, మోహియుద్దీన్, రాజ్ బహదూర్ లాంటి వారు నిజాం నిరంకుశత్వానికి, దూనుమడి అమరుడైన కలం యోధుడు షోయబుల్లాఖాన్ అన్నారు. రాజు సహకారంతో జరిగిన భూస్వామి దాడిలో బందగీ ముస్లిం మరణించారన్నారు. ఇక్కడ మత భావాలకు తావులేదని శ్రమ దోపిడి మీద దౌర్జన్యాల మీద సాగిన తిరుగుబాటు అని గుర్తు చేశారు. కేవలం తెలంగాణ ప్రజల మధ్య మతపరమైన విభజన సృష్టించి రాజకీయ లబ్ది పొందేందుకు తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి మతం రంగు పులుముతున్నారని మండిపడ్డారు. తెలంగాణ ప్రజలు చైతన్యం ప్రదర్శించాలని, శ్రామికులు ఐక్యంగా నిలవాలని కోరారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్‌ల ఎత్తుగడలు ఓడించాలని, సామరస్యాన్ని కాపాడాలని కోరారు. సమస్యల పరిష్కారం కోసం ఐక్యపోరాటాలకు సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు బండి దత్తాత్రేయ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లంక రాఘవులు, పుసం సచిన్, జిల్లా కమిటీ సభ్యులు బొజ్జ ఆశన్న, ఆర్. మంజుల, ఆర్. సురేందర్, నాయకులు దోలుపెల్లి స్వామి, లంక జమున, శకుంతల, లలిత, ఆశన్న, విష్ణు, రామకాంత్, రమేష్ ఉన్నారు.

రక్షణ సూత్రాలు పాటిస్తూ ఉత్పత్తి సాధించాలి



నవతెలంగాణ-మందమర్రి

ఉద్యోగులు భూగర్భ గనులు, డిపార్ట్మెంట్లలో రక్షణ సూత్రాలు పాటిస్తూ ఉత్పత్తి సాధించాలని హైదరాబాద్ సౌత్ సెంట్రల్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ (డీజీఎంఎస్) భూషణ్ ప్రసాద్‌సింగ్ సూచించారు. మందమర్రి ఏరియాలోని ఇల్లందు క్లబ్‌లో 22వ ఏరియా లెవెల్ త్రైపాక్షిక సేఫ్టీ సమీక్ష సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, కార్మిక సంఘాల నాయకులు రక్షణ ప్రతిజ్ఞ చేశారు. గని ప్రమాదాల్లో మరణించిన ఉద్యోగులు, అధికారుల ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా భూషణ్‌ప్రసాద్‌సింగ్ మాట్లాడుతూ ప్రతి ఉద్యోగికి రక్షణ సూత్రాలు తెలియాలని, వ్యక్తిగత ఆరోగ్య పరిరక్షణతో పనిచేయించాలని సూచించారు. మందమర్రి ఏరియాలో ప్రమాదాలు జీరో పర్సంటేజ్ సాధించడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఉపరితల, భూగర్భ గనుల్లో ప్రమాదాలు జరగకుండా నివారించడానికి కావాల్సిన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, నిష్ణాతులైన ఉద్యోగులకు సునిశితమైన ప్రదేశాల్లో పనికి నియమించాలని సూచించారు. అనంతరం సింగరేణి డైరెక్టర్ (పీ.పీ) వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ సింగరేణిలో రక్షణ చర్యల పై యాజమాన్యం పకడ్బందీ చర్యలు తీసుకుంటుందన్నారు. ఉద్యోగులు, అధికారులు కలిసికట్టుగా రక్షణ సూత్రాలు పాటిస్తూ ఉత్పత్తిని సాధించడం జరుగుతుందని చెప్పారు. సేఫ్టీ జనరల్ మేనేజర్ సుభాని మాట్లాడుతూ సింగరేణి వ్యాప్తంగా రక్షణపై ఉద్యోగులు, అధికారులకు ఎప్పటికప్పుడు సూచనలు చేస్తూ ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. రక్షణ పై సేఫ్టీ ఆపరేటింగ్ ప్రొసీజర్స్‌ను ప్రతి గనిలో పనిచేస్తున్న ఉద్యోగులకు తెలిపారు. యూనియన్ల నాయకులు మాట్లాడుతూ గనుల్లో రక్షణ ఏర్పాట్లపై తీసుకుంటున్న చర్యలపై డీజీఎంఎస్ అధికారులకు వివరించారు. రక్షణ చర్యల్లో భాగంగా అధునాతన యంత్రాలు, నూతన సాంకేతికతను వినియోగించుకోవాలని సూచించారు. కార్మిక సంఘాల నాయకుల సూచనలపై అధికారులు సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో డిఎంఎస్ ఎలక్ట్రికల్ బెహారా, డిడిఎంఎస్ రక్షణ వెంకన్న, డిఎంఎస్ మెకానికల్ అరుముగం, ఆక్యుపేషనల్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ జార్జ్‌జాన్, డిడిఎంఎస్ ఎలక్ట్రికల్ రాజీవ్ ఓం ప్రకాష్‌వర్మ, మైనింగ్ ఎన్. నాగేశ్వరరావు, మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ మనోహర్, బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ రవి ప్రసాద్, బెల్లంపల్లి రీజినల్ సేఫ్టీ జీఎం కేహెచ్ఎన్ గుప్తా, ఎస్ఓటు జీఎం రాజేశ్వర్ రెడ్డి, ఏఎస్ఓ రవీందర్, సీఎంఓఏఐ అధికారులు, గనుల మేనేజర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళనలు తీవ్రం చేస్తాం

నవతెలంగాణ-నస్పూర్

టింబర్ యాడ్ కార్మికుల సమస్యల పరిష్కరించకుంటే రానున్న రోజుల్లో ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ అన్నారు. మంగళవారం శ్రీరాంపూర్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ తిప్పారపు సారయ్య ఆధ్వర్యంలో జీఎం కార్యాలయం ఎదుట ఒక్కరోజు నిరాహార దీక్ష చేపట్టారు. అనంతరం మేనేజర్ కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమానికి రియాజ్ అహ్మద్ పాల్గొని మాట్లాడారు. గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలుగా ఉన్న టీబీజీకేఎస్, ఏఐటీయూసీ సంఘాల వల్ల టింబర్ యార్డ్ కార్మికులు తీవ్ర వేతన నష్టానికి గురవుతున్నారని తెలిపారు. గత ఐదు నెలలుగా హెచ్ఎంఎస్ ఆధ్వర్యంలో టింబర్ యార్డ్ కార్మికుల పక్షాన పోరాటం చేయడం వల్ల యాజమాన్య స్పందించి గ్రీవెన్స్ ప్రొసీజర్ వన్, గ్రీవెన్స్ రెండవ దశ చర్యలు జరిపారని పేర్కొన్నారు. దీంతోపాటు గ్రీవెన్స్ మూడవ దశ చర్చలు ఏర్పాటు చేసి హెచ్ఎంఎస్ యూనియన్ ఆహ్వానించి చర్చ జరపాలని డిమాండ్ చేశారు. గత 30 సంవత్సరాలుగా పీస్ రేటెడ్‌గా పని చేస్తున్నప్పటికీ సంబంధిత సాయల్ ప్రమోషన్ కూడా ఎవరికి ఇవ్వడం లేదన్నారు. దీనివల్ల 30 సంవత్సరాలుగా గ్రూప్ 5ఏ పనిచేస్తూనే మొదటి క్యాటగిరి వేతనం కూడా చెల్లించకుండా తీవ్ర వేతన నష్టానికి గురి చేస్తున్నారని విమర్శించారు. జనరల్ మేనేజర్ ఆదేశించిన గాని కింది స్థాయి అధికారులు యాక్టింగ్ నమోదు చేయకుండా జనరల్ మేనేజర్‌ను తప్పుతో పట్టిస్తున్నారని ఆరోపించారు. వెంటనే సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర కార్యదర్శి గోళ్ళ సత్తన్న, స్టోర్స్ ఫిట్ కార్యదర్శి పల్లె క్రాంతి కుమార్, వర్క్ షాప్ ఫిట్ కార్యదర్శి అశోక్, ఎస్ఆర్పీ 1ఫిట్ కార్యదర్శి రేగుంట సందీప్, సెంట్రల్ వైస్ ఆర్గనైజింగ్ సెక్రటరీ దుర్గం లక్ష్మణ్, నాయకులు కొమురయ్య, రాజేంద్ర ప్రసాద్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

టెట్‌కు పకడ్బందీగా నిర్వహించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఈనెల 15న నిర్వహించనున్న ఉపాధ్యాయ అర్హత (టెట్) పరీక్షను పకడ్బందీగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష నిర్వహణపై చీఫ్ సూపరింటెండెంట్, విద్యాశాఖ, రూట్ అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఉపాధ్యాయ అర్హత పరీక్షను పకడ్బందీగా నిర్వహించేలా అవసరమైన ఏర్పాట్లను సిద్ధంచేయాలని సూచించారు. పరీక్ష కేంద్రంలోనికి సెల్ ఫోన్, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించవద్దని, ప్రతి కేంద్రంలో సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. దివ్యాంగ అభ్యర్థుల కొరకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని అన్నారు. ప్రశ్న, జవాబు పత్రాల తరలింపును పటిష్టంగా నిర్వహించాలని, ప్రతి పరీక్ష కేంద్రం వద్ద పూర్తిస్థాయి బందోబస్తు ఏర్పాటు చేపట్టాలన్నారు. కేంద్రాలలో త్రాగునీరు, విద్యుత్‌తో పాటు వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని సూచించారు. ఆదిలాబాద్ పట్టణంలో పేపర్ 1 పరీక్ష ఉదయం 9:30 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతుందని, 33 కేంద్రాలలో 7,716 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారని తెలిపారు. అలాగే పేపర్ 2 పరీక్ష మధ్యాహ్నం 2:30 గంటల నుండి సాయంత్రం 5:00 గంటల వరకు జరుగుతుందని, 14 కేంద్రాలలో 3,124 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా అధికారులు సమన్వయంతో పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, జిల్లా విద్యాశాఖ అధికారి ప్రణీత, చీఫ్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

రెండోరోజుకు అంగన్‌వాడీ ఉద్యోగుల సమ్మె

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్



సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట చేపడుతున్న సమ్మె మంగళవారంతో రెండవ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు కే.సునీత మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీలు గర్భిణీకు, పిల్లలకు పోష్టికాహారం అందించడంలో ముందున్నారన్నారు. గ్రామాలలో సర్వేలు రికార్డులు, అనేక పనులు చేస్తున్నారన్నారు. కానీ అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం అయిందన్నారు. అంగన్‌వాడీ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ. 26,000 ఇవ్వాలని, పెన్షన్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం సమస్యలు పరిష్కరించకుండా బెదిరింపులకు గురిచేస్తుందని మండిపడ్డారు. అంగన్‌వాడీ సెంటర్‌ల తాళాలు పగలగొట్టి భయభ్రాంతులకు గురిచేయడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. తమకు కేసులు ఏవి కొత్తవి కావని భయపెట్టడానికి చూస్తే బయపడబోమని, ప్రభుత్వం తమ డిమాండ్లను పరిష్కరించేంత వరకు ఈ సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు, అంగన్‌వాడీ ఉద్యోగులు ఉన్నారు.

ఎస్ఎస్ఏ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

నవతెలంగాణ-నస్పూర్

సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షుడు రేగుంట సునీల్ మాదిగ అన్నారు. గత కొన్ని రోజులుగా మంచిర్యాల జిల్లాలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు చేస్తున్న రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సునీల్ మాదిగ మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా పనిచేస్తున్న 22వేల సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, సమగ్ర శిక్ష ఉద్యోగులకు కనీస వేతనం కల్పించాలని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం సానుకూలంగా స్పందించి వారి న్యాయమైన కోరికను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాది ఆకుల దండోరా నాయకులు కడారి రమేష్ మాదిగ, కలాల రమేష్ మాదిగ, వడ్లకొండ సంజయ్ మాదిగ, అక్కపురం సమ్మయ్య మాదిగ, సుందిళ్ల సంతోష్ మాదిగ, సంజీవ్ మాదిగ, రామగిరి రాజేష్ మాదిగ, సతీష్ మాదిగ పాల్గొన్నారు.

జాతీయ బ్యాడ్మింటన్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు ప్రతిభ



నవతెలంగాణ-హాజీపూర్

బెంగళూరులో ఈ నెల 9 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించిన అండర్-19 నేషనల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్షిప్ పోటీలలో తెలంగాణ రాష్ట్ర జట్టు క్రీడాకారులు 3 గోల్డ్ మెడల్స్ సాధించారని జట్టు మేనేజర్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పుల్లూరి సుధాకర్ తెలిపారు. బాలుర సింగిల్స్‌లో రుషింద్ర, బాలికల సింగిల్స్‌లో రక్షిత శ్రీ, మిక్స్‌డ్ డబుల్‌లో సాత్వికరెడ్డి, వైష్ణవి గోల్డ్ మెడల్స్ సాధించారని పేర్కొన్నారు. ఈ జట్టుకు కోచ్ అనిల్ కుమార్ వ్యవహరించారన్నారు. వీరిని బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ప్రధాన కార్యదర్శి పుల్లెల గోపీచంద్, బ్యాడ్మింటన్ సంఘం బాధ్యులు, ఉమ్మడి అదిలాబాద్ జిల్లా బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్షుడు పెద్దపల్లి ఏసీపీ ఎడ్ల మహేష్, చీఫ్ అడ్వైజర్ మంచిర్యాల మున్సిపల్ వైస్ చైర్మన్ గాజుల ముఖేష్ గౌడ్, జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ బాధ్యులందరూ మెడల్స్ సాధించిన క్రీడాకారులను, టీం మేనేజర్, కోచ్‌ను అభినందించారు.

రూ.2.11 కోట్లు కాజేసిన వ్యక్తి అరెస్ట్

నవతెలంగాణ-హాజీపూర్

షేర్ మార్కెట్ రూ.రెండు కోట్లు మోసం చేసిన వ్యక్తిని మంచిర్యాల పోలీస్‌లు అరెస్ట్ చేశారు. 5 నెలలుగా తప్పించుకు తిరుగుతున్న మోసగాన్ని పట్టుకొన్న టాస్క్ ఫోర్స్ టీమ్ రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో అమాయక ప్రజలను షేర్ మార్కెట్ పేరుతో మోసం చేసి నెలలుగా తప్పించుకు తిరుగుతున్న నిందితుని అరెస్ట్ చేశామని తెలిపారు. మోసలకు పాల్పడుతున్నాడనే పిర్యాదుతో టాస్క్ ఫోర్స్ ఏసీపీ మల్లారెడ్డి, టాస్క్ ఫోర్స్ ఇన్స్‌పెక్టర్ సుధాకర్ ఆధ్వర్యంలో ప్రత్యేక టీమ్ ఏర్పాటు చేసి నిందితుని పట్టుకోవడం జరిగిందన్నారు. నిందితుడు మరికొంత మంది వద్ద నుంచి డబ్బులు వసూలు చేయడం కోసం హైదరాబాద్ నుంచి మంచిర్యాలకు వస్తున్నాడానే సమాచారం మేరకు మంచిర్యాల లోని రైల్వే బ్రిడ్జ్ ప్రాంతంలో టాస్క్ ఫోర్స్, మంచిర్యాల పట్టణ పోలీస్ సంయుక్తంగా కలిసి నిందితుడు చెవ్వ రవిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. నిందితుని వద్ద నుండి క్రెడిట్ కార్డ్స్, బ్యాంక్ పాస్ బుక్స్, చెక్ బుక్స్, రూ.8 వేల నగదు, రిజిస్టర్ బుక్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో టాస్క్ ఫోర్స్ ఏసీపీ మల్లారెడ్డి, టాస్క్ ఫోర్స్ ఇన్స్‌పెక్టర్ సుధాకర్, అశోక్, టాస్క్ ఫోర్స్ ఎస్సై ప్రసాద్, లచ్చన్న పాల్గొన్నారు.

జగ్గయ్యపేటలో జ్వరాలపై సర్వే

నవతెలంగాణ-భీమిని

మండలంలో జగ్గయ్యపేట గ్రామంలో మంగళవారం రోజున ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఇంటింటికి వెళ్లి విష జ్వరాల సర్వే చేపట్టారు. జరాలతో బాధపడుతున్న వారి రక్తం నమూనాలు స్వీకరించారు. విష జ్వరాలు రాకుండా ఉండడానికి ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది అన్నారు. మన చుట్టూ ఉన్న పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం బాధితులకు మాత్రలు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూర్‌వైజర్ శ్రీనివాస్ హెల్త్ అసిస్టెంట్ శంకర్ పాల్గొన్నారు.

అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించే వరకు పోరాటం

నవతెలంగాణ-జన్నారం

అంగన్‌వాడీ కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఏఐటీయూసీ మంచిర్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల సరస్వతి, సీఐటీయూ మండల అధ్యక్షులు నస్రిమ్ బేగం అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన సమ్మె 2వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులకు వర్తించే అన్ని బెనిఫిట్స్ ఇవ్వాలని కోరారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ అంగన్‌వాడీ టీచర్‌కు రూ.10 లక్షలు, ఆయాకు రూ. 5లక్షలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో గంజాయిల జమున, జాడి కృపా, లక్ష్మీ స్వరూప, కళావతి, విజయ, రాజవ్వ, స్వరూప, చంద్రలీలా, వజ్రా పాల్గొన్నారు

పురుగులమందు తాగి కౌలు రైతు ఆత్మహత్య

నవతెలంగాణ-జన్నారం

చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక పురుగుల మందు తాగి కౌలురైతు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని చింతగూడ గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని చింతగూడ గ్రామానికి చెందిన శ్రీపతి రామ్‌మూర్తి(50) అదే గ్రామంలో ఆరు ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని వరి పంట వేశాడు. గతంలో రెండుసార్లు ఇతర దేశాలకు వెళ్లి వచ్చాడు. దీంతో అతనికి రూ.6 లక్షల రూపాయలు అప్పు కావడం, వాటిని ఎలా తీర్చాలో తెలియ కలత చెందేవాడు. సోమవారం పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మధ్యాహ్నం మృతి చెందాడు. మృతుడికి భార్య అనసూయ్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

మట్టి గణపతి విగ్రహాలను పరిశీలించిన కలెక్టర్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



బీసీ సంక్షేమ శాఖ ద్వారా పంపిణీ చేయనున్న మట్టి గణపతి విగ్రహాలను ఆదిలాబాద్ పట్టణంలోని బిసి స్టడీ సర్కిల్ భవనంలో జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా బిసి సంక్షేమశాఖాధికారి రాజాలింగుతో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టర్ అఫ్ పారిస్ విగ్రహాలు కాకుండా మట్టి విగ్రహాలకు ప్రాధాన్యమివ్వాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్టడీ సర్కిల్ డైరెక్టర్ ప్రవీణ్ ఉన్నారు.

అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఎల్లవేళల కృషి

నవతెలంగాణ- బోథ్



మండల కేంద్రంలోని నూతన పంచాయతీరాజ్ సబ్ డివిజన్ కార్యాలయ నిర్మాణ పనులను ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు, బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేసీఆర్ బోథ్ నియోజకవర్గ అభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తుందన్నారు. త్వరలో నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని తెలిపారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రభుత్వ సివిల్ ఆసుపత్రి నిర్మాణాన్ని అనిల్ జాదవ్ పరిశీలించారు. యాభై పడకల ఆసుపత్రి నుంచి ప్రభుత్వం ప్రజల సులభ్యం కోసం వంద పడకల ఆసుపత్రిగా ఉన్నతీకరించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సురేందర్ యాదవ్,ఎంపీపీ తుల శ్రీనివాస్, జెడ్పీటీసీ డా.సంధ్యారాణి ప్రసాద్, నేరడిగొండ ఎంపీపీ సజన్, మార్కెట్ కమిటీ చైర్మన్ రుక్మన్ సింగ్,సర్పంచుల సంఘం అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి,ఆత్మ చైర్మన్ సుభాష్, కోఆప్షన్ మెంబర్ తాహిర్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీల హక్కుల సాధనకు పోరాటాలే ప్రధానం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

అంగన్‌వాడీల హక్కుల సాధన పోరాటాలతోనే సాధ్యమని సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు పునరుద్ఘాటించారు. సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ వర్కర్లు చేస్తున్న సమ్మె మంగళవారం రెండో రోజు చేరుకోగా నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోరాటాలతోనే హక్కులను సాధించుకుందామన్నారు. అంగన్‌వాడీ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ. 26000 ఇవ్వాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ చెల్లించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ టీచర్లకు రూ.10 లక్షలు మంజూరు చేయాలని, హెల్పర్లకు రూ. 5లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రమాద బీమా పథక సౌకర్యాలు రూ.5 లక్షలు చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు దివాకర్, కార్మిక నాయకులు అల్లూరి లోకేష్, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు జాదవ్ రాజేందర్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఆత్మకూరి చిరంజీవి అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

పోడు భూమి పట్టాలు పంపిణీ చేసిన ఎంపీపీ



నవతెలంగాణ- ఆదిలాబాద్ రూరల్

ఆదిలాబాద్ మండలంలోని కచ్‌కంటి గ్రామంలో మంగళవారం ఎంపీపీ గంద్రత్ రమేష్ పోడు పట్టాలను పంపిణీ చేశారు. అంతకుముందు సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే జోగు రామన్న చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో గిరిజనులకు పోడుపు పట్టాలను పంపిణీ చేస్తామని హామీ ఇచ్చి వెంటనే అమలు చేసిన సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే జోగు రామన్నకే దక్కుతుందని తెలిపారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి చేసిన ఘనత టిఆర్ఎస్ పార్టీకే చెందిందని తెలిపారు. 70 సంవత్సరాలు పాలించిన కాంగ్రెస్, బీజేపీలు గిరిజనులకు సంక్షేమం కోసం ఎలాంటి అభివృద్ధి చేయలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కుర్ర లక్ష్మి శ్రీనివాస్, మార్కెట్ చైర్మన్ కొమురవిజయలక్ష్మి రాజు, మాజీ ఎంపీపీ సెవ్వ లక్ష్మి జగదీష్ యాదవ్, బీఆర్ఎస్ నాయకులు, కచ్‌కంటి గిరిజన ప్రజలు పాల్గొన్నారు.

టాస్క్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ పట్టణంలోని ప్రభుత్వ సైన్స్ కళాశాలలో టాస్క్ ఆధ్వర్యంలో ఒకరోజు అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ టాస్క్ శిక్షకులు రఘు తేజ విద్యార్థులకు టాస్క్ గురించి అవగాహన కల్పించారు. భవిష్యత్తులో టాస్క్ విద్యార్థుల ఉద్యోగ అవకాశాలకు ఏ విధంగా ఉపయోగపడుతుందో తెలియజేశారు. దీనికి సంబంధించిన నమోదు విధివిధానాలను తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్, కెప్టెన్ జగ్‌రాం అంతర్వేది, టాస్క్ కోఆర్డినేటర్ దాగిరి దయాకర్, అధ్యాపకులు డాక్టర్ ఏ.శ్రీనివాస్, కే. రఘునాథ్, ఆర్. సంతోష్ కుమార్, డాక్టర్ నర్సింగరావు, పీడీ అనిత, విద్యార్థులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి



నవతెలంగాణ-నార్నూర్

విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని మహిళ కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరీబాయి సూచించారు. మంగళవారం మండలంలోని మాన్యాపూర్ బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. ముందుగా వంట గదిని పరిశీలించి భోజనం తయారి విధానం తెలుసుకున్నారు. వర్షాకాలం ఉన్నందున విద్యార్థినీల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సూచించారు. రుచికరమైన భోజనంతో పాటు నాణ్యమైన విద్యను అందించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. పాఠశాలలో ఉన్న వసతులపై ఆరా తీశారు. ఆమె వెంట బీఆర్ఎస్ మండల నాయకురాలు విద్యారాణి, ప్రధానోపాధ్యాయుడు దేవ్‌షావ్, ఉపాధ్యాయలు ప్రతాప్ ఉన్నారు.

మెడికల్ కాలేజీలో స్థానికులకే ఉద్యోగ అవకాశాలు కల్పించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మండలంలోని అంకుసాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో గల మెడికల్ కళాశాలలో అవుట్ సోర్సింగ్ ఖాళీలలో స్థానికులకు అవకాశం కల్పించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు రేగుంట కేశవ్ డిమాండ్ చేశారు. మంగళశారం కళాశాల ప్రిన్సిపాల్ నాగార్జున చారిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలో స్వీపర్, అటెండర్ పోస్టులతో పాటు ఇతర పోస్టులకు అంకుసాపూర్ గ్రామానికి చెందిన వారికే మొదట అవకాశం కల్పించాలన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో అంకుసాపూర్ గ్రామస్తులు దుర్గం సుందరి, తోటపల్లి పద్మ, జంగపల్లి రేణుక, రేగుంట యశోద, వడ్లూరి కళావతి, దుర్గం తారాబాయి, జంగపల్లి తార, దుర్గం గౌతమి, సుమలత, జ్యోతి, నిర్మల, దుర్గ, మౌనిక, కాంత, లక్ష్మీ పాల్గొన్నారు.

బోనాలతో ఎస్ఎస్ఏ ఉద్యోగుల నిరసన

- ఆసిఫాబాద్‌లో మానవహారం, భారీ ర్యాలీ



నవతెలంగాణ-ఆసిఫాబాద్

తమ సర్వీస్ రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగులు కలెక్టరేట్ ఎదుట చేస్తున్న సమ్మెలో భాగంగా 16వ రోజు జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారి గుండా బోనాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ చౌక్ వద్ద మానవహారం ఏర్పాటు చేసి అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. అక్కడి నుండి జిల్లా విద్యాధికారి కార్యాలయం వరకు చేరుకున్నారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి మాట్లాడుతూ 15 సంవత్సరాలుగా పనిచేస్తున్న తమకు ఎటువంటి గుర్తింపు లేదని, అతి తక్కువ వేతనాలతో పనిచేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం డిమాండ్ పరిష్కరించే వరకు సమ్మె విరమించేది లేదని హెచ్చరించారు. ఉద్యోగం చేస్తున్న సమ్మెకు ఆదివాసి టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు మడవి శ్రీనివాస్, కొట్నాక భీంరావ్, జిల్లా అధ్యక్షులు తలండి లక్ష్మణ్, మనోహర్, ఉయిక శంకర్ లు మద్దతు తెలిపి నిర్వహణ ఖర్చుల కొరకు 2500 రూపాయలు, రిటైర్డ్ పిజి హెచ్ఎం జబ్బార్ 5000 రూపాయలు అందజేశారు. బిజెపి నియోజకవర్గ ఇన్‌చార్జి ఆత్మారామ్ నాయక్ మద్దతు తెలిపారు. రిలే నిరాహార దీక్షలలో సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తుకారాం, కోశాధికారి నగేష్, మీడియా ప్రతినిధి గేడేకార్ సంతోష్ కుమార్, అధికార ప్రతినిధి పవన్, నాయకులు దుర్గం సందీప్, పిటిఐ అధ్యక్షుడు సత్యనారాయణ, ఐఈఆర్పి అధ్యక్షుడు స్రవంతి, కేజీబీవీ నాన్ టీచింగ్ సిబ్బంది భవాని, తిరుమల మమత పాల్గొన్నారు.

మహిళా ఆరోగ్య కేంద్రాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-ఉట్నూర్

ప్రభుత్వం ద్వారా ఏర్పాటు చేసిన ఆరోగ్య మహిళా కేంద్రాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ కోరారు. మంగళవారం మండలంలోని శ్యాంపూర్ పీహెచ్‌సీలో ఆరోగ్య మహిళా కేంద్రం ప్రారంభోత్సవానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్ మల్లిక చేతుల మీదుగా కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సంధ్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళల ఆరోగ్య రక్షణకై ఆయా ఆరోగ్య కేంద్రాల వద్ద మహిళల కోసం ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేసి మహిళల దీర్ఘకాలిక రోగాలు. మహిళల్లో ఏర్పడే ఆరోగ్య సమస్యలపై కేంద్రాల్లో ప్రత్యేక మహిళా డాక్టర్లను నియమించి వారి ఆరోగ్య సమస్యలపై వైద్యం అందించడం జరుగుతుందన్నారు. మహిళలు తమ ఆరోగ్య సమస్యలు నేరుగా మహిళా డాక్టర్ వివరించి సమస్య అధికంగా ఉంటే నేరుగా జిల్లా కేంద్రానికి తరలించి వారి ప్రత్యేక వైద్య సేవలు అందించేందుకు ఏర్పాట్లను చేయడం జరుగుతుందన్నారు. అదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా మొత్తం 5 కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం ద్వారా ఏర్పాటు చేయబడ్డ కేంద్రాలను సద్వినియోగం చేసుకొని ఆరోగ్యాన్ని రక్షించుకోవాలన్నారు. అంతకు ముందు ఐటీడీఏ పీఓ చాహత్ బాజ్‌పాయ్ శ్యాంపూర్ పీహెచ్‌సీని సందర్శించారు. రోగులకు అందిస్తున్న వైద్య సేవలు తదితర వివరాలను శ్యాంపూర్ వైద్యాధికారి సందీప్‌ను అడిగి తెలుసుకున్నారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తనిఖీ చేశారు. రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై ఆస్పత్రి సూపరింటెండెంట్ జాధవ్ ఉపేందర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలోని జనరల్ వార్డుతో పాటు డయాలసిస్ సెంటర్, చిన్న పిల్లల వార్డులను పరిశీలించారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. ఆస్పత్రిలో అపరిశుభ్రంగా ఉండకుండా ఎప్పటికప్పుడు పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఆస్పత్రి చుట్టుపక్కల మొక్కలు పెంచి అహ్లాదకర వాతావరణం ఏర్పార్చలని సూచించారు. ఏమైన సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. అక్కడి నుంచి పాత ఉట్నూర్‌లోని గొండు రాజుల కోటను సందర్శించారు. కోటలో కోట్లాది రూపాయలతో చేపడుతున్న పలు అభివృద్ధి పనులు వివరాలు అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన పనులు పూర్తిచేసేలా చూడాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ జైవంత్‌రావ్, నర్సాపూర్ సర్పంచ్ కళావతి, ఏజెన్సీ వైద్యాధికారి బాలు, డాక్టర్లు విజయ్, అనురాధ, ఉట్నూర్ ప్రభుత్వాస్పత్రి వైద్య సిబ్బంది, ఐటీడీఏ ఈఈ భీంరావ్ ఉన్నారు.

చంద్రపూర్‌లో ఎస్పీ బార్డర్ సమావేశం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రానున్న ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, అక్రమ రవాణా నిర్వహించకుండా ముందస్తు చర్యల్లో భాగంగా మహారాష్ట్రలోని చంద్రపూర్ జిల్లాలో జిల్లా ఎస్పీ డి.ఉదయ్ కుమార్‌రెడ్డి, జిల్లా పోలీసు అధికారులు చంద్రపూర్ జిల్లా పోలీసు అధికారులు కలిసి బార్డర్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి సమాచార వ్యవస్థ కీలకంగా వ్యవహరిస్తుందని తెలిపారు. మీరు రాష్ట్రాల మధ్య ఎలాంటి సమస్యలనైనా క్షణాల వ్యవధిలో సమాచారాన్ని చేరవేసేందుకు, అంతర్‌రాష్ట్ర దొంగలను, అక్రమ రవాణా చేస్తున్న మద్యం, డబ్బులు, దేశిదారు, గంజాయి ఇతర అసాంఘిక కార్యకలాపాలను పూర్తిగా రూపుమాపవచ్చని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో తన ఉనికిని చాటేలా మావోయిస్టుల ప్రభావం ఉంటుందని వాటిని అరికట్టేలా మారుమూల ప్రాంతాలలో సైతం నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసుకొని ఇరు రాష్ట్రాల మధ్య అసాంఘిక శక్తులకు ఎలాంటి ఆస్కారం ఇవ్వకుండా, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రశాంతమైన వాతావరణంలో విధులను నిర్వర్తించాలని సూచించారు. ఎన్నికల నియమావళి అనంతరం తీసుకోవాల్సిన చర్యలు ఇరు రాష్ట్రాల మధ్య బోర్డర్ చెక్‌పోస్టులను ఏర్పాటు చేయడం, పెండింగ్‌లో ఉన్న ఎన్‌బీడబ్ల్యూలను పూర్తి చేయడం, ఇతర సహితమైన అంశాలపై ఇరు రాష్ట్రాలకు సంబంధించిన ఇద్దరు జిల్లాల ఎస్పీలు చర్చించారు.

పూర్తి సహాయ సహకారాలు అందిస్తాం : చంద్రపూర్ ఎస్పీ

అదేవిధంగా చంద్రపూర్ జిల్లా ఎస్పీ రవీంద్ర సిన్హా పరదేశి మాట్లాడుతూ ఆదిలాబాద్ జిల్లా పోలీసు వ్యవస్థకు చంద్రపూర్ జిల్లా పోలీసుల తరపున పూర్తి సహాయ సహకారాలను అందిస్తామని తెలిపారు. చంద్రపూర్ జిల్లాలో 24 గంటలు సమాచారం అందించే విధంగా కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయడం జరిగిందని, అత్యవసర విషయాలలో స్పందించే విధంగా తీసుకోవాల్సిన చర్యలపై, ఇరు రాష్ట్రాల బోర్డర్ సమస్యలపై చర్చించారు. అదేవిధంగా ఇరువైపుల చెక్‌పోస్టులను ఏర్పాటు చేస్తూ, పశువుల అక్రమ రవాణాపై చర్చించారు. ఎన్నికల నియమావళి వచ్చిన తర్వాత తీసుకోవాల్సిన తీసుకోవాల్సిన చర్యలపై పోలీసులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అదేవిధంగా ఆదిలాబాద్ జిల్లా పోలీసు అధికారులతో కలిసి జిల్లా ఎస్పీ డి.ఉదయ్ కుమార్ రెడ్డి చంద్రపూర్ మహంకాళి అమ్మవారిని దర్శించుకుని పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా నుంచి ఆదిలాబాద్ డీఎస్పీ వి.ఉమెందర్, ఉట్నూర్ డీఎస్పీ సీహెచ్ నాగేందర్, డీసీఐఆర్‌బీ డీఎస్పీ సీహెచ్ శ్రీనివాస్, వరొర, ఘడ్‌చందూర్ డీఎస్పీ నోపని, మూల్ డీఎస్పీ మల్లికార్జున, సీఐలు కే.నరేష్, ప్రేమ్ కుమార్, జైనథ్, గాదిగూడ ఎస్సైలు, మహారాష్ట్ర బోర్డర్ పోలీస్ స్టేషన్ పోలీస్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

రెగ్యులరైజేషన్‌ను బిచ్చంగా వేయండి కేసీఆర్ సారు..!



- 15వరోజుకు చేరుకున్న ఉద్యోగుల సమ్మె
- భిక్షాటన చేపట్టి.. బిచ్చగాడిని సైతం బిచ్చం అడిగి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ విద్యాశాఖ పరిధిలో పనిచేస్తున్న తమను రెగ్యులర్ చేయాలని, ఇతర డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ సమగ్రశిక్ష ఉద్యోగులు ఆందోళన బాట పట్టిన విషయం విధితమే. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట టెంట్ వేసుకుని గత పదిహేను రోజులుగా దీక్షలు చేపడుతున్నారు. ప్రభుత్వం నుంచి ఇంతవరకు ఎలాంటి స్పందన రాకపోవడంతో ఆందోళనను మరింత ఉధృతం చేస్తున్నారు. అందులో భాగంగానే దీక్షా శిబిరం వద్ద సోమవారం రాత్రి జాగరణ చేశారు. మంగళవారం ఉదయం దీక్షా శిబిరం నుంచి ఆర్టీసీ బస్టాండ్ వద్దకు ర్యాలీగా తరలివెళ్లి బిచ్చగాళ్ల లాగా వేషధారణలతో భిక్షాటన చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. బస్టాండ్‌లో ప్రయాణికులకు, సిబ్బందిని, పోలీసులను, బిచ్చం వేయాలంటూ అడుకున్నారు. ఒక బిచ్చగాడిని సైతం బిచ్చం వేయాలని అడుకున్నారు. తమ సర్వీసులను క్రమబద్ధీకరించడంతో పాటు మినిమం టైం పేస్కేల్ చెల్లించాలని ఆ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పడాల రవీందర్ మాధవ్ డిమాండ్ చేశారు. రూ.10లక్షల జీవిత బీమా, ఆరోగ్య బీమాను కల్పించాలని పేర్కొన్నారు. ఓ వైపు ప్రభుత్వం వివిధశాఖల్లోని కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేస్తుంటే విద్యార్హతలు, అనుభవం ఉన్న సమగ్రశిక్ష ఉద్యోగుల పట్ల వివక్ష చూపడం సరికాదన్నారు. తమ న్యాయ సమ్మతమైన డిమాండ్లను నెరవేర్చేవరకూ తమ పోరాటం సాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం ప్రతినిధులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-ఇచ్చోడ

అంగన్వాడీ కార్యకర్తల న్యాయబద్ధమైన సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని ఏఐసీసీ సభ్యులు డాక్టర్ నరేష్ జాదవ్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని అంబేద్కర్‌చౌక్‌లో అంగన్వాడీ కార్యకర్తలు చేపట్టిన రెండో రోజు నిరవధిక సమ్మెకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ పాలనలో ఉద్యోగుల సమస్యను పట్టించుకోవడం లేదన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఉద్యోగుల సమస్యను పరిష్కరిస్తుందని హామీనిచ్చారు. అంగన్వాడీ కార్యకర్తలకు సమస్యలు పరిష్కరం అయ్యేంత వరకు అండగా ఉంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొమురం కోటేశ్వర్, నారాయణరెడ్డి, ఆసీఫ్‌ఖాన్, ఏఐటీయూ నాయకులు గంగయ్య,అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ



నవతెలంగాణ-నిర్మల్

ఆర్టీసీలో అత్యంత ప్రతిభ కనబరిచిన ఉత్తమ డ్రైవర్లు, కండక్టర్లకు నిర్మల్ డిపోలో సన్మాన సభను మంగళవారం ఏర్పాటు చేశారు. డిపోకు అత్యధిక ఆదాయం సమకూర్చిన కండక్టర్‌లకు, డ్రైవర్‌లకు అత్యధిక డీజిల్ ఆదా చేసిన డ్రైవర్లకు ఆదిలాబాద్ రీజినల్ మేనేజర్ సాలోమాన్, డిప్యూటీ రీజినల్ మేనేజర్ ప్రణీత్‌లు ప్రశంశ పత్రాలు, నగదు ఇచ్చి అభినందించారు. వీరిని ఆదర్శంగా తీసుకుని మిగితా ఉద్యోగులు డిపోకు ఆదాయం తీసుకువచ్చి సంస్థ అభివృద్ధి దోహద పడాలని ఈ సందర్భంగా సూచించారు. రీజియన్‌లోనే మొదటి స్థానంలో ఉన్న డిపో స్టేట్‌లోనే నెంబర్ వన్ డిపోగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ ప్రతిమరెడ్డి, సహాయ మేనేజర్లు ఐ.రాజశేఖర్, శ్రీకర్ అవార్డు గ్రహీతలు, ఉద్యోగులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



నవతెలంగాణ-నేరడిగొండ

మండలంలోని చిన్న బుగ్గారం గ్రామానికి చెందన వందన ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్ మంగళవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఆయన వెంట పీఏసీఎస్ మాజీ చైర్మెన్ నానాక్ సింగ్, ఉపసర్పంచ్ విలాస్, మోహన్, గోవింద్, రాజు, రవికాంత్, పాండు, ప్రతాప్, సర్పంచ్, బీంరావు, సద్దాం, సునీల్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న భగీరథ కార్మికుల నిరసన



నవతెలంగాణ-ఆసిఫాబాద్

తమ డిమాండ్లు పరిష్కరించి, పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరుతూ మిషన్ భగీరథ కార్మికులు చేస్తున్న నిరసన కొనసాగుతుంది. మంగళవారం 11వ రోజు ధనోరా, మాణిక్‌గూడ పంప్‌హౌస్‌ల వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భగీరథ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని, పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. యాజమాన్యాలు సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని, లేని పక్షంలో ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అల్లూరి లోకేష్, దుర్గం లింగయ్య, జేఏసీ నాయకులు దివాకర్, చిరంజీవి, భూక్య రాజు నాయక్, మిషన్ భగీరథ కాంట్రాక్ట్ కార్మికులు బాలేష్, సురేష్, వెంకటేష్, తాజ్, శ్రీకాంత్, అనిల్, రవీందర్, వేణు, రాజేష్, ప్రేమ్‌దాస్, తిరుపతి, సంతోష్, బుడ్డయ్య, అంబాజీరావు, మధుకర్, ఈశ్వర్ పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మహిళల ఆర్థిక అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యమని జడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావ్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన స్త్రీనిధి, డ్వాక్రా గ్రూప్ మహిళలకు రుణల చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళల ఆర్థిక అభివృద్ధి కోసం సంఘాల ద్వారా రుణాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. వీటిని సద్వినియోగం చేసుకుని ఆర్థిక అభివృద్ధి సాధించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఎన్నడూ లేని విధంగా మహిళల అభివృద్ధి కోసం కృషి చేస్తుందన్నారు. గతంతో పోలిస్తే మహిళలు ఎంతగానో ఆర్థిక అభివృద్ధి సాధించారన్నారు. అనంతరం డ్వాక్రా కమ్యూనిటీ భవనానికి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మల్లికార్జున్, ఏపీఓ శ్రీనివాస్, సభ్యులు సుధాకర్, శ్రీనివాస్, సరస్వతి, స్వరూప డ్వాక్రా గ్రూప్ మహిళలు పాల్గొన్నారు.